నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

గురువారం THURSDAY 19.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4

సంపుటి (Volume): 14 || సంచిక (Issue): 105 || వెల (Price) రూ.6.50

విదియ

గురువారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-15. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: విదియ రాత్రి 12-40 వరకు. నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉదయం 8-03 వరకు, తదుపరి రేవతి తెల్లవారుజామున 5-15 వరకు. వర్జ్యం: సాయంత్రం 6-40 నుంచి రాత్రి 8-05 వరకు. రాహుకాలం: పగలు 1-40 నుంచి పగలు 3-11 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-08 నుంచి ఉదయం 10-56 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 2-59 నుంచి పగలు 3-48 వరకు. అమృతకాలం: రాత్రి 3-07 నుంచి తెల్లవారుజామున 4-32 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

కేసీఆర్ హయాంలో పారిశ్రామిక ప్రగతి



- పదేండ్లలో ఎంఎస్‌ఎంఈల వృద్ధి 15శాతం
- ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో వెల్లడి
- వర్ధించిన విస్తరిలా తెలంగాణ రాష్ట్రం
- ఎంఎస్‌ఎంఈ పాలసీ ఆవిష్కరణలో సీఎం రేవంత్


› 8



కాన్పు కోసం కడుపుపై తొక్కి..

- హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రిలో అమానవీయం
- డాక్టర్లు లేక నర్సుల వైద్యం
- నొప్పుల కోసం గర్భిణి పొట్టపై తొక్కి పురుడు
- పుట్టిన గంటలోపే కన్నుమూసిన శిశువు

› 6



జమిలి ఎన్నికలకు క్యాబినెట్ ఓకే

- కోవింద్ కమిటీ నివేదికకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం
- 100 రోజుల ఎడంతో రెండు దఫాల్లో ఎన్నికలు
- తొలుత లోక్‌సభ, అసెంబ్లీలకు
- రెండోదశలో స్థానిక సంస్థలకు
- వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టే అవకాశం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)


హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): దేశంలో జమిలి ఎన్నికలకు (ఏకకాల ఎన్నికలకు) ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ రూపొందించిన నివేదికను ఈ మేరకు ఆమోదించింది. వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే › 10వ పేజీలో

రీజినల్ రింగ్ మాస్టర్లు!

అస్మదీయుల కోసమే ట్రిపుల్ ఆర్ అష్ట వంకరలు

- గీత మారిన దగ్గరల్లా కాంగ్రెస్ నేతలకు వందల ఎకరాలు
- ప్రభుత్వ పెద్దలకు మేలు చేసేలా అలైన్‌మెంట్‌లో మార్పులు
- రైతుల చేన్లను చీల్చుతూ పెద్దోళ్ల భూముల కోసం బాటలు
- వికారాబాద్ వైపు మరింత జరిపేలా కదులుతున్న పావులు
- అలైన్‌మెంట్ మారినచోట క్షేత్రస్థాయిలో రెడ్‌కలర్ మార్కింగ్
- 'ప్రజా ప్రయోజనం' ఉత్తదే.. బలవుతున్నది పేద రైతులే

ప్రత్యేక కథనం 2



హైదరాబాద్ మహా నగరం చుట్టూ చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) రంగులు మార్చుకుంటున్నది. దక్షిణభాగంలో దారి తప్పుతున్నది. గుట్టుగా రూటు మార్చుకుని, బడా నేతల భూముల దగ్గర గీత దాటుతున్నది. గతంలో 189 కిలోమీటర్లు పొడవైన రింగ్‌రోడ్డును 5 కిలోమీటర్లకు పెంచినట్టే పైకి కనపడుతున్నా.. వాస్తవానికి అది అవుట్‌లైన్! ఆ 5 కిలోమీటర్ల పరిధిలో వేల ఎకరాలు రానున్నాయి. ఒక్క గీత వందల ఊర్ల తలరాతను మార్చనున్నది. కొందరు నేతల జేబులు నింపనున్నది. మరెందరినో బజారున పడేయనున్నది. వంకరటింకరగా తిరిగిన ట్రిపుల్ ఆర్ పెద్దోళ్ల డొంకల్లోకి మళ్లింది. అధికార పార్టీ నేతలు ముందుగానే కొని పెట్టుకున్న భూముల కోసమే రోడ్డు మెలిక తిరిగింది. అస్మదీయుల కోసమే అలైన్‌మెంట్ మారింది. ఇంతకీ ఎవరా బడా నేతలు! ఎవరా రీజినల్ రింగ్ మాస్టర్లు!

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబరు 18 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం వంకరలు తిరుగుతున్నది. చడీచప్పుడు లేకుండా తన దిశను మార్చుకుని పేదోళ్ల చేలను చీల్చుకుంటూ.. పెద్దోళ్ల భూముల వైపు కదులుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను అష్టవంకరలు తిప్పుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా చేపట్టిన మార్పుల వెనక భారీ కుట్ర కనిపిస్తున్నది. ప్రభుత్వ పెద్దలతోపాటు కాంగ్రెస్‌కు చెందిన కొందరు నేతలకు › 3వ పేజీలో

ఈ భూదందాకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి **91827 77711**

విల్లాలు సల్లంగుండాలె.. మా భూములు మునగాల్నా?



రీజినల్ రింగ్‌రోడ్డు రూట్ మారిస్తే నా భూమి ఎకరం వరకు రోడ్డులోనే పోతున్నది. ఊరు దగ్గరగా ఉన్నదని నా భూమిలోనే ఇల్లు కట్టుకున్న. ఇప్పుడు పొలం, ఇల్లు రెండూ పోతున్నయ్. ఊరికి ఒకవైపున కరెంట్ హైటెన్షన్ వైర్ పోతున్నది. ఇంకోసైడు ట్రిపుల్ ఆర్ కోసుకుపోతున్నది. మా బాధ ఎవరికి చెప్పుకోవాలె? ఒకవైపు మాజీ ఎంపీ భూములున్నయ్. కోట్లు విలువచేసే విల్లాలు కడుతున్నరు. వాళ్ల భూములు ఇంచుకూడా పోతలేవు. మా జాగలు రోడ్డుపాలవుతున్నయ్. విల్లాలు సల్లంగుండాలె.. పేదోళ్లు మునగాల్నా? - వెంకటేశ్, రైతు అంతారం

ఫార్మా రైతులకు హైకోర్టు నోటీసులు

భూములు ఇవ్వడంలో అభ్యంతరమేమిటని ప్రశ్న › 2



పట్టా పత్రాలతో ముట్టడి | సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించి పట్టా పత్రాలతో నిరసన తెలుపుతున్న రుణమాఫీ కాని రైతులు

నేడు చలో ప్రజాభవన్

రుణమాఫీ కాని రైతుల పిలుపు

- మద్దతివ్వాలని కులసంఘాలకు వినతి.. సోషల్ మీడియా ద్వారా రైతులంతా ఏకం
- ప్రభుత్వం మాట తప్పిందని ఆగ్రహం.. మాఫీ అయ్యేదాకా పోరాడుతామని హెచ్చరిక
- రుణమాఫీ ధోకాపై మీరైనా జోక్యం చేసుకోండి.. గవర్నర్‌కు నెన్నెల రైతుల లేఖలు

హైదరాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): రుణమాఫీ అమలుకాని రైతులు పోరుబాట పట్టారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్న డిమాండ్‌తో గురువారం చలో ప్రజాభవన్ నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బ్యాంకుల ముందు, ప్రభుత్వ ఆఫీసుల ముందు ధర్నాలు చేస్తున్న రుణమాఫీ కాని రైతులు సోషల్‌మీడియా వేదికగా ఏకమవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం చలో ప్రజాభవన్‌కు తరలి రావాలంటూ సోషల్‌మీడియా వేదికగా ఒక యువ రైతు ఇచ్చిన పిలుపు వైరల్‌గా మారింది. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా రైతులంతా ఏకమై పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీపై రైతులకు ఇచ్చిన మాట తప్పిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 20న › 7వ పేజీలో

బీసీ డిక్లరేషన్ కోసం పోరు



- నవంబర్ 10లోపు అమలు చేయకుంటే ఉద్యమిస్తాం
- రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర కులగణనను చేపట్టాలి
- స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్‌కు 30 వేల కోట్లు కేటాయించాలి
- తమిళనాడు రిజర్వేషన్లపై అధ్యయనం చేస్తాం: కేటీఆర్
- బీసీ నేతలతో తెలంగాణ భవన్‌లో సమావేశం › 2



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, రమణ, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద, కాలేరు వెంకటేశ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న తదితరులు

బీసీల కోసం బీఆర్‌ఎస్

- సమగ్ర కుల గణన వెంటనే చేపట్టాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలి
- బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాల్సిందే
- వచ్చే బడ్జెట్‌లో 30 వేల కోట్లు కేటాయించాలి
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుచేయాలి
- నవంబర్ 10లోపు చేయకుంటే పోరాటం
- బీసీ నేతలతో తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) కదిలింది. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి వచ్చే నవంబర్ 10 నాటికి ఏడాది అవుతుంది. ఆలోగా బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ప్రకటించింది. సమగ్ర కుల గణనను వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు హామీ ఇచ్చిన విధంగా 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సమగ్ర కుల గణన పెద్ద కష్టమేమీ కాదని, గతంలో కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే ఒకే రోజులో చేశారని ఆయన గుర్తు చేశారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ. 25-30వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీసీ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, తెలంగాణ సర్పంచ్‌ల సంఘం, తెలంగాణ ఎంపీటీసీ జిల్లా సంఘం అధ్యక్షులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మూడు గంటలకు పైగా సమావేశం కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలకు ఇచ్చిన హామీలు, వాటి అమలుకు ప్రభుత్వంపై ఏ విధంగా ఒత్తిడి తేవాలనే దానిపై చర్చించారు. సమావేశానికి హాజరైన నేతలు అభిప్రాయాలను కేటీఆర్ తెలుసుకున్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేటీఆర్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ నిరుడు నవంబర్ 10న కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట బీసీలను కాంగ్రెస్ మోసం, దగా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని బీఆర్‌ఎస్ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బలహీన వర్గాల పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటాడుతామని, నిలదీస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలు చేసే దాకా వదిలిపెట్టేది లేదన్నారు.

వచ్చే బడ్జెట్‌లో 30వేల కోట్లు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీని నవంబర్ 10లోగా నెరవేర్చకుంటే పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని కేటీఆర్ తెలిపారు. బీసీలకు ఐదేండ్లలోపు లక్ష కోట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 8 వేల కోట్ల రూపాయలు మాత్రమే పెట్టి బీసీలను మోసం చేసిందని విమర్శించారు. మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా బీసీ సబ్‌ప్లాన్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంబీసీల కోసం ప్రత్యేకంగా మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారని, ఆ మాటకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. క్యాబినెట్‌లో బీసీ మంత్రులు ఇద్దరు మాత్రమే ఉన్నారని, వారికి మరిన్ని మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 22 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేప పిల్లల పంపిణీ ఆపేసి ముదిరాజ్‌లు, గంగపుత్రులకు ప్రభుత్వం అన్యాయం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి రూ.30వేల కోట్ల సంపదను సృష్టించిందని గుర్తుచేశారు. బలహీనవర్గాల కోసం ఏర్పాటుచేసిన గురుకుల విద్యాసంస్థల్లో ప్రమాణాలు దిగజార్చి వారి విద్యావకాశాలను దెబ్బకొడుతున్నదని విమర్శించారు.

కుంటి సాకులు చెబుతున్నారు

ఒకప్పుడు ఇదే గాంధీ, ఉస్మానియా దవాఖానలు కరోనా సమయంలో వేలాదిమంది ప్రాణాలను కాపాడాయని కేటీఆర్ గుర్తు చేశారు. ఒకే నెలలో 48 మంది పిల్లలు, 14 మంది బాలింతలు ఒక్క దవాఖానలోనే మరణించిన విషయం వాస్తవం కాదా? అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ సమస్యను సరి చేయాల్సింది పోయి కుంటి సాకులు చెప్పడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైరల్ జ్వరాలు, డెంగ్యూ విజృంభిస్తున్న నేపథ్యంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శాసనమండలి బీఆర్‌ఎస్ పక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, ఎల్ రమణ, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్,రాజు, మాజీ ఎమ్మెల్యేలు సురేందర్, అంజయ్యగౌడ్, నోముల భగత్, బిక్షమయ్య గౌడ్, కర్నె ప్రభాకర్, నరేందర్, పల్లె రవికుమార్, దాసోజు శ్రవణ్, గట్టు రాంచందర్‌రావు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాకేశ్‌కుమార్, అంజనేయులు, బాలరాజుయాదవ్, రాజారాంయాదవ్ పాల్గొన్నారు.

వర్కింగ్ గ్రూపులుగా క్షేత్ర స్థాయిలోకి..

తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్‌లు ఏ విధంగా అమలవుతుందో తెలుసుకోవడానికి శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి నేతృత్వంలో ఒక బృందం అక్కడ పర్యటిస్తుందని కేటీఆర్ తెలిపారు. బీసీల సమస్యలపై పార్టీలోని బలహీన వర్గాల నేతలను వర్కింగ్ గ్రూపులుగా విభజించి బీసీల సమస్యలు, వాటి పరిష్కారాలు, ప్రత్యక్ష పోరాటాల కోసం పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన సలహాలు సూచనలు ఇస్తామన్నారు.

బీసీలకు అత్యధిక సీట్లు

గతంలో చట్టసభల్లో బీసీలకు అత్యధిక సీట్లను బీఆర్‌ఎస్ ఇచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు. 2014, 2018, 2023 ఎన్నికల్లోనూ, తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికల్లోనూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కన్నా ఎక్కువ సీట్లను బలహీన వర్గాలకు కేటాయించిందని పేర్కొన్నారు. గతంలో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపామని, ఇటీవల బీఆర్‌ఎస్‌కు ఒక రాజ్యసభ స్థానం వస్తే దానిని కూడా బీసీలకు కేటాయించామని పేర్కొన్నారు. 50 మంది కార్పొరేషన్ చైర్మన్లను నియమిస్తే వారిలో 27 మంది బీసీ బిడ్డలకు అవకాశం ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలకు పెద్దదిక్కుగా కేసీఆర్ ఉంటారని తెలిపారు. సమగ్ర కులగణనకు సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఆ పాలమూరు బిడ్డకు గుర్తుచేయరూ..!

వట్టెం ఎత్తిపోతల పంపులు నీళ్లలో ఉన్నా సీఎంకు పట్టదా? ● ఢిల్లీ పెద్దల మనసు గెలిచే పనిలోనే బిజీబిజీ.. కేటీఆర్ ఎద్దేవా

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): 'వట్టెం ఎత్తిపోతల పంప్‌లు నీట మునిగాయనే విషయాన్ని పాలమూరు బిడ్డకు ఎవరన్నా గుర్తుచేయండి' అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కంప్యూటర్ పునరావిష్కరణ.. పెద్దలను ప్రసన్నం చేసుకోవటానికి ఢిల్లీకి చక్కర్లు.. అంటూ సీఎం రేవంత్‌ను దెప్పిపొడిచారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన బాహుబలి వంటి మోటర్లు నీట మునిగినా పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. 18 మీటర్ల లోతు నీటిలో మునిగిన పంపులను తక్షణమే పట్టించుకోవాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ ప్రగతిని తుడిపేయలేరు

పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ సాధించిన ప్రగతిని ఎవరూ తుడిపేయలేరని కేటీఆర్ స్పష్టంచేశారు. కేసీఆర్ హయాంలో పదేండ్లపాటు అప్రతిహతంగా సాగిన ప్రగతిని ఎవరూ కాదనలేరని తేల్చిచెప్పారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి విడుదల చేసిన గణాంకాలను ఎక్స్‌వేదికగా ట్యాగ్ చేస్తూ.. కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో జాతీయ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ తలసరి ఆదాయం 94 శాతం అధికంగా ఉన్న సత్యాన్ని ఎవరూ కాదనలేరని తాజా గణాంకాలే తేల్చిచెప్తున్నాయని కేటీఆర్ ఉదహరించారు.

దళితులకు మంత్రి జూపల్లి క్షమాపణలు చెప్పాలి

- **బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దళితులకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో గురుకుల పాఠశాల భవనం కోసం భూమిని ఎంపిక చేయడంతో న్యాయం చేయాలని అడిగిన దళితులను సెక్యూరిటీ పెట్టి అడ్డగించిన మంత్రి జూపల్లి నిర్వాకంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'దళితులపై మంత్రి జూపల్లి చిర్రుబుర్రు' కథనానికి ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. అన్యాయం జరుగుతున్నదని, న్యాయం చేయండని వచ్చిన దళితులపై ఇంత కర్కశత్వమా? అని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు. దళిత బిడ్డలు మీ భూములివ్వమని అడగలేదని, వారికి గతంలో ఇచ్చిన భూములను తీసుకోకుండా న్యాయం చేయాలని అడిగారని పేర్కొన్నారు. అంతమాత్రాన తీవ్రస్వరంతో గద్దిస్తూ సెక్యూరిటీని పెట్టి బాధిత దళితులను బయటకు పంపిస్తారా? ఇందిరమ్మ రాజ్యం లో దళితులకు న్యాయం చేయరా? అని ప్రశ్నించారు. అణిచివేత ఎక్కువైతే తిరుగుబాటు మొదలవుతుందన్న సహజ సూత్రాన్ని మరిచిపోవద్దని హితవు పలికారు.

కొత్త చట్టాలపై వినోద్ న్యాయపోరాటం

- సుప్రీంకోర్టులో మాజీ ఎంపీ పిటిషన్
- విచారణకు స్వీకరించిన ధర్మాసనం
- టేబులార్ ఫార్మాట్‌లో ఇవ్వాలని సూచన



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): కేంద్రం అమల్లోకి తెచ్చిన మూడు కొత్త న్యాయ చట్టాలపై మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సుప్రీం కోర్టుకు వెళ్లారు. ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం పరిశీలించి టేబులార్ ఫార్మాట్‌లో తిరిగి సమర్పించాలని సూచించింది. కొత్త నేర, న్యాయచట్టాల్లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని పిటిషన్‌లో బోయినపల్లి పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 కింద నిందితులకు ఉన్న ప్రాథమిక హక్కులకు భంగం కలిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 348 ప్రకారం అధికార ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ ఇంగ్లిష్‌లో ఉండాలి. కానీ, కొత్తచట్టాల పేర్లను హిందీలో పెట్టారు. న్యాయ సంహిత, న్యాయ సురక్ష సంహిత, సాక్ష్య అధినియమ్ అర్థాలు ఆంగ్ల నిఘంటువుల్లో లేవని, క్షేత్రస్థాయిలో ఈ చట్టాలను అమలు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వాలే కాబట్టి వారి సూచనలు స్వీకరించి చట్టాల్లో ఉన్న లోపాలను సరిదిద్దాలని కోరారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్లు 15, 43(3), 94, 96, 107, 185, 187, 349, 479, 118, 152, భారతీయ సాక్ష్య అధినియమ్‌లోని సెక్షన్ 23 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21, 348కి విరుద్ధంగా ఉన్నందున వాటిని కొట్టేయాలని వినోద్‌కుమార్ కోరారు.

నోట్ దిస్‌పాయింట్

సుప్రీంకోర్టు ధర్మాసనానికి బోయినపల్లి సమర్పించిన పిటిషన్‌లోని అంశాల్లో కొన్ని...

- 160 మంది ప్రతిపక్షాల సభ్యులను సస్పెండ్ చేసి, పార్లమెంట్‌లో సమర్థవంతమైన చర్చ జరగకుండానే ఈ మూడు చట్టాలను ఆమోదించారని పేర్కొన్నారు.
- భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) గ్యాంగ్, మొబైల్ ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్రూప్స్ వంటి పదాలను నిర్వచించలేదు.
- మానసిక అస్వస్థత నిర్వచనంలో మెంటల్ రిటార్డేషన్ అంశాన్ని మినహాయించారు. మానసికంగా ఎదుగుదలలేని వ్యక్తులను ప్రాసిక్యూట్ చేయవచ్చునని పేర్కొనటం అభ్యంతరకరం.
- దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతలకు ముప్పు కలిగించే దేశద్రోహ చర్యల స్థానంలో కొత్త నేరాన్ని ప్రవేశపెట్టారు.
- భారతీయ సాక్ష్య అధినియం, 2023 ప్రకారం ఎలక్ట్రానిక్ రికార్డులు ప్రాథమిక సాక్ష్యాధారాలుగా పరిగణిస్తారు. పాత చట్టంలో వీటిని సెకండరీ సాక్ష్యాలుగా పేర్కొన్నారు.
- ఎఫ్ఐఆర్ నమోదుకు 15 రోజులు, పోలీస్ కస్టడీ 14 రోజులకు బదులు 90రోజుల దాకా అవకాశమిచ్చారు. తద్వారా బాధితుడికి అన్యాయం జరుగుతుంది.
- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, బార్ అసోసియేషన్ల అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా చట్టాలను తీసుకురావటం వల్ల వీటిపై సమగ్ర చర్చ జరగలేదనే విషయాన్ని గుర్తించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.
- పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కొత్త చట్టాలను పరిశీలించి అనేక సూచనలు చేసినా కేంద్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదన్న విషయాన్ని ఉటంకించారు.
- దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ న్యాయవాదులు, మేధావులు, సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తున్న ఉదంతాలను ఆయన ఉదహరించారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త ఇంటిపై కాంగ్రెస్ దాడి

ఖమ్మంలో అర్ధరాత్రి విధ్వంసం ● కాంగ్రెస్‌లోకి వెళ్లనందుకే వేధింపులు

రఘునాథపాలెం, సెప్టెంబర్ 18: కాంగ్రెస్‌లోకి రావడంలేదనే కారణంతో ఓ బీఆర్‌ఎస్ కార్యకర్త ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి విధ్వంసం సృష్టించారు. బాధితుడు చీటిక వినయ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా దానవాయిగూడెంనకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త చీటిక వినయ్‌ను తమ పార్టీలో చేరాలంటూ కాంగ్రెస్ నాయకులు ఆరు నెలలుగా ఒత్తిడి చేస్తున్నారు. అతడు నిరాకరించడంతో అక్రమ కేసులు పెడుతున్నారు. కాలనీలోని వినాయక మండపం వద్ద సోమవారం కొందరు యువకులు దాడులు చేసుకున్నారు. అయితే వినయ్ ప్రమేయంతోనే దాడులు జరిగినట్టు మంగళవారం ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో కొందరు తప్పుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు పిలవడంతో వినయ్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరనే విషయాన్ని తెలుసుకున్న అదే కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు కృష్ణ, సందీప్, ఈశ్వర్, సైదులు వినయ్ ఇంట్లోకి చొరబడి వస్తువులు, కిచెన్ సామగ్రిని ధ్వంసం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినయ్ ఫిర్యాదు చేస్తే సీఐ ఫిర్యాదు తీసుకోలేదు. పైగా ఏఎస్ఐ వెంకటేశ్వర్లు ఓ ఖాళీ కాగితం తీసుకొచ్చి వినయ్‌తో బలవంతంగా సంతకం తీసుకున్నాడు.



బీఆర్‌ఎస్ కార్యకర్త వినయ్ ఇంట్లో కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన వస్తువులు, ఫర్నీచర్. (ఇన్‌సెట్) వినయ్



స్టాల్స్‌లో వెదురు వస్తువులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కులవృత్తులకు ప్రాధాన్యత కల్పించాం

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 18: కేసీఆర్ ప్రభుత్వంలో కులవృత్తులకు అత్యంత ప్రాధాన్యత కల్పించి.. అండగా నిలిచామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ చౌరస్తాలో మేదరి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ మంత్రి హాజరై మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రైతులకు హైకోర్టు నోటీసులు

- ఫార్మాసిటీకి భూములు ఎందుకివ్వడం లేదని ప్రశ్న
- నష్టపరిహారం తీసుకోకపోవడంపై వివరణ ఇవ్వాలని ఆదేశం



హైకోర్టు జారీ చేసిన నోటీసులను బుధవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నానక్‌నగర్ గ్రామ పంచాయతీ వద్ద చూపిస్తున్న రైతులు


యాచారం, సెప్టెంబర్ 18: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నానక్‌నగర్‌కు చెందిన కొంత మంది రైతులకు బుధవారం హైకోర్టు నోటీసులు అందజేసింది. ఫార్మాసిటీకి భూములు ఎందుకు ఇవ్వడం లేదని, పరిహారం ఎందుకు తీసుకోవడం లేదని, అసలు తమ అభ్యంతరం ఏమిటో వెంటనే తెలియజేయాలని ఆ నోటీసులలో పేర్కొన్నది. ఈ నెల 27న వ్యక్తిగతంగా కాని, న్యాయవాదితో గాని హైకోర్టులో రైతులు తమ వివరణ ఇవ్వాలని నోటీసులో స్పష్టంచేసింది. దీంతో రైతులు ప్రభుత్వం పట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మూడు రోజుల క్రితం మేడిపల్లికి చెందిన 72 మంది రైతులకు కోర్టు నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. తాజాగా నానక్‌నగర్‌కు చెందిన రైతులకు నోటీసులు జారీ చేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. బాధిత రైతులందరూ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. ఏదేమైనా ఫార్మాసిటీకి భూములిచ్చేది లేదని స్పష్టంచేశారు. కోర్టు నుంచి నోటీసులు రావడంతో రైతులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఎన్నికల ముందు ప్రస్తుత మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఫార్మా గ్రామాలలో పర్యటించి, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాను రద్దు చేస్తామని, రైతుల భూములు రైతులకే ఉంటాయని ప్రగల్భాలు పలికి.. నేడు గద్దెనెక్కి రైతులను పూర్తిగా విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీ గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు మరో ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్టు తెలిపారు. ఫార్మాసిటీకి మొత్తం 19,333 ఎకరాల భూసేకరణలో మండలంలో 9,851 ఎకరాలకు గానూ 7,640 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమిని సేకరించిన విషయం తెలిసిందే. మొదట్లో అసైన్డ్ భూమి ఎకరాకు రూ.7 లక్షలు, పట్టాకు రూ.12.5 లక్షలు ఇచ్చి, తరువాత రైతుల డిమాండ్ మేరకు అసైన్డ్ భూమికి ఎకరాకు రూ.7.70 లక్షలు, పట్టాకు రూ.16 లక్షల పరిహారం అందజేశారు. కొంత మంది భూములిచ్చి పరిహారం తీసుకోగా.. మరి కొంత మంది భూములిచ్చేదిలేదని పరిహారం తీసుకోలేదు. రైతులు తమ అభిప్రాయం చెప్పాలని హైకోర్టు పిలుపునివ్వడంతో మరోసారి కోర్టుకు వెళ్లనున్నట్టు అన్నదాతలు తెలిపారు.

సోనియా తల్లి అయితే బలిదేవత ఎవరు ?

ఉద్యమంలో రేవంత్‌రెడ్డి పాత్ర ఏంది?

అధికారిక కార్యక్రమాల్లోనూ బజారు భాష

బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): సోనియాగాంధీ తెలంగాణ తల్లి అయితే బలి దేవత ఎవరని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ప్రశ్నించారు. డిసెంబర్ 9 ప్రకటనను వెనక్కి తీసుకోవడంతోనే వందలాది మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడే అర్హత రేవంత్‌రెడ్డికి ఉందా ? అని ప్రశ్నించారు. ఉద్యమంలో ఆయన పాత్ర ఏంటని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి తనకు కాకపోయినా కుర్చీకి గౌరవం ఇవ్వాలని అడుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారిక కార్యక్రమాల్లో సీఎం బజారు భాష మాట్లాడుతున్నారని, రేవంత్‌రెడ్డి స్పీచ్‌కు ముందు 'ఓన్లీ అడల్ట్' అని చెప్పి మీడియాలో ప్రసారం చేయాలని సూచించారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరపడం ఎవరితరమూకాదని, ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నాడని స్పష్టంచేశారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	35.7°c	19.2°c
ఆదిలాబాద్	35.1°c	21.7°c
మెదక్	34.3°c	19.2°c
ఖమ్మం	34.0°c	23.0°c
హైదరాబాద్	32.8°c	23.0°c
నల్లగొండ	32.5°c	24.8°c
మహబూబ్‌నగర్	32.3°c	21.4°c
నిజామాబాద్	32.3°c	23.4°c
వరంగల్	32.0°c	23.0°c
కరీంనగర్	32.0°c	24.0°c

స్కూళ్లకు గ్రాంట్స్ విడుదల

రాష్ట్రంలోని 26,387 బడులకు 48.86 కోట్లు

'చాక్‌పీస్‌లకు డబ్బుల్లేవ్.!' కథనానికి స్పందన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 18: ప్రభుత్వ పాఠశాలలకు మొదటి విడత నిర్వహణ నిధులను సర్కారు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 26,387 స్కూల్స్‌కుగానూ రూ.48.86 కోట్లు బుధవారం రిలీజ్ అయ్యాయి. ఈ నిధులను వసతుల కల్పన, క్రీడలకు వినియోగించనున్నారు. బడులు తెరుచుకొని మూడు నెలలైనా నిధులు లేవంటూ 18వ తేదీన (బుధవారం) 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'చాక్‌పీస్‌లకు డబ్బుల్లేవ్.!' కథనానికి ప్రభుత్వం స్పందించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, సామాజిక వర్గం ప్రాతిపదికన గ్రాంట్లు కేటాయించింది. ఉపాధ్యాయుల ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడంతోపాటు నిధులు విడుదలకు కృషి చేసిన 'నమస్తేతెలంగాణ'కు ఉపాధ్యాయ లోకం కృతజ్ఞతలు తెలిపింది.

నమస్తే ఎఫెక్ట్

పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

చిల్పూరు, సెప్టెంబర్ 18: జనగామ జిల్లా చిల్పూరు మండలం కొండాపూర్‌లో విద్యుత్తు సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేసి బిగించారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'కరెంట్ లేక ఎండుతున్న పొలాలు' కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. 40 ఎకరాల్లో వరి, 15 ఎకరాల్లో మక్క పంట ఎండిపోయిందని రైతులు ఆందోళన చెందగా నమస్తే తెలంగాణ వెలుగులోకి తేగా, వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ గడ్డం గణేశ్, ఏడీ వంశీకృష్ణ, ఏఈ రమేశ్, సబ్‌ఇంజినీర్ వినీత్‌రెడ్డి, లైన్‌ఇన్‌స్పెక్టర్లు యాదగిరి, చంద్రశేఖర్, రైతులు వెలిశాల రవీందర్, మారబోయిన యాదగిరి, చొక్కం రాజు, వెలిశాల రాజయ్య, కూరపాటి రమేశ్, కుంచం రాజు, వెలిశాల అనిల్, చొక్కం మల్లేశ్, జోడుముంతల బుచ్చిరాములు, మారబోయిన సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసం మంత్రి ఉత్తమ్ కక్కుర్తి

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్


నడిగూడెం, సెప్టెంబర్ 18: కమీషన్ల కోసం కక్కుర్తి పడి టెండర్ల పేరుతో కాలయాపన చేస్తూ సాగర్ ఎడమ క్వాలకు పడిన గండిని పూడ్చడంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలో ఎండిపోయిన వరి పైర్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ కాగితపు రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు గండి పడి సుమారు 500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. గండి పూడ్చకపోవడంతో సాగునీరు లేక 50వేల ఎకరాల్లో వరి ఎండిపోతున్నదని తెలిపారు. ఎండిపోతున్న పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ ఆఫీసు కూల్చివేతపై 'సుప్రీం'కు వెళ్తాం

నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ, సెప్టెంబర్ 18: బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా ఆఫీస్‌ను కూల్చాలన్న లక్ష్యంగా కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ ఆఫీసును కూల్చేయాలన్న హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తామని పేర్కొన్నారు. దీనిపై వెంటనే అప్పీల్‌కు వెళ్తామని, అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తామే తప్ప కూల్చుతుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ ఆఫీసుకూ అనుమతి లేదన్న ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చడాలు గాక నిలబెట్టడం నేర్చుకోవాలని బుధవారం ఓ ప్రకటనలో హితవుపలికారు.

ఫోర్త్ సిటీ.. ఫ్యూచర్ ట్రేడింగ్?



ఎంతెంత దూరం.. ఎవరెవరికి లాభం?

రంగారెడ్డి జిల్లా అమన్‌గల్ నుంచి మాడ్గుల వరకు పాత అలైన్‌మెంట్‌లో అత్యంత కీలకమైన మార్పు జరిగింది. గత అలైన్‌మెంట్.. మాడ్గుల మండలంలోని కొలుకులపల్లి-బ్రాహ్మణపల్లి-నర్సాయిపల్లి-పెద్ద మాడ్గుల-అప్పారెడ్డిపల్లి మీదుగా అమన్‌గల్ మండలంలోని విఠాయిపల్లి నుంచి వెళ్లింది. కానీ తాజా అలైన్‌మెంట్ మాత్రం మాడ్గుల మండలంలోని అన్నబోయినపల్లి- బ్రాహ్మణపల్లి-నల్లచెరువు-మాడ్గుల-సింగంపల్లి మీదుగా అమన్‌గల్ మండలంలోని మేడిగడ్డ తండా నుంచి వెళ్తుంది. ఇలా పాత దానికి ఇప్పటిదానికి మధ్య 3-4 కిలోమీటర్ల దూరం పెంచారు.

నల్లచెరువు సమీపంలో ప్రభుత్వ 'పెద్ద' అత్తగారి కుటుంబానికి చెందిన వారి భూములు పెద్దఎత్తున ఉన్నాయి. ఇవి సుమారు 200 ఎకరాలకు పైబడే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. ఈ భూములకు కేవలం కిలోమీటరు లోపు దూరం నుంచే ట్రిపుల్ రహదారి వెళ్లేలా అలైన్‌మెంట్ మార్పు చేశారు.

రంగారెడ్డి జిల్లా చుక్కాపూర్ సమీపంలో నుంచి ట్రిపుల్ ఆర్ గత అలైన్‌మెంట్ ప్రాథమికంగా నిర్ధారించారు. కానీ ఇప్పుడు దానిని 3-4 కిలోమీటర్ల దూరం అవతలికి జరిపారు. తద్వారా కొత్త అలైన్‌మెంట్ ఖానాపూర్ గ్రామ సమీపంలో నుంచి వెళ్లనుంది.

ఖానాపూర్ గ్రామం ప్రస్తుత ఎమ్మెల్యే స్వగ్రామం. వీరి కుటుంబానికి ఇక్కడ వంద ఎకరాలకు పైబడి భూములు ఉన్నాయి. తద్వారా ఈ భూములకు కిలోమీటరు లోపు దూరం నుంచే ట్రిపుల్ఆర్ వెళుతున్నదని స్థానికులు తెలిపారు.

రంగారెడ్డి-వికారాబాద్ జిల్లా సరిహద్దులో నుంచి పాత అలైన్‌మెంట్ ప్రకారం రింగు రోడ్డు అంగడిచిట్టంపల్లి- పూలపల్లి-గంగ్యాడ- ముబారక్‌పూర్ మీదుగా వెళ్లింది. కానీ తాజా మార్పుతో కనకల్-మేడిపల్లి కలాన్-కుత్బుల్లాపూర్-మన్నెగూడ మీదుగా వెళ్లనుంది. ఇక్కడ కూడా 3-5 కిలోమీటర్ల మేర రంగారెడ్డి జిల్లా నుంచి వికారాబాద్ వైపునకు అలైన్‌మెంట్‌ను మార్చారు.

ఈ ప్రాంతంలోనే కొన్ని నెలలుగా భారీ ఎత్తున భూములు చేతులు మారినట్టు తెలుస్తున్నది. పార్లమెంటు ఎన్నికల సమయంలోనే బీఆర్‌ఎస్‌లో నుంచి కాంగ్రెస్‌కు వెళ్లిన ఒక మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ, మాజీ మంత్రి ఒకరు, ప్రభుత్వ పెద్ద సోదరుడు మరొకరు.. ఇలా ముగ్గురు ఇందులో కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. ఆ క్రమంలోనే అలైన్‌మెంట్ ఈ భూముల వైపు వచ్చినట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా పాత అలైన్‌మెంట్ ప్రకారమైతే మాజీ ఎంపీ భూముల్లో నుంచి రింగు రోడ్డు వెళ్లేదని, కానీ తాజా మార్పుతో ఆ భూములు సేఫ్ కావడంతోపాటు సమీపంలో నుంచే రింగు రోడ్డు వెళుతుండటంతో వాటికి డిమాండ్ భారీగా పెరగనుందని స్థానిక ప్రజాప్రతినిధి ఒకరు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామ సమీపంలో నుంచి గతంలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను ప్రాథమికంగా నిర్ధారించారు. కానీ తాజా మార్పులతో అది చెంగోముల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నుంచి అంతారం గ్రామ పరిసరాల్లో నుంచి ప్రతిపాదించారు. ఈ మేరకు హద్దును నిర్ధారిస్తూ మార్క్ కూడా వేశారు.

దీనిపై అంతారం గ్రామం భగ్గుమంటున్నది. మాజీ ఎంపీ ఒకరి భూముల ప్రయోజనం కోసమే ఈ మార్పు చేశారంటూ గ్రామస్తులు చెప్తున్నారు. సదరు మాజీ ఎంపీకి ఇక్కడ ఏకంగా నాలుగు వందల ఎకరాలకు పైగా భూములు ఉన్నాయని వారంటున్నారు. గతంలో ఆ భూముల అవతలి వైపు నుంచి అర కిలోమీటరు దూరంలో అలైన్‌మెంట్ ఉండేదని, ఇప్పుడు భూములకు ఇటువైపు మార్చారని, తన భూమిలో గుంట భూమికీ నష్టం వాటిల్లకుండా పక్కనుంచే అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రీజినల్ రింగ్ మాస్టర్లు!

మొదటిపేజీ తరువాయి...

వందల ఎకరాలు ఉన్నచోట అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు జరగడం కలకలం రేపుతున్నది. ఈ నేపథ్యంలో గత అలైన్‌మెంట్‌లో సర్కారు భూముల నుంచి వెళ్లిన రింగు రోడ్డు.. ఇప్పుడు సన్న, చిన్నకారు రైతుల కొద్దిపాటి భూములనుంచే పోతున్నది. దీంతో క్షేత్రస్థాయిలో మార్పులకు అనుగుణంగా అధికారులు సర్వే నిర్వహించి, గుర్తులు వేస్తుండటంతో వివిధ గ్రామాల రైతులకు కంటిమీద కునుకు కరువైంది. 'నమస్తే తెలంగాణ' బుధవారం 'రూటు మారిన ట్రిపుల్ ఆర్' శీర్షికన ప్రచురించిన కథనాన్ని చూసి అనేకమంది రైతులు ఆందోళనతో ఫోన్లు చేశారు. పెద్దోళ్ల భూముల కోసం తమకున్న ఒకటీరెండు ఎకరాలను గుంజుకొని రోడ్డు వేయాలని చూస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. కొన్నిచోట్ల రైతులు మూకుమ్మడిగా సర్కారు పెద్దలపై దుమ్మెత్తిపోస్తుండగా... మరికొన్నిచోట్ల ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

మార్పుల వెనుక మాయ

హైదరాబాద్ మహానగరం చుట్టూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అలైన్‌మెంట్ దాదాపుగా ఖరారైన ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి... అలైన్‌మెంట్ ఖరారుకు గుర్తులు కూడా పెట్టారు. దీంతో గతంలో 189 కిలోమీటర్ల పొడవుగా ఉన్న దక్షిణ భాగం రింగురోడ్డు ఐదు కిలోమీటర్లు పెరిగి 194 కిలోమీటర్లకు చేరింది. ముఖ్యంగా ఆమన్‌గల్, చేవెళ్ల ప్రాంతంలోనే దాదాపు 2-5 కిలోమీటర్ల వరకు అలైన్‌మెంట్‌ను అవతలికి జరిగింది. పాత అలైన్‌మెంట్‌లో మార్పులను గుట్టుచపుడు కాకుండా చేయడంతోపాటు.. వాటిని బయటకు చెప్పొద్దంటూ అధికారులకు సైతం హుకుం జారీ చేశారు. అక్కడంతగా ఏమీ లేకపోతే.. ఎందుకీ గోప్యత? ఈ క్రమంలో పలుచోట్ల అలైన్‌మెంట్ మార్పు వల్ల ఎవరికి ప్రయోజనం జరిగిందనే దానిపై 'నమస్తే తెలంగాణ' సమాచారం సేకరించింది. వందల ఎకరాల ప్రభుత్వ, కాంగ్రెస్ పెద్దల భూములకు ప్రయోజనం చేకూర్చేందుకే 'రింగు' తిరిగినట్లుగా తెలుస్తున్నది.

వరల్డ్ బ్యాంక్ బాట అందుకేనా?!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ట్రిపుల్ ఆర్ ప్రతిపాదన ఉన్నా.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టు పట్టాలెక్కింది. ఆది నుంచీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు నిర్ణయించిన దరిమిలా గతంలోనే మోదీ సర్కారు భారత్‌మాల కింద ప్రాజెక్టును ప్రకటించింది. అందుకు అనుగుణంగా ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగం అలైన్‌మెంట్ నిర్ధారణ, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నది. కానీ ప్రస్తుతం రేవంత్ ప్రభుత్వం ట్రిపుల్ఆర్ దక్షిణ భాగాన్ని మాత్రం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వపరంగానే చేపట్టేందుకు అడుగులు వేస్తున్నట్టు సమాచారం. భూసేకరణ సహా ఈ ప్రాజెక్టుకు అటుఇటుగా రూ.15 వేల కోట్ల వరకు అవుతుందని అంచనా. ఈ మేరకు ప్రపంచబ్యాంకు రుణం తీసుకుని పీపీపీ విధానంలో చేపట్టాలని భావిస్తున్నట్టు ప్రాథమికంగా తెలుస్తున్నది. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోవాలి. అదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా అలైన్‌మెంట్ మార్చేందుకు కేంద్రం అంగీకరించదు. పైగా ఒక్కసారి కేంద్రం అలైన్‌మెంట్‌ను ఆమోదించిన తర్వాత తదుపరి మార్చేందుకు కూడా అవకాశం ఉండదు. అందుకే ఈ అలైన్‌మెంట్ల మార్పు తన ఇష్టానుసారంగా చేసేందుకే పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టేందుకు సిద్ధమైనట్టుగా తెలుస్తున్నది. తద్వారా తమకు నచ్చినట్లుగా అలైన్‌మెంట్ మార్చినా నడుస్తుందనేది ప్రభుత్వ పెద్దల యోచనగా ఉన్నట్టు తెలుస్తుంది. ఒకవేళ కేంద్రం సహకారం తీసుకుంటే పర్యవేక్షణ, అలైన్‌మెంట్లలో మార్పులోని అసలు గుట్టు బయటపడుతుందనే ఉద్దేశంతోనే ప్రపంచ బ్యాంకు బాట పట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంటే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్లలో మార్పులు ఇంతటితో ఐపోలేదు. మున్ముందు మరిన్ని మార్పులు చేర్పులు ఉండనున్నట్టు స్పష్టమవుతున్నది.



పూడూరు కేంద్రంగా కాంగ్రెస్ నేతల ల్యాండ్ బ్యాంక్!

ఈ అలైన్‌మెంట్ మార్పులో కీలకంగా చేవెళ్ల సమీపంలో నుంచి మన్నెగూడ సమీపంలోకి మార్చడం వల్ల మరికొంతమంది ప్రభుత్వ, కాంగ్రెస్ పెద్దల భూములకు ప్రయోజనం కలుగుతుందనేది సుస్పష్టం. ఇందుకు పూడూరు కేంద్రంగా ఉన్న ల్యాండ్ బ్యాంకే నిదర్శనం. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీలో అత్యంత సీనియర్, అనేకపర్యాయాలు మంత్రిగా చేసిన ఓ నేత, వికారాబాద్ జిల్లాకు చెందిన ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే, ఇటీవల కూతురుతో సహా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఒక మాజీ ఎంపీ, నల్గొండ జిల్లా ప్రస్తుత సూర్యాపేట జిల్లాకు చెందిన ఒక మంత్రి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఒక ఎమ్మెల్సీకి చెందిన భూములు భారీ ఎత్తున ఉన్నట్టు తెలిసింది.



బుధవారం తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బాల్కసుమన్. చిత్రంలో దాసోజు శ్రవణ్, నోముల భగత్

ఫ్యూచర్ సిటీ 'రియల్' దందా

- కాంగ్రెస్ పాలనలో తెలంగాణ 20 ఏండ్లు వెనక్కి
- ఇందిరమ్మ రాజ్యంలో హైడ్రా పేరు చెప్పి వసూళ్లు
- ఫేక్ న్యూస్ ప్రచారకులను వదలం: బాల్క సుమన్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం 20 ఏండ్లు వెనక్కి వెళ్లిందని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో అవినీతి, కుటుంబ పాలన, దందాలు నడుస్తున్నాయని.. హైడ్రా పేరుతో భయపెట్టి వసూళ్లకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని మండిపడ్డారు. సినీనటుడు నాగార్జున ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టిన హైడ్రా.. హిమాయత్‌సాగర్‌లోని ఆనంద్ కన్వెన్షన్‌ను ఎందుకు కూల్చటం లేదని ప్రశ్నించారు. నాగార్జునను రూ.400 కోట్లు డిమాండ్ చేశారని, ఇవ్వనందుకే ఎన్ కన్వెన్షన్ కూల్చారని సినీ ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయని వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ 18 ఎకరాల ఫాంహౌస్ కూల్చడానికి బుల్డోజర్లు దొరకటం లేదా? అని నిలదీశారు. కాంగ్రెస్ నేతల ఫాంహౌజ్‌లు కూల్చబోరని, పేదల ఇండ్లు మాత్రమే కూల్చుతారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన నడవటం లేదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులపై రాహుల్‌గాంధీది ఒక విధానం, రేవంత్ రెడ్డికి ఇంకో విధానం అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు కావొస్తున్నా మ్యానిఫెస్టో హామీల అమలుపై దృష్టిపెట్టడం లేదని విమర్శించారు. 'మ్యానిఫెస్టో అంశాలు చర్చకు రాకుండా ప్రజల దృష్టి మళ్లించే పనిలో సీఎం బిజీగా ఉన్నారు. 9 నెలలైనా ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదు. రుణమాఫీ చేసింది రూ.17,933 కోట్లే. ఎంతమంది రైతుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయనేది ఇంతవరకు ప్రకటించలేదు. వానకాలం ముగియవస్తున్నా రైతుబంధు పడలేదు. రాష్ట్రంలో సునీల్ కనుగోలు స్క్రిప్ట్ ప్రకారమే తిట్ల పురాణం, హైడ్రా డ్రామాలు నడిపిస్తున్నాయి' అని మండిపడ్డారు. ఇక, కేసీఆర్, కేటీఆర్‌తో పాటు తమ నాయకుల వ్యక్తిత్వాలపై సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌లు పెడుతున్నారని, రేవంత్ టీమ్‌లో ఉండి ఫేక్ న్యూస్‌లు పెడుతున్న వారిని కేసీఆర్, కేటీఆర్ వదిలిపెట్టినా తాను వదిలిపెట్టబోనని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నోముల భగత్, దాసోజు శ్రవణ్ కుమార్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, చాడ కిషన్‌రెడ్డి, తుంగ బాలు, యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చెప్పిన రోడ్డు వేస్తేనే మేలు



గత ప్రభుత్వంలో రింగ్‌రోడ్డు వేసేందుకు సర్వే చేపట్టిన విధంగానే ఇప్పుడు రోడ్డు వేస్తేనే మాకు మేలు జరుగుతుంది. లేకపోతే మా ఇండ్లతో పాటు భూములు పోతాయి. నాకున్న ఎకరం పొలంతో పాటు ఇల్లు కూడా రోడ్డులో పోయేలా కనిపిస్తున్నది. రూ.కోట్లు విలువ చేసే భూమితో పాటు రూ.లక్షలు ఖర్చు పెట్టి కట్టుకున్న ఇల్లు కూడా రోడ్డులో పోతే మమ్మల్ని ఎవరు పట్టించుకుంటారు.

- సురేందర్, రైతు, అంతారం

వెంచర్ల కోసమే అలైన్‌మెంట్ మార్పు

మాది వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని పులిమామిడి. మా అన్నదమ్ములకు 14 ఎకరాల భూమి ఉన్నది. గతంలో త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మా గ్రామానికి పశ్చిమ వైపు నుంచి నిర్ధారించారు. దాని వల్ల రింగు రోడ్డు అంతా ప్రభుత్వ భూమిలోనే జరిగేది. ఏ ఒక్క రైతు కూడా నష్టపోయేవాడు కాదు. కానీ కొత్త అలైన్‌మెంట్‌ను రెండు కిలోమీటర్లు తూర్పు వైపునకు జరిపారు. దీంతో మా పద్నాలుగు ఎకరాల మధ్యలో నుంచి రోడ్డు పోతుంది. అంటే ఉన్న భూమి అంతా రోడ్డుకే పోతే మేం ఏం చేయాలి? మాదే కాదు.. చాలా మంది రైతులది ఇదే పరిస్థితి.

- దేవనగరి భూపతిరెడ్డి, పులిమామిడి

పెద్దోళ్ల కోసం పేదోళ్లు బలి కావాల్నా?

పాత మార్కింగ్ ప్రకారమే చేయాలి



ట్రిపుల్ ఆర్‌ను పాత మార్కింగ్ ప్రకారమే ఏర్పాటు చేయాలి. కొంత మంది కోసం కొత్తగా మార్కింగ్ చేయించడం సరి కాదు. గత ప్రభుత్వం మా ఊరి పక్క నుంచి ట్రిపుల్ ఆర్ పోతుందని చెప్పారు. కానీ పక్కనే ఉన్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి భూమిలో నుంచి రోడ్డు వెళ్లకుండా కొత్తగా మార్కింగ్ వేయించారు. నాకు ఉన్న 20 గుంటల భూమితో పాటు రెండేళ్ల కిందట గ్రామంలో నిర్మించుకున్న ఇల్లు కూడా రోడ్డులో పోయేటట్టు కనిపిస్తున్నది.

- సుధాకర్, రైతు అంతారం

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం



ట్రిపుల్ ఆర్ పేరిట ప్రభుత్వం పేద రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. గత ప్రభుత్వంలో ఆలూరు వైపు నుంచి రోడ్డు వేస్తామని చెప్పారు. ఇప్పుడు అక్కడి నుంచి 500మీటర్లు పక్కకు జరిపి మా గ్రామం అంతారం మీదుగా రోడ్డు వేసేందుకు గుర్తులు పెట్టారు. దీంతో రైతుల భూములతో పాటు ఇం డ్లు కూడా పోతా యి. రైతులకు నష్టం కలిగిస్తే ఆందోళనకు దిగుతాం.

- నరేందర్, అంతారం

షాబాద్, సెప్టెంబర్ 18: 'మాకున్నది ఒకట్రెండు ఎకరాలు. అదే మాకు ఆధారం.. దానిని గుంజుకొని రింగు రోడ్డు వేస్తే మేం ఏం తిని బతకాలి? ప్రభుత్వం పైసలిచ్చినా రెండ్రోజుల్లో అవి ఖర్చయితయ్? ఆ తర్వాత మేమెట్ల బతకాలి? ఉన్నోళ్లకు వందల ఎకరాలు ఉన్నయి. అందులో నుంచి రోడ్డు వేయకుండా.. మా భూముల్లల్ల గుర్తులు పెడతరా? ఇదంతా మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి చేసిన పనే. కాంగ్రెస్‌లోకి పోయిందే అందుకు...' అని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని అంతారం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన 'రూటు మారిన ట్రిపుల్ ఆర్' కథనం చూసి అనేక మంది ఫోన్ చేశారు. గ్రామానికి వస్తే తాము పడుతున్న ఆవేదన చెప్తామన్నారు. గతంలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఆలూర్ మీదగా పోయేదని, ఇప్పుడు తమ గ్రామం నుంచి వేస్తున్నట్టుగా గుర్తులు పెట్టారని ఆందోళన వ్యక్తంచేశారు. అప్పటి నుంచి తిన్న తిండి ఒంటికి పడతలేదని వాపోయారు. అలైన్‌మెంట్ మార్పుతో దాదాపు 60 మంది రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే...



రంగారెడ్డిజిల్లా చేవెళ్ల మండలం అంతారంలో ట్రిపుల్ ఆర్ ఏర్పాటులో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న రైతులు

సీఎం స్పందించి రైతులకు న్యాయం చేయాలి



గతంలో ఖానాపూర్ గేట్ నుంచి ఆలూరు మధ్యలో ట్రిపుల్ ఆర్ పోతుందని చెప్పారు. ఇప్పుడు అంతారం మధ్యలో నుంచి రోడ్డు పోతుందని చెబుతున్నారు. నాకు ఉన్న 32గుంటల భూమి పోతుంది. మేము దీనిమీద ఆధారపడి బతుకుతున్నాము. నేను కూడా గత 18 సంవత్సరాలుగా హోంగార్డుగా పనిచేస్తున్నాను. కుటుంబాన్ని పోషించుకోవడానికి వచ్చిన జీతాలు సరిపోవడం లేదు. కనీసం ఇల్లు కట్టుకునే పరిస్థితి లేదు. పక్కనే మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి భూమి ఉంది. ఆయన భూమిలో నుంచి కొంచెకూడా పోలేదు. పక్కనే ఉన్న రూ. కోట్లు విలువచేసే విల్లాస్ నుండి భూమి పోలేదు.

- నర్సింహులు, హోంగార్డు, అంతారం



పేద రైతులకు న్యాయం చేయాలి

రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయడంలో తమ గ్రామానికి ఎంతో నష్టం జరుగుతుంది. అధికారులు వచ్చి మార్కింగ్ వేసి వెళ్లారు. అప్పటి నుంచి మా భూములు, ఇండ్లు పోతాయని అందరం ఆందోళన చెందుతున్నాము. నాకున్న ఐదు గుంటల భూమి రోడ్డులోనే పోయేటట్టుంది. కూలి పనులు చేసుకుని కష్టపడి భూమి కొనుకున్నాను. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. పాత మార్కింగ్ ప్రకారం రోడ్డు వేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.

- జుట్టు సుధాకర్, రైతు అంతారం



నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ట్రిపుల్ ఆర్ కోసం మా భూములు పోతే మేము నష్టపోతాం. మా ఊరికి ఇరువైపులా ఉన్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి భూములు గానీ, మరో పక్కన ఉన్న విల్లాస్ భూములు కాకుండా అంతారం, హస్తేపూర్ గ్రామాలకు సంబంధించి సుమారు 300 ఎకరాల వరకు రైతుల భూములకు నష్టం జరుగుతుంది. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, పునరాలోచించాలి. ప్రభుత్వ భూముల మీదుగా రోడ్డేయాలి.

- వెంకటేశ్, అంతారం



రెండు ప్లాట్లు రోడ్డులో పోతున్నాయి

పెద్ద నాయకుల భూములను పక్కన పెట్టి పేదవారి భూముల్లో నుంచి రోడ్లు వేయడం సరికాదు. నాకున్న రెండు ప్లాట్లు రోడ్డులో పోతున్నాయి. ప్రస్తుతం భూముల ధరలు కోట్లల్లో ఉన్నాయి. రింగ్ రోడ్డు వస్తే భూములకు మరింత ధరలు పెరుగుతాయని మేము ఆశతో ఉంటే, ఉన్న భూముల్లో నుంచే రోడ్డు పోతే మా పరిస్థితేంటి? ప్రభుత్వం స్పందించి రోడ్డును ఊరు పక్కన నుంచి నిర్మిస్తే బాగుంటుంది.

- నవీన్, అంతారం



రైతులకు నష్టం కాకుండా చూడాలి

ట్రిపుల్ ఆర్ వేస్తే మాకు ఇబ్బందేమీలేదు. కానీ మాకున్న కొద్దిపాటి భూముల్లో నుంచి రోడ్డు వేస్తే నష్టం జరుగుతుంది. గ్రామంలో పెట్టిన గుర్తుల ప్రకారం చూసుకుంటే నా భూమి మూడు ఎకరాల వరకు పోతుంది. ఇక్కడ ఎకరం ధర రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు నడుస్తున్నది. రింగ్‌రోడ్డు కోసం మన్నెగూడ మీదుగా రోడ్డు పోతే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. మా భూములకు నష్టం జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పెంటయ్య, రైతు అంతారం

ఆడలేక మద్దెల ఓడు!

శాఖల మధ్య సమన్వయ లోపం.. వైఫల్యాన్ని దాచి గతంపై నెపం

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణపై కాంగ్రెస్ సర్కారు తీరిది • 2 నెలల్లో చెరువుల నోటిఫికేషన్ పూర్తి చేయాలని హైకోర్టు అక్షింతలు

గడువు ముంచుకురావటంతో గత ప్రభుత్వ వైఫల్యమంటూ బుకాయింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. నిర్ణీత గడువులోగా హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువులు, కుంటల ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణ పూర్తి చేయాలని హైకోర్టు అక్షింతలు వేయగా, గడువు దగ్గర పడుతుండటంతో నెపాన్ని కప్పిపుచ్చుకునేలా గత ప్రభుత్వ వైఫల్యం అంటూ సన్నాయి నొక్కులతో కాలయాపన చేస్తున్నది. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న మొత్తం చెరువుల జాబితా, వాటి ఎఫ్టీఎల్, బఫర్‌జోన్లతోపాటు, హద్దురాళ్లను నిర్దేశిస్తూ నవంబర్‌లోగా తుది నోటిఫికేషన్ జారీ చేసిన నివేదికతో రావాలంటూ హెచ్‌ఎండీఏ కమిషనర్‌ను ఆగస్టులో కోర్టు ఆదేశించింది. ఇప్పటివరకు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, తుది నోటిఫికేషన్‌పై దృష్టిపెట్టని హెచ్‌ఎండీఏ యంత్రాంగం.. గత ప్రభుత్వ వైఫల్యంతోనే పూర్తి కాలేదని దుష్ప్రచారం చేయడం విడ్డూరం. చెరువుల పరిరక్షణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీఆర్‌ఎస్ సర్కారు మిషన్ కాకతీయ పేరిట చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా కృషిచేసింది. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల ఆధునీకరణకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) రూపొందించిన టెక్నాలజీ సాయంతో హద్దురాళ్లను నిర్ధారించేలా కీలక నిర్ణయం తీసుకున్నది. చెరువుల ప్రాథమిక, తుది నోటిఫికేషన్ వేగవంతం చేయటంలో ఎల్పీసీ సమావేశాల్లో అధికారులను పరుగులు పెట్టించింది. కానీ ఇరిగేషన్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం, 2010 కంటే ముందే అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు సంబంధిత చెరువుల రికార్డులను నిర్వీర్యం చేయటంతో తుది జాబితా జాప్యానికి కారణమైంది. కానీ ఉద్దేశపూర్వకంగా చెరువుల హద్దురాళ్లను బీఆర్‌ఎస్ సర్కారు ఖరారు చేయలేదంటూ సంబంధిత శాఖలతో బురద జల్లే ప్రయత్నానికి కాంగ్రెస్ పూనుకొన్నది. హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువుల పరిరక్షణకు ఉమ్మడి రాష్ట్రంలో 2010లో ఏర్పాటు చేసిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్పీసీ) అప్పటికే ఉన్న చెరువుల తుదిజాబితాను ఎందుకు పూర్తి చేయలేకపోయిందనేది ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తున్నది. ఎందుకంటే ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలోనే నగరంలోని ప్రధాన చెరువులు, కుంటలను అన్యాక్రాంతం చేయటంలో అప్పటి కాంగ్రెస్, టీడీపీ కంకణం కట్టుకుని దశలవారీగా లేక్ సిటీ మూలాలను తొలగించే కార్యకలాపాలను ప్రోత్సహించాయి. దీంతో 2013 నాటికి రూపొందించిన 'మాస్టర్ ప్లాన్-2031'లో వందల చెరువుల జాడ లేకపోవడం అప్పట్లో వివాదాస్పదంగా మారింది. దీనికి మాస్టర్‌ప్లాన్ రూపకల్పన బాధ్యతలను ఆర్వీ కన్సల్టెన్సీ సంస్థకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించటంలోనే అసలు మతలబు ఉన్నదని, దీంతోనే విలువైన చెరువులు, కుంటలు కాలగర్భంలో కలిసిపోవడానికి ప్రధాన కారణమని పెద్దఎత్తున కథనాలు వచ్చాయి. హైదరాబాద్‌కు చెందిన ఎంతోమంది పర్యావరణవేత్తలు గొంతెత్తారు. చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకుంటూ చెరువుల నిర్వీర్యానికి కారణాలను దాచిపెట్టే చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది.

రెండు నెలల్లో ముందుకు పడని అడుగులు

ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్‌ఎండీఏ పరిధిలో 3,532కిపైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ, నిర్వహణ, పరిరక్షణ, ఆధునీకరణ కార్యకలాపాలన్నీ హెచ్‌ఎండీఏవే. చెరువు హద్దులను కాపాడటం కూడా దాని బాధ్యతే. 2013 నుంచి 2023 నాటికి 2,525 చెరువులకు ప్రాథమిక హద్దురాళ్ల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన వాటిలో 230 చెరువులకు మాత్రమే బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరిగినట్టు తేలింది. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ ఎందుకు ఖరారు చేయాలని హెచ్‌ఎండీఏను ప్రశ్నించిన హైకోర్టు.. నవంబర్‌లోగా మిగిలిన 1,000 చెరువులకు హద్దుల నిర్ధారణకు ఆగస్టులో ఆదేశాలు ఇచ్చినా అధికారులు ఆ దిశగా అడుగులే వేయలేదు. ఆక్రమణల లెక్కలనూ వెలికి తీయలేకపోయారు. నెల గడువులోగా తుది జాబితా తయారవడం అసాధ్యంగా మారవటంతో ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకు గత ప్రభుత్వంపై రాళ్లు వేయటం మొదలుపెట్టింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణను బీఆర్‌ఎస్ సర్కారు ఉద్దేశపూర్వకంగానే చేయలేదంటూ అసత్య ప్రచారానికి తెరలేపింది.

2010 నాటికే చెరువులు మాయం

హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువుల పరిరక్షణపై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుపడుతున్నది. కానీ ఉమ్మడి పాలనలో మాస్టర్ ప్లాన్-2031లోనే వందల చెరువులను లేకుండా చేసింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే. అప్పట్లోనే దీనిపై పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. తుది మాస్టర్ ప్లాన్‌లో ఉన్న చెరువులు, కుంటలు మాయమయ్యాయి. సైబరాబాద్ పరిధిలో 10సంఖ్యలో హద్దురాళ్లు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ విషయంలో చెరువుల నోటిఫికేషన్‌ను తారుమారు చేసిన ఆర్వీ కన్సల్టెన్సీ సమగ్రంగా విచారించకుండా మాస్టర్‌ప్లాన్ చేసిందనే ఆరోపణలున్నాయి. వందల చెరువుల వెంటభారీ భవంతులు వెలిశాయని జలవనరుల నిపుణులు తెలిపారు.

క్షేత్రస్థాయి ఇబ్బందులపై అవగాహన లేకుండా..

2010లో లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటుచేసిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం.. తొలి సమావేశంలో 21 చెరువుల డిమార్కేషన్, హద్దురాళ్ల నిర్ధారణ, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణ చేపట్టాలని భావించింది. ఆ జాబితా ప్రకారం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వెంబడి గ్రీన్ బెల్ట్ డెవలప్ చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణ కాక యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, పీసీబీ, మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్, అటవీ, కలెక్టర్లు, టౌన్‌ప్లానింగ్, పర్యావరణవేత్తలు వంటి 18 సభ్యులతో ఏర్పాటైన నూతన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన తొలి ఎల్‌పీసీ సమావేశంలోనే సాధకబాధకాలపై చర్చించారు. సమన్వయం లేకపోతే మాస్టర్‌ప్లాన్, లేక్ పరిరక్షణ సాధ్యం కాదని ఆర్వీ కన్సల్టెన్సీ కుండబద్ధలు కొట్టినట్టు తెలిసింది. కానీ అధికారులు తూతూమంత్రంగా ఎల్‌పీసీ సమావేశాలు నిర్వహించి చేతులెత్తేశారు. దీంతో నగరంలో చెరువుల హద్దురాళ్ల నిర్ధారణ జాప్యానికి బీజం వేసిందే కాంగ్రెస్ పార్టీగా ముద్ర పడింది.

ముంచుకొస్తున్న గడువు

మరో నెలలో హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల తుదిజాబితా ప్రక్రియ పూర్తి చేయాలన్న గడువు ముంచుకొస్తున్నది. నవంబర్ నాటికి తుదిజాబితాతో నివేదికను అందజేయాల్సి ఉండగా.. చెరువుల నిర్ధారణ చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసింది. ఎల్‌పీసీ తొలి సమావేశంలోనే ఇబ్బందులపై చర్చించగా, అప్పటి సమావేశానికి రంగారెడ్డి కలెక్టర్ హోదాలో ప్రస్తుత మున్సిపల్ శాఖ సెక్రటరీ కూడా హాజరయ్యారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణలో సమస్యలను పరిష్కరించి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా.. ఆ పని చేయలేక ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పబ్బం గడుపుతున్నదని హైదరాబాద్‌లోని జలవనరుల నిపుణులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మ్యాప్స్ ఇన్‌ఫ్రా కేసుపై వివరణ ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేటలో ఎర్రకుంట ఎఫ్టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారంటూ మ్యాప్స్ ఇన్‌ఫ్రాపై నమోదు చేసిన క్రిమినల్ కేసు వివరాలు ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆక్రమణలపై నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ మ్యాప్స్ ఇన్‌ఫ్రా పిటిషన్ దాఖలు చేసింది. ఆ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ సీ సుధాకర్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ కే సుజన బుధవారం విచారించారు. తాము కొనుగోలు చేసిన భూమిలోనే నిర్మాణాలు చేపట్టామని, తప్పుడు కేసులు నమోదు చేశారని న్యాయవాది పేర్కొన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి వివరణ ఇవ్వాలంటూ బాచుపల్లి పోలీసులకు ఇరిగేషన్ శాఖ ఏఈఈకి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేశారు.

28న 'చలో హైదరాబాద్'

- గిరిజన గురుకుల టీచర్ల వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): కొత్త టైం టేబుల్ వద్దని, పాత టైంటేబుల్‌నే అమలు చేయాలని గిరిజన గురుకుల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలని ఈనెల 28న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు స్పష్టంచేశారు. ఈ సందర్భంగా గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు రిషికేష్‌కుమార్, సురేందర్ రాథోడ్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో ఉన్న టైంటేబుల్‌ను కాదని కొత్త టైంటేబుల్‌ను అమల్లోకి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికంతటికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని స్పష్టంచేశారు. మరో 11 సమస్యలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని పేర్కొన్నారు.

'నాలుగు డీఏలను విడుదల చేయండి'

హైదరాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): దసరా పండుగను పురస్కరించుకుని పెండింగ్‌లోని నాలుగు డీఏలను విడుదల చేయాలని పెన్షనర్ల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. 20న నిర్వహించే మంత్రిమండలి సమావేశంలో పెండింగ్ డీఏలపై నిర్ణయం తీసుకోవాలని కోరింది. జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టీ శుభాకర్‌రావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కాలయాపనే తప్ప ఇంతవరకు ఒక్క సమస్యను పరిష్కరించలేదని, ఆర్థిక సంబంధంలేని అంశాలనూ పరిష్కరించడంలేదని ఆరోపించారు. పెండింగ్ బిల్లుల మంజూరు, డీఏల విడుదల, ఈహెచ్‌ఎస్ పథకాన్ని అమలు చేయాలని కోరారు.

ముగ్గురు గురుకుల విద్యార్థుల అదృశ్యం

దేవరకొండ రూరల్, సెప్టెంబర్ 18: మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన ఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో జరిగింది. మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముజీబ్, తౌఫిక్‌ఉమర్, అబ్దుల్ రెహమాన్ 16న పాఠశాలకు సెలవు కావడంతో బయటి నుంచి కల్లు తెచ్చుకున్నారు. స్టాఫ్‌నర్స్ జ్యోతి ప్రిన్సిపాల్ అశోక్‌కు తెలపడంతో భయపడిన విద్యార్థులు మంగళవారం ప్రహరీ దూకి పారిపోయారు. పెట్టెలను వెతకగా 'మమ్మల్ని పాఠశాలలో టార్చర్ పెడుతున్నారు.. అందుకే పారిపోతున్నాం.. మా కోసం ఎవరూ వెతకొద్దు' అని రాసి ఉన్న లెటర్ లభించింది.

తొలి జీతమే చేదు జ్ఞాపకం!

- గురుకులాల్లో వేతన వెతలు
- కొత్త ఉద్యోగులకు అందని జీతం
- రెగ్యులర్ ఉద్యోగులదీ అదే గతి
- ఔట్‌సోర్సింగ్ మరీ దయనీయం
- మూడు నెలలుగా జీతాల్లేవ్
- అప్పులతోనే జీవనయానం
- పడిపోతున్న సిబిల్ స్కోర్లు..
- ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగులు సతమతం



తొలి వేతనం అందలే..

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగంలో చేరి తొలి వేతనం అందుకున్న రోజున పొందే ఆనందమే ఆనందం. తొలి వేతనంతో అమ్మానాన్నలకు బట్టలు కొనడం, ఇతర కుటుంబసభ్యులకు స్వీట్స్, గిఫ్ట్స్ ఇవ్వడం ఇలాంటి దృశ్యాలు దాదాపు ప్రతి కొత్త ఉద్యోగి ఇంట్లో సర్వసాధారణం. కానీ, గురుకుల విద్యాసంస్థల్లో ఇటీవల ఉద్యోగం పొందినవారికి ఆ అనుభూతి లేకుండా పోయింది. ఉద్యోగంలో చేరి దాదాపు రెండు నెలలు అవతున్నా తొలి వేతనం అనేది అందని ద్రాక్షపండుగానే మిగిలిపోయింది. జూలైలో ఉద్యోగంలో చేరినవారికి ఇంకా తొలి వేతనమే అందలేదు. జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఒక్క కొత్త ఉద్యోగులదే కాదు.. పాత ఉద్యోగులదీ అదే కథ. గురుకులాల్లోని రెగ్యులర్ ఉద్యోగులకు కూడా సెప్టెంబర్ 1న అందాల్సిన జీతం ఇంకా రాలేదు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా జీతాల్లేవు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.. ఇంకా నిధులు విడుదల కాలేదని ఉన్నతాధికారులు చెప్తున్నారు. దీంతో అప్పులతోనే కాలం వెళ్లదీయాల్సి వస్తున్నదని గురుకుల ఉద్యోగులు, సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లోని టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్, పీడీ, లైబ్రేరియన్ తదితర పోస్టుల్లో ఇటీవల 8,307 మందికి రెగ్యులర్ ఉద్యోగాలొచ్చాయి. అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న వారంతా దాదాపు జూలై చివరి వారం నుంచి విధుల్లో చేరారు. వారెవరికీ ఇప్పటివరకూ వేతనాలు చెల్లించలేదు. నూతనంగా విధులోకి చేరిన ఉద్యోగుల వివరాల నమోదు, బ్యాంక్ ఖాతాలు, సర్వీస్‌బుక్ ఎంట్రీ తదితర పనులన్నీ వెంటవెంటనే పూర్తి చేసిన సొసైటీలు వారికి వేతనాలను మాత్రం విడుదల చేయలేదు. జూలైలో పనిచేసిన రోజులతోపాటు ఆగస్టు నెల పూర్తి వేతనాన్ని సెప్టెంబర్ 1 తేదీన చెల్లించాల్సి ఉన్నది. కానీ, 18వ తేదీ వరకు కూడా జీతం పడలేదు. మొదటి నెల వేతనంతో తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు, అక్క చెల్లెళ్లకు కానుకలిచ్చి మధురస్మృతిగా నిలుపుకోవాలని భావించిన నూతన ఉద్యోగులకు అది ఆదియాశగానే మిగిలింది.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా..

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) పరిధిలోని పాఠశాలలు, కాలేజీలు, సీవోఈల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలను చెల్లించడంలేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీ, హానరోరియం ఇలా వివిధ రూపాల్లో 3,500 మందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. బోధన, బోధనేతర విధులను నిర్వర్తిస్తున్నారు. సదరు సిబ్బందికి జూన్, జూలై, ఆగస్టు వేతనాలను ఇప్పటికీ చెల్లించ లేదు. దీనిపై సొసైటీ ఉన్నతాధికారులు సైతం ఊసెత్తడం లేదు. వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తున్నదని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సోషల్‌వెల్ఫేర్ రెగ్యులర్ ఎంప్లాయీస్‌కూ పడలే..

గురుకులాల్లోని ఇతర రెగ్యులర్ ఉపాధ్యాయుల పరిస్థితి సైతం దయనీయంగా తయారైంది. ఒకటో తేదీన వేతనం అందుకోవడం అందని ద్రాక్షగానే మారింది. సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లోని రెగ్యులర్ సిబ్బందికి సైతం ఇప్పటికీ వేతనాలు జమ కాలేదు. మైనార్టీ గురుకుల సిబ్బందిలో కొంతమందికి బుధవారం సాయంత్రం తరువాత జీతం పడ్డట్టు సమాచారం. ప్రతి నెలా ఇదే పరిస్థితి ఎదురవుతున్నదని, ఏ తేదీన వేతనం వస్తుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వేతనాలను సకాలంలో విడుదల చేయకపోవడంతో బ్యాంకు లోన్లు కట్టలేకపోతున్నామని, చెక్‌బౌన్స్‌లతో ఈఎంఐలు మిస్ అయ్యి అదనంగా జరిమానాలు చెల్లించాల్సి వస్తున్నదని రెగ్యులర్ ఉపాధ్యాయులు చెప్తున్నారు. సొసైటీ ఉన్నతాధికారుల తీరుతో సిబిల్‌స్కోర్లు సైతం దారుణంగా పడిపోయాయని, అప్పు కూడా పుట్టని పరిస్థితి ఎదురవుతున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లిస్తున్నట్టే, తమకు కూడా ఒకటో తేదీన వేతనాలను 010 పద్దు ద్వారా చెల్లించాలని గురుకుల సిబ్బంది కోరుతున్నారు.

గురుకులాల సమస్యలను పరిష్కరించాలి

- పనివేళలను తక్షణమే మార్చాలి
- గురుకుల విద్యాజేఏసీ డిమాండ్
- రెండోరోజూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గురుకులాల విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఇటీవల జారీచేసిన పనివేళలను మార్చాలని గురుకుల విద్యాజేఏసీ డిమాండ్ చేసింది. గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు రెండో రోజూ కొనసాగాయి. అన్ని గురుకులాల్లో బోధన, బోధనేతర ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. సమస్యలను ఎన్ని సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని జేఏసీ నేతలు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తక్షణం స్పందించాలని, అశాస్త్రీయంగా రూపొందించిన పనివేళలను సవరించాలని, అందరికీ 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని, విద్యార్థుల డైట్ చార్జీలు పెంచాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, కాంట్రాక్ట్, గెస్ట్, పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, బేసిక్ పే వర్తింపజేయాలని, అన్ని గురుకుల సొసైటీలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఏకరూప నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో గురుకుల విద్యాజేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు సీహెచ్ బాలరాజు, యాదయ్య, రుషికేశ్‌కుమార్, ప్రభుదాస్, చలపతి, బాలస్వామి, గోవర్ధన్‌రెడ్డి, ఝాన్సీరాణి, సాంబలక్ష్మి, ఆవుల సైదులు, జానీమియా, శ్రీనివాస్, గురుకులాల బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు. అటు.. నిరసనల్లో భాగంగా గురువారం సంతకాల సేకరణ చేపట్టి ప్రిన్సిపాల్స్ ద్వారా సొసైటీల కార్యదర్శులకు తమ డిమాండ్లను పంపించాలని సిబ్బందికి జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

మాడల్ టీచర్లకు పదోన్నతులు కల్పించండి: టీఎంఎస్‌టీఏ

హైదరాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): మాడల్ స్కూల్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ మాడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌టీఏ) ప్రభుత్వాన్ని కోరింది. పరస్పర బదిలీలకు అవకాశం కల్పించి, ఖాళీలున్న చోటికి బదిలీ చేయాలని విజ్ఞప్తిచేసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను సచివాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. బదిలీలపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది.

ఫైన్ ఆర్ట్స్‌కు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ స్థలం

- పదెకరాల స్థలాన్ని కేటాయించనున్న సర్కారు
- మాసాబ్‌ట్యాంక్ నుంచి జేఎన్‌ఏఎఫ్‌ఏయూ తరలింపు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఓపెన్‌వర్సిటీ ఉద్యోగ సంఘాలు
- నేడు ముఖ్యమంత్రి వద్దకు ఉద్యోగ సంఘాల నేతలు



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): దేశంలోనే ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సుల నిర్వహణకు ఏర్పడ్డ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్‌ఏఎఫ్‌ఏయూ)ని మరో చోటికి తరలించేందుకు రంగం సిద్ధమైంది. మాసాబ్‌ట్యాంక్‌లో ఉన్న ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీని జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీలోకి తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన పది ఎకరాల స్థలాన్ని జేఎన్‌ఏఎఫ్‌ఏయూకు కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను శుక్రవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఎదుట పెట్టనున్నారు. రాష్ట్ర క్యాబినెట్ ఇందుకు ఆమోదం తెలుపడం లాంఛనంగానే కనిపిస్తున్నది. ఈ ప్రతిపాదనలను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది ఓపెన్‌వర్సిటీని నిర్వీర్యం చేసి కాలగర్భంలో కలిపే ప్రయత్నమని, దీనిని అడ్డుకుని తీరుతామని హెచ్చరిస్తున్నాయి.

క్రమంగా కుంచించుకుపోతున్నా..

బీఆర్ అంబేద్కర్ వర్సిటీని 1982లో ఏర్పాటుచేశారు. ఈ వర్సిటీకి మొదట్లో 53.63 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలమంతా కొండలు, గుట్టలతో కూడుకొని ఉండటంతో అతికష్టం మీద నిర్మాణాలు చేపట్టి వర్సిటీకి ఒక రూపునిచ్చారు. దీనిలో కొంత కబ్జాకు గురయింది. మరికొంత స్థలాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు, ఒక విభాగం ఆఫీసర్ల క్వార్టర్ల కోసం కేటాయించారు. ఆ తర్వాత టీ-శాట్, వీ-హబ్ కోసం కూడా వర్సిటీ స్థలాన్ని కేటాయించారు. వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి (ఎస్సార్డీపీ)లో భాగంగా దుర్గంచెరువు బ్రిడ్జి కోసం మరికొంత స్థలాన్ని తీసుకున్నారు. ఇలా దాదాపు 13-14 ఎకరాల స్థలాన్ని వర్సిటీ కోల్పోయింది. వర్సిటీలో ఏటేటా అడ్మిషన్లు పెరుగుతున్నాయి. వర్సిటీ క్యాంపస్‌లోనే థియరీ తరగతులు, ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. కొన్ని కోర్సుల పరీక్షలను సైతం వర్సిటీలోనే నిర్వహిస్తున్నారు.

విద్యాకమిషన్‌కు జేఎన్‌ఏఎఫ్‌ఏయూ

మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఏఎఫ్‌ఏయూను జూబ్లీహిల్స్‌కు తరలించనుండగా, ఖాళీ అయిన జేఎన్‌ఏఎఫ్‌ఏయూ క్యాంపస్‌ను విద్యాకమిషన్ కార్యాలయం కోసం కేటాయించనున్నట్టు తెలిసింది. విద్యా కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళిని ఇటీవలే నియమించగా, సభ్యులను నియమించాల్సి ఉన్నది. ఆ తర్వాత కమిషన్ కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి. విద్యాకమిషన్ కార్యాలయానికి తొలుత బషీర్‌బాగ్‌లోని ఎస్సీఈఆర్టీ భవనంలో మూడో అంతస్తును కేటాయించాలని భావించారు. కానీ ఇటీవలే ఈ కార్యాలయాన్ని ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డికి కేటాయించారు. దీంతో జేఎన్‌ఏఎఫ్‌ఏయూను బీఆర్ అంబేద్కర్ వర్సిటీకి తరలించి, మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ భవనాలను విద్యాకమిషన్, తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయాల కోసం వినియోగించనున్నట్టు తెలిసింది.

వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు

బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన స్థలాన్ని జేఎన్‌ఏఎఫ్‌ఏయూకు కేటాయించడాన్ని వర్సిటీ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వర్సిటీకి చెందిన టీచర్స్, ఫ్యాకల్టీ టీచర్స్ అసోసియేషన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్లు ప్రభుత్వ చర్యను తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతున్నాయి.

హైరైజ్ పైకి హైడ్రా బుల్డోజర్లు!

- బాచుపల్లి కోమటికుంటలో ప్రముఖ నిర్మాణ సంస్థపై చర్యలకు రంగం సిద్ధం



నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబరు 18 (నమస్తే తెలంగాణ): హైడ్రా ఇప్పుడు హైరైజ్ బిల్డింగ్‌లపై ఫోకస్ పెట్టిందా? చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టిన అకాశ హర్మ్యాలను నేలమట్టం చేయాలని భావిస్తున్నదా? అంటే అవుననే అంటున్నాయి హైడ్రా వర్గాలు. విపత్తు నిర్వహణ, ఆస్తుల రక్షణకు ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) గడచిన కొంత కాలంగా చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, జంట జలాశయాల ఎఫ్‌టీఎల్‌లోని కట్టడాలను, పార్కు స్థలాల్లో 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలు స్వాధీనం చేసుకున్నది. 23 చోట్ల జరిపిన ఈ కూల్చివేతల్లో సామాన్యుడిపైనే హైడ్రా ప్రతాపం చూపిందంటూ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ అపవాదు నుంచి బయటపడేందుకు ఓ ప్రముఖ సంస్థనిర్మాణాలను కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. బాచుపల్లిలోని కోమటికుంట చెరువు (లేక్ ఐడీ నంబర్ 2822) ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమంగా 8, 9వ బ్లాక్ నిర్మాణ పనులు చేపడుతున్న నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. హైడ్రా అధికారుల బృందం ఇటీవల సంబంధిత నిర్మాణ సంస్థ చేపడుతున్న స్థలాన్ని పరిశీలించింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోనే 8,9వ బ్లాక్‌లు కడుతున్నట్టు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ సం స్థకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ బ్లాక్‌ల నిర్మాణం నిలిపివేయాలని ఆదేశించి నా ఆ సంస్థ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలోనే లీగల్ సమస్యలు తలెత్తకుండా హైడ్రా నిశితంగా పరిశీలన చేస్తున్నది. 20వ తేదీ తర్వాత హైడ్రా విధివిధానాలు పూర్తిగా ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత ఈ వారాంతంలో సదరు సంస్థపై చర్యలు తీసుకునే దిశగా బృందాలు రెడీ అవుతున్నట్టు ప్రచారం.

నేటి నుంచి ఆర్టీసీ ఉద్యమం

- నేడు డిమాండ్స్ డే.. 21న రిలేదీక్షలు
- మహిళలు భారీ సంఖ్యలో పాల్గొనాలి
- టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) పరిరక్షణ, కార్మికుల డిమాండ్ల సాధనలో భాగంగా కార్మిక సంఘాలు ఉద్యమ కార్యాచరణను ఉధృతం చేస్తున్నాయి. అందులోభాగంగా గురువారం డిమాండ్స్‌డేగా పాటిస్తామని, 21న రిలే నిరాహార దీక్షలు చేపడతామని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు జేఏసీ నేతలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షల్లో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యోగులు సమరంలో ముందుంటేనే సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని జేఏసీ అభిప్రాయపడింది. గురువారం నిర్వహించే డిమాండ్స్ డే కార్యక్రమంలో యూనియన్లకు అతీతంగా కార్మికులంతా భాగస్వాములు కావాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు కోరారు. డిమాండ్స్ బ్యాడ్జీలను ధరించి కార్మికులు విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్కారు నిధులతో మూడువేల ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయాలని, ప్రతినెలా సంస్థకు రూ.430 కోట్లు రీయింబర్స్ చేయాలని డిమాండ్ చేశారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, రూట్ సర్వే చేసి రన్నింగ్ టైం ఇవ్వాలని, ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని, టిమ్స్‌లో అవసరమైన మార్పులు చేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో కార్మికులపై పెట్టిన కేసులన్నింటినీ సానుభూతితో పరిశీలించి ఎత్తేయాలని, కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఎస్బీటీ, ఎస్‌ఆర్‌బీఎస్ ట్రస్టులకు బోర్డు ఆఫ్ ట్రస్టీలను నియమించాలని, సీసీఎస్ ప్రతినిధుల కోసం ఎన్నికలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరారు.

కొత్త ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయాలి

- ప్రభుత్వానికి ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి
- ఉద్యోగ సంఘాలతో కలిసి ముసాయిదా రూపకల్పన
- వైద్యశాఖ మంత్రికి సమర్పించిన చైర్మన్ లచ్చిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులకు కొత్త ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కోరింది. ఈ మేరకు వివిధ ఉద్యోగ సంఘాలతో చర్చించి రూపొందించిన ముసాయిదాను ప్రభుత్వానికి ప్రతిపాదించింది. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డితోపాటు పలువురు జేఏసీ నాయకులు బుధవారం ఈ ముసాయిదాను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు అందజేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న హెల్త్ స్కీమ్‌లోని లోటుపాట్లు, కొత్తగా ప్రతిపాదించిన హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులకు, వారి కుటుంబాలకు కలిగే ప్రయోజనాలను మంత్రికి వివరించారు. కొత్త ప్రతిపాదనలతో ప్రభుత్వానికి భారం పడకుండా ఉద్యోగులకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్యసేవలు అందుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, కే రామకృష్ణ, డాక్టర్ కత్తి జనార్ధన్, దర్శన్‌గౌడ్, ఎస్ రాములు, డాక్టర్ వంశీకృష్ణ, దశరథ్, జయమ్మ, రమేశ్ పాక, రామ్‌ప్రతాప్ సింగ్, గోవర్ధన్, పాండు, దీపక్ పాల్గొన్నారు.

ప్రతిపాదనలోని కీలక అంశాలు

- తెలంగాణలో 3.06 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, 2.88 లక్షల మందికిపైగా పెన్షనర్లు ఉన్నారు.
- ప్రస్తుతం ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వం నెలకు దాదాపు రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నది.
- కొత్త ఈహెచ్‌ఎస్‌లో ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఎంప్యానెల్ చేసిన దవాఖానల్లో నగదురహిత వైద్యం అందించాలి.
- వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుపై ఎలాంటి పరిమితి (సీలింగ్) విధించొద్దు.
- రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలతో పాటు స్థానిక సంస్థలు, ఎయిడెడ్, సొసైటీల ఉద్యోగులకు దీనిని అమలు చేయాలి.
- ప్రధాన కార్డుదారు సహా ఆరుగురు కుటుంబ సభ్యులకు సదుపాయం.
- ఈహెచ్‌ఎస్ కోసం అయ్యే మొత్తం ఖర్చును ఈహెచ్‌ఎస్ లేదా ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఏహెచ్‌సీటీ) ఖరారు చేయాలి.
- ఈ మొత్తంలో 50% ప్రభుత్వం భరించాలి. మిగతా 50 శాతాన్ని ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి తీసుకోవాలి.
- ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు చెల్లించే మొత్తాన్ని పేస్లిప్, పెన్షన్ స్లిప్‌లో డిడక్షన్స్‌గా చూపాలి. ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని ఎర్నింగ్స్‌లో నమోదు చేయాలి.
- ఈ మొత్తాన్ని సంబంధిత డీడీవో లేదా పీఆర్‌వో ప్రతినెలా ఈహెచ్‌ఎస్ ఖాతాలో జమచేయాలి.

4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 19 సెప్టెంబర్ 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

లెబనాన్‌లో పేజర్ పేలుళ్లు

లెబనాన్‌లో జరిగిన పేజర్ల వరుస పేలుళ్లు ప్రపంచాన్ని దిగ్భ్రాంతిలో ముంచాయి. అరచేతిలో ఇమిడే సమాచార పరికరాలు పేలడంతో వేల సంఖ్యలో జనం గాయపడటమే కాకుండా, 10 మందికి పైగా మరణించినట్టు వార్తలు వెలువడ్డాయి. అయితే, ఈ దాడులకు గురైనవారు సామాన్య పౌరులు కారు. వారంతా సాయుధ మిలిటెంట్ దళం హెజ్బొల్లాకు చెందినవారు కావడం గమనార్హం. ఏక కాలంలో వేర్వేరు చోట్ల జరిగిన పేలుళ్ల దృశ్యాలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించాయి. ప్రధానంగా హెజ్బొల్లాకు గట్టి పట్టున్న దక్షిణ లెబనాన్‌లో ఈ పేలుళ్లు సంభవించాయి. లెబనాన్ ప్రభుత్వాధినేతలు ఈ దాడి వెనుక ఇజ్రాయెల్ హస్తం ఉన్నట్టు ఆరోపిస్తున్నారు. అయితే, ఇజ్రాయెల్ సైన్యం ఈ ఆరోపణను ఖండించింది. అయితే, దీన్ని పెద్దగా ఎవరూ విశ్వసించడం లేదు. తైవాన్ నుంచి రవాణా అవుతున్న పేజర్లను దారి మళ్లించి వాటిలో పేలుడు పదార్థాలను, సూక్ష్మ డిటోనేటర్లను అమర్చారని వెలువడుతున్న వార్తలు విస్మయం కలిగిస్తున్నాయి.

ఇరాన్ వత్తాసుతో ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడుతున్న హెజ్బొల్లాకు ఈ పేలుళ్లు గట్టి ఎదురుదెబ్బ అనే మాట ఈ సందర్భంగా వినవస్తున్నది. ఎప్పుడో 1990లలో కొన్నాళ్లపాటు ఓ వెలుగు వెలిగి, సెల్‌ఫోన్ల రాకతో అంతర్ధానమైపోయిన పేజర్లను లెబనాన్ మిలిటెంట్లు ఇప్పటికీ ఉపయోగిస్తుండటం, వాటిద్వారానే పేలుళ్లు జరగడం విస్మయం కలిగిస్తున్నది. తనిఖీల్లో, నిఘాలలో పట్టుబడకపోవడం వల్లనే మిలిటెంట్లు వీటిని ఉపయోగిస్తున్నట్టు తెలుస్తున్నది. ఎందుకంటే పేజర్లను పెద్ద సంఖ్యలో ఉపయోగించి పేలుళ్లు జరిపిన ఉదంతం ఏదీ ఇదివరకు నమోదు కాలేదు. గతంలో 1971 మ్యూనిక్ ఒలింపిక్స్‌లో తమ క్రీడాకారులను చంపిన ఉగ్రవాదులను వేటాడటానికి ఇజ్రాయెల్ ల్యాండ్‌లైన్ టెలిఫోన్లను వాడిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియా ఘర్షణల్లో సాంకేతికత రోజుకో రకంగా పరిణమించడం చూస్తుంటే చివరికి దేనికి దారితీస్తుందోననే అనుమానం కలుగక మానదు.

పశ్చిమాసియా సంక్షోభంలో భాగమైన గాజా యుద్ధం ఓ వైపు ఎడతెరిపి లేకుండా సాగుతున్నది. ఇప్పటికే భారీసంఖ్యలో పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు మహిళలు, చిన్నారులే కావడం అత్యంత విషాదకరం. గాజాలో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడుతున్నదని దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసువేసింది. ఈ పరిస్థితిపై అమెరికాలోనూ ఇటీవల యుద్ధ వ్యతిరేక నిరసనలు భగ్గుమనడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అగ్రరాజ్యం మధ్యవర్తిత్వ పాత్రకు సిద్ధపడి పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. కానీ, ఆ ప్రయత్నాలు ముందుకువెళ్తున్న సూచనలు కనిపించడం లేదు. పైగా ఘర్షణలు సరికొత్త మలుపులు తిరుగుతుండటం ప్రపంచ దేశాలను కలవరపరుస్తున్నది.

ఇది ప్రజాకంటక పాలన!

దేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన రోజు(సెప్టెంబర్ 17)ను కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజాపాలన దినోత్సవం'గా జరిపింది. పేరులోనే ప్రజాపాలన ఉన్నది కాబట్టి, అద్భుతం, అమోఘం అని చాలామంది కీర్తించారు కూడా. అయితే, మనం ఓ తొమ్మిది నెలలు వెనక్కి వెళ్తే, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రోజులవి. తెలంగాణలో ప్రజాపాలన తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో చెప్పింది. అధికార పీఠం మీద కూర్చోగానే ప్రజాపాలన మొదలుపెడతామని గొప్పగా ప్రచారం చేసింది.

కానీ, రాష్ట్రంలో ఇప్పుడేం జరుగుతున్నది? నేతి బీరకాయలో నెయ్యి ఎలా ఉండదో.. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం ఉండదని.. కాంగ్రెస్ పాలకులకు ప్రజలు, ప్రజాసంక్షేమం అంటే అస్సలే పట్టవని ఈ తొమ్మిది నెలల్లో తేలిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ పాలన నడుస్తున్నదంటే ప్రజాకంటక పాలన నడుస్తున్నది.



వై.సతీష్‌రెడ్డి
96414 66666



సెప్టెంబర్ 17 నేపథ్యంలో ప్రజాపాలన పేరును కాంగ్రెస్ సర్కార్ మరోసారి తెరమీదికి తెచ్చింది. ప్రజాపాలన అంటే ఏమిటో, ఎలా ఉంటుందో ఈ తొమ్మిది నెలల్లో మనకు అనుభవంలోకి వచ్చింది. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా, ప్రజా హక్కులను కాలరాస్తూ, ప్రశ్నించినవారిపై దాడులు చేయడమే కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన. అంతేకాదు, ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయడమనేది ఈ ప్రజాపాలనలో ముఖ్యాంశం. ఇది ప్రజా పాలన కాదు, ప్రజాకంటక పాలన.

పంటలకు నీళ్లు రావడం లేదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన రైతుల ఇండ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడమే ప్రజా పాలన. నిండు వానకాలంలోనూ పంటలు ఎండిపోతున్నాయి. వరి పొలాలు నెర్రెలు బారాయి. కాలువల ద్వారా నీళ్లిచ్చి అన్నదాతలను ఆదుకోవాలన్న సోయి పాలకులకు లేదు. దశాబ్దం కిం దట తెలంగాణ ప్రాంతంలో ఎరువులు, విత్తనాల దుకాణాల ముందు కనిపించిన చెప్పుల లైన్లు ఇప్పుడు మళ్లీ తిరిగొచ్చాయి. నాడు పోలీస్‌స్టేషన్లలో ఎరువులు పంచినట్టుగానే ఇప్పుడు పోలీసు పహారాలో ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. పంట వేయడానికి కొద్దిరోజుల ముందే ఠంచన్‌గా అకౌంట్‌లో పడే రైతుబంధు ఆగిపోయింది. రుణమాఫీ పేరుతో మాటల మాయాజాలం చేశారనే విషయం ఇప్పటికే చాలా మంది రైతులకు తెలిసిపోయింది.

అధికారంలోకి రాగానే ప్రజాపాలన పేరుతో దరఖాస్తులను స్వీకరించారు. ఆరు గ్యారంటీల అమలు కోసమే ఈ తతంగమని చెప్పారు. కానీ, ఇప్పటి వరకు అవి ఏమయ్యాయో అతీ గతీ లేదు. ఆరు గ్యారంటీలు, 420 హామీలన్నీ అటకెక్కాయి. 'మేమొస్తే అన్నీ డబుల్' అని చెప్పుకున్నోళ్లు.. కనీసం పాత పింఛన్లు కూడా సరిగా ఇవ్వలేకపోతున్నారు. అంటే.. ప్రజలను బురిడీ కొట్టించి ఇచ్చిన మాట తప్పడమే ప్రజాపాలన కావొచ్చు అన్న అభిప్రాయం కలుగుతున్నది.

అధికారపీఠంపై ఆసీనులైన రోజే ఉమ్మడి నల్లగొండ జిల్లా చింతపల్లిలో ఓ రైతు లాకప్‌డెత్ జరిగింది. రెండు, మూడు రోజులకే బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు మొదలయ్యాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు మూడు రాజకీయ హత్యలు జరిగినా ఇప్పటికీ నిందితులను పోలీసులు పట్టుకోలేకపోయారు. ఇటీవల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేపై హత్యాయత్నం జరిగింది. దానికి ముందు మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేల మీద హత్యాయత్నం జరిగింది. ప్రజా సమస్యలపై సోషల్ మీడియాలో పోస్టు పెడితే చాలు దాడులు చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న జర్నలిస్టులపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు, లైంగికదాడులు.. ఇవన్నీ ఇప్పుడు సర్వసాధారణమయ్యాయి. రాష్ట్ర రాజధానిలో నెల రోజుల్లో 30కి పైగా హత్యలు జరగడం.. రుణమాఫీ, రైతుభరోసా అడిగితే దాడులు చేయడం.. వరద పరిహారం అడిగిన బాధితులపై లాఠీచార్జీలు.. ఇవన్నీ ప్రజాపాలన పుణ్యమే. మహిళలపై దాడులను ఖండించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేచురల్ రియాక్షన్స్ ఉంటాయంటూ దాడులకు ఉసిగొల్పడం ప్రజాపాలనలో మనం చూసిన మరో అద్భుత ఘట్టం. ఓవైపు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నడుం కట్టి పోరాడుతున్నామని చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతూ.. మరోవైపు అదే రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే ప్రజా పాలనా?

రాష్ట్రంలో ఏ ఒక్క వ్యవస్థ కూడా సక్రమంగా నడవటం లేదు. తెలంగాణలో శాంతిభద్రతలు పట్టాలు తప్పాయి. అందుకే అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిన గురుకుల విద్యాలయాలు నేడు సమస్యలకు నెలవుగా మారాయి. విద్యార్థుల మరణాలు, సిబ్బంది దురుసు ప్రవర్తన, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు.. వెరసి ఒకనాడు సీటు కోసం లైను కట్టిన తల్లిదండ్రులు ఇప్పుడు 'మాకొద్దీ గురుకులాలు' అని పిల్లలను ఇంటికి తీసుకెళ్లే పరిస్థితులు వచ్చాయి. కానీ, ఒకటి మాత్రం నిజం. ఆనాడు హైదరాబాద్ స్టేట్‌గా ఉన్నప్పుడు నిజాం పాలనలో, రజాకార్ల అకృత్యాల మధ్య చవిచూసిన అనుభవాలను ఈ ప్రజాపాలనలో తెలంగాణ ప్రజలు నెమరు వేసుకుంటున్నారు. నయా నిజాం మాదిరిగా రేవంత్‌రెడ్డి తెలంగాణను పాలిస్తున్నారు. నాడు నిజాం పాలకులు ప్రజలపైకి రజాకార్ సైన్యాన్ని ఎగదోసినట్టు ఇప్పుడు తన పార్టీ కార్యకర్తలను, పోలీసులను ప్రశ్నిస్తున్నవాళ్లపైకి ఎగదోస్తున్నారు.

నాటి నిజాం పాలనకు ఏ మాత్రం తీసిపోకుండా ఈ తొమ్మిది నెలల ప్రజాపాలన సాగిందనే సంబురంతోనే ఏమో సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరిపారు. వాస్తవానికి నిజాం పాలన నుంచి బయటకొచ్చి మనం భారతదేశంలో కలిసిన సందర్భంగా విలీన దినోత్సవాన్ని జరుపుకొంటాం. కానీ, ప్రస్తుత సర్కార్ పూర్తిగా నాటి నిజాం పంథాలో, ఒకరకంగా చెప్పాలంటే నిజాం పాలకులకు ప్రతిరూపంగా నిరంకుశ పాలన చేస్తున్నారు కాబట్టి సంబురాలు జరుపుకున్నారు. నాడు నిప్పనీలిగిన నిజాంనే ఈ గడ్డ ఉరికించింది. ప్రజాపాలన పేరుతో నిజాంలా నిరంకుశత్వానికి పాల్పడుతున్న ప్రస్తుత పాలకులు ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిది.

(వ్యాసకర్త: కన్వీనర్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం)



అసమానతల అభివృద్ధి



ఇషాన్ బక్షి

2023-24లో ఏపీకి చెందిన ఓ వ్యక్తి సగటు ఆదాయం బీహార్‌లో ఉన్నవారి కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. భవిష్యత్‌లోనూ వృద్ధి రేట్లు గత ట్రెండ్లకు అనుగుణంగానే ఉంటాయని అనుకుందాం. అయినప్పటికీ, ఈ దశాబ్దం చివరి నాటికి రెండు రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల సగటు ఆదాయం మధ్య అంతరం నాలుగున్నర రెట్లు ఉండే అవకాశం ఉంది.

ఇప్పుడు ఈ రెండు రాష్ట్రాల వృద్ధి పథాలను తారుమారు చేసి చూద్దాం. ఈ లెక్కన కూడా 15 ఏండ్ల తర్వాత బీహార్‌కు చెందినవారి కంటే ఏపీవాసుల తలసరి ఆదాయమే ఎక్కువగా ఉంటుంది. దక్షిణాదిలోని ధనిక రాష్ట్రాలన్నింటిలో ఏపీ తలసరి ఆదాయం తక్కువ కావడం గమనార్హం. ఇక్కడ ఏపీ, బీహార్ అనేవి ఉదాహరణ మాత్రమే. ఆంధ్రా స్థానంలో ఇతర దక్షిణాది రాష్ట్రాలను, బీహార్ స్థానంలో ఉత్తర, మధ్య, తూర్పు భారత్‌లోని ఇతర రాష్ట్రాలను తీసుకొని పోల్చి చూసినా ఈ అంశంలో పెద్దగా మార్పేమీ కనిపించదు.

ప్రభుత్వ విధానాలు, మార్కెట్ శక్తుల ద్వారా దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయి. ఐటీ సెక్టార్ చాలావరకు దక్షిణాదిలోనే ఉన్నది. దేశంలోని 37 శాతం వరకు పరిశ్రమలు దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాల్లోనే ఉన్నాయి. అంతేకాదు, ఈ ఐదు రాష్ట్రాల్లో 33 శాతం మంది ఉద్యోగులు ఉన్నారు. దేశవ్యాప్తంగా ఎగుమతుల్లో టాప్-20లో ఉన్న జిల్లాల్లో రెండు మినహా మిగతావన్ని దక్షిణాది, పశ్చిమ రాష్ట్రాల్లోనే ఉన్నాయి. 1990ల్లో ఈ రాష్ట్రాలు దేశ జీడీపీలో సుమారుగా పావు వంతు వాటా కలిగి ఉండేవి. కానీ, 2022-23 నాటికి ఈ రాష్ట్రాల వాటా మూడొంతులకు చేరుకున్నది. దీన్ని ఆయా రాష్ట్రాల జనాభా ప్రకారం చూసినట్టయితే, ఈ సంఖ్య మరింతగా పెరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలు మాత్రమే ధనికం కాదు, అక్కడి ప్రజలు విద్యావంతులు, వారి పిల్లలు ఆరోగ్యవంతులు, వారు ఎక్కువగా కాలం జీవిస్తారు.

యూపీ, బీహార్‌లో చాలా తక్కువకే శ్రామిక శక్తి లభిస్తున్నప్పటికీ, కంపెనీలు అక్కడికి తరలించడానికి అది ఏ మాత్రం సరిపోదు. నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, మౌలిక వసతులు, ఆర్థిక పరిపుష్టి తదితర అంశాలు దక్షిణ, పశ్చిమ రాష్ట్రాలకు అనుకూలం. హైదరాబాద్, చెన్నై, ముంబై, పుణె లాంటి నగరాల్లో యాపిల్, ఫాక్స్‌కాన్ లాంటి అంతర్జాతీయ సంస్థలను ఎక్కువగా నెలకొల్పుతున్నారు. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ఐదు సెమీకండక్టర్ ప్రాజెక్టుల్లో నాలుగు గుజరాత్‌లోనే ఏర్పాటవుతుండటం గమనార్హం.

ఢిల్లీకి సమీపంగా ఉన్న కారణంగా నోయిడా, ఘజియాబాద్ లాంటి కొన్ని నగరాలు లబ్ధి పొందుతున్నాయి. యూపీలో ఈ రెండు నగరాల్లోనే 46 శాతం వేతన జీవులు ఉన్నారు. హైవేలు, విమానాశ్రయాల నిర్మాణం ద్వారా యూపీలోని కొన్ని ప్రాంతాలకు ఆర్థిక ఊపు రావడం తప్ప, దాని వల్ల అంతకుమించి ఏం జరుగుతుంది?

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వృద్ధిరేటులో కొనసాగుతున్న వైవిధ్యం కారణంగా పేద రాష్ట్రాల నుంచి ధనిక రాష్ట్రాలకు వలసలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అధిక జనాభా ఉండే రాష్ట్రాల్లో అధిక జనాభా పెరుగుదల రేటు, తక్కువ ఉపాధి అవకాశాలు ఉంటాయి. దీని కారణంగా దక్షిణాది, పశ్చిమ, ఉత్తర భారత్‌లోని కొన్ని నగరాలపై మరింత ఒత్తిడి పెరుగుతున్నది. ఈ వలసల ప్రభావం ధనిక ప్రాంతాల్లోని స్థానికుల నుంచి ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌కు దారితీసే ప్రమాదం ఉంది. ఉద్యోగాల కొరత కారణంగా తక్కువ ఆదాయ రాష్ట్రాల్లోని కొన్ని వర్గాలు కూడా ఇలాంటి డిమాండ్ చేసే అవకాశం ఉంది.

సైద్ధాంతిక ధోరణితో సంబంధం లేకుండా పాపులిజానికి ప్రభుత్వాలు ఎక్కువగా ప్రాధాన్యమిస్తాయి. తక్కువ నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను సృష్టించడంలో తమ అసమర్థత, వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి దక్షిణాది లాంటి ధనిక ప్రాంతాల నుంచి ఆర్థిక వనరుల బదిలీని ప్రభుత్వం ఎంచుకుంటుంది.

ఏదేమైనప్పటికీ, ఒక దేశ చరిత్రలో 15 ఏండ్లు ఎక్కువ సమయమేమీ కాదు. కానీ, అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. దేశంలోని తక్కువగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో వృద్ధికి అవరోధంగా ఉన్నవాటిని తొలగించడానికి, సమస్యలను పరిష్కరించడానికి ఈ సమయం సరిపోతుంది.

'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో...

ఆమె ఎక్కడా వణకలేదు, బెణకలేదు, తొణకలేదు. ఒత్తిడిని తన దరిదాపుల్లోకి రానివ్వలేదు. ప్రత్యర్థిని మాటల తూటాలతో చీల్చిచెండాడారు. తన విధానాలను విస్పష్టంగా వివరించారు. ప్రత్యర్థి ప్రశ్నలకు దీటుగా సమాధానాలిచ్చారు. అమెరికాను అగ్రభాగాన నిలిపేందుకు తనకంటూ ఒక విజన్ ఉందని నొక్కిచెప్తూనే, ప్రత్యర్థి వద్ద ఎలాంటి ప్రణాళికలు లేవని కుండబద్దలు కొట్టారు. ప్రతి అంశంలోనూ ఆధిక్యత కనబరిచి స్పష్టమైన ఆధిపత్యం చెలాయించారు. జాతీయ నుంచి అంతర్జాతీయ యుద్ధాల వరకు తన వైఖరిని విస్పష్టంగా వెల్లడించిన అమెరికా నల్లకలువ కమలా హ్యారిస్ అగ్రరాజ్యంతో పాటు ప్రపంచాన్ని మైమరిపించారు.

అధ్యక్ష పీఠం వైపు అతివ!



సట్ల మురళీకృష్ణ
94411 74565



రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో ఫిలడెల్ఫియాలో జరిగిన తొలి డిబేట్‌లోనే డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహ్యారిస్ తన సత్తా ఏమిటో చాటిచెప్పారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ట్రంప్‌కు మూడు చెరువుల నీళ్లు తాగించారు. డిబేట్ ప్రారంభానికి ముందే తన సహజసిద్ధమైన చిరునవ్వుతో ప్రత్యర్థితో కరచాలనం చేసిన కమలా అమెరికన్లను ఆకట్టుకున్నారు. తడబడకుండా, ఒత్తిడికి గురికాకుండా, కొండంత ఆత్మవిశ్వాసంతో సుత్తి లేకుండా, ముక్కుసూటిగా డిబేట్ చివరి వరకు ఆమె మాట్లాడి అందరి మన్ననలు పొందారు. అంతేకాదు, విమర్శలకు ప్రతివిమర్శలు చేస్తూ, సవాళ్లకు ప్రతిసవాల్ విసురుతూ ఎక్కడా తగ్గేదేలేదని నిరూపించారు. ఈ క్రమంలో లీగల్ విభాగంలో ప్రాసిక్యూటర్‌గా గతంలో ఆమెకున్న అనుభవం ఎంతగానో కలిసొచ్చింది. ఆర్థిక సంక్షోభం నుంచి యుద్ధాల వరకు సాగిన ఈ డిబేట్‌లో కమలా హ్యారిస్ పైచేయి సాధించారని చెప్పడానికి అమెరికన్ మీడియా ఆమెను ఆకాశానికి ఎత్తిన తీరే నిదర్శనం.

ఎన్నికల ప్రక్రియ ప్రారంభంలో జరిగిన మొదటి డిబేట్‌లో బైడెన్‌పై ట్రంప్ స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అనంతర పరిణామాల నేపథ్యంలో బైడెన్ నిష్క్రమణ, ఆయన స్థానంలో కమలా హ్యారిస్ అభ్యర్థిగా బరిలో నిలవడంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. అప్పటివరకు గెలుపు ధీమాతో ఉన్న ట్రంప్‌లో నిరాశ, నిస్పృహ ఆవహించాయి. అనూహ్యంగా తెరపైకి వచ్చిన కమలా హ్యారిస్ గంటల వ్యవధిలోనే మెజారిటీ పార్టీ ప్రతినిధులు, కీలక నేతల మద్దతును కూడగట్టుకున్నారు.

ప్రజామోదం నేపథ్యంలో మొదట కినుక వహించిన మాజీ అధ్యక్షుడు ఒబామా సైతం ఆమెకు మద్దతివ్వాల్సి వచ్చింది. భారీగా విరాళాల సేకరణతో కమల గ్రాఫ్ రోజురోజుకు పెరుగుతూ పోయింది. దీంతో అప్పటి వరకు ఓడిపోతామని నైరాశ్యంలో ఉన్న డెమోక్రటిక్ వర్గాల్లో ఒక్కసారిగా జోష్ వచ్చింది. వారి ఆత్మస్థైర్యం అమాంతం పెరగగా.. ట్రంప్ మద్దతుదారుల్లో నిస్పృహ అలుముకున్నది.

కమలా హ్యారిస్ అతితక్కువ సమయంలోనే ట్రంప్‌కు కొరకరాని కొయ్యలా మారారు. భారతీయ మూలాలున్న కమలాహ్యారిస్‌కు స్వతహాగానే భారతీయులు మద్దతుగా నిలుస్తున్నారు. తండ్రి వారసత్వం వల్ల నల్లజాతీయులు కూడా ఆమెకు జై కొడుతున్నారు. దీంతో అధ్యక్ష పీఠం దిశగా ఆమె రేసుగుర్రంలా దూకుడుగా దూసుకుపోతున్నారు. ఓవైపు తన మాటలతో అమెరికన్లను మంత్రముగ్ధుల్ని చేస్తూనే.. మరోవైపు విమర్శలతో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. ఏ మాత్రం అలసత్వం వహించకుండా ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు.

నల్లజాతి ఓటర్లలో 69 శాతం మంది నల్లకలువకే మద్దతు తెలుపుతున్నట్టు సర్వేలు తేల్చిచెప్తున్నాయి. దీంతో శ్వేత సౌధం ముమ్మాటికీ తమదేనని కమల మద్దతుదారులు ధీమాగా ఉండటంతో ట్రంప్‌కు ఓటమి భయం పట్టుకున్నది. అందుకే ఆయన జాతులు, వర్గాల మధ్య చిచ్చుపెడుతూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు.

ప్రస్తుత డిబేట్ ద్వారా మధ్యతరగతి మద్దతును కమలాహ్యారిస్ కూడగట్టుకున్నారు. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా అమెరికాకు ఉన్న ప్రాధాన్యాన్ని, పెద్దన్న పాత్రను కాపాడుతారనే విశ్వాసాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో నవంబర్ 5న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో కమలాహ్యారిస్ గెలుపు ఖాయంగా కనిపిస్తున్నది.

నల్లజాతి ఓటర్లలో 69%మంది నల్లకలువకే మద్దతు తెలుపుతున్నట్టు సర్వేలు తేల్చి చెప్తున్నాయి. దీంతో శ్వేత సౌధం ముమ్మాటికీ తమదేనని కమల మద్దతుదారులు ధీమాగా ఉండటంతో ట్రంప్‌కు ఓటమి భయం పట్టుకున్నది. అందుకే ఆయన జాతులు, వర్గాల మధ్య చిచ్చుపెడుతూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు.

పేదలపై అక్కసేలా?

'పోలీసులు మా బ్యాగ్, బుక్స్ తీసుకునే టైం కూడా ఇవ్వకుండా ఇళ్లను కూల్చివేశారు. ఇప్పుడు ఎట్లా చదువుకోవాలో మాకు అర్థం కావడం లేదు' అంటూ హైడ్రా దురాగతాలను వివరిస్తూ అభం శుభం తెలియని చిన్నారి కన్నీటి పర్యంతమైన తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది. రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతల కారణంగా పేదలు పడుతున్న కష్టాలు, తీస్తున్న కన్నీళ్లు, పెడుతున్న ఆక్రందనలు అన్నీ ఇన్నీ కావు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలిచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీలు ఎక్కడికక్కడ పేరుకుపోయేసరికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొత్తగా 'హైడ్రా'మాకు తెరదీసింది. సీఎం రేవంత్ చేసే ఈ రాజకీయాలను 'డైవర్షన్ పాలిటిక్స్' అని ఘంటాపథంగా వర్ణించవచ్చు.



జీడిపల్లి రాంరెడ్డి
96666 80051



గ్రేటర్ హైదరాబాద్ నగర పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా ఏర్పాటు చేసిన హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) వ్యవహారం రోజురోజుకు వివాదాస్పదం అవుతూనే ఉన్నది. గతంలో జంట నగరాల కేంద్రంగా వందలాది చెరువులుండేవి. వాటిని కబ్జాదారులు ఆక్రమణ చేసి, నిర్మాణాలూ చేశారు. ఇదంతా ఒకటీ, రెండు రోజుల్లో జరిగిన తతంగం కాదు. కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే ఈ నిర్మాణాలు మొదలయ్యాయి. హైదరాబాద్ చుట్టూరా ధనవంతులు, రాజకీయ నాయకులు, సినిమా, వ్యాపారవేత్తలు చెరువులను, కుంటలను ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులైతే పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్లను నిర్మించి మధ్య తరగతి ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఈ నిర్మాణాలకు పదో, పరకో తీసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇవ్వడంతో అక్రమ నిర్మాణాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విస్తరించాయి. చెరువులను కబ్జా చేయడంతో వాటి నీటి నిల్వ పరిధి (ఎఫ్‌టీఎల్) రానురాను కుంచించుకుపోయింది. అనుమతులు ఇచ్చే సమయంలో చెరువులు, కుంటలను కాపాడాల్సిన నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు ఏం చేశారన్నది సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది. దీంతో మహా నగరమైన హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడ్డప్పుడల్లా పలు కాలనీలు నీటిలో మునిగిపోతున్నాయి. ఇంత పెద్ద నగరానికి ఒక పటిష్ఠమైన భవిష్యత్తు ప్రణాళిక లేకపోవడం విచారించదగిన విషయమే.

అయితే రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా అధికారులు ముందుగా చేయవలసిన పని ఏమంటే... హైదరాబాద్‌లో మొత్తం ఎన్ని చెరువులున్నాయి? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఏ మేరకు ఆక్రమణలు జరిగాయి? ఆక్రమించిన వారి వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆక్రమణదారులకు ముందుగా నోటీసులు ఇచ్చి, ఆ తర్వాతే కూల్చివేత పనులు షురూ చేయాలి. అయితే, కబ్జా చేసిన ధనవంతుల నిర్మాణాలను కూల్చితే సమస్యేమీ లేదు. కానీ, పేద, మధ్య తరగతి ప్రజల నిర్మాణాలను కూల్చితేనే అసలు సమస్య. వాళ్లు పైసా పైసా పోగు చేసుకొని కొనుక్కున్న, లేదా కట్టుకున్న ఇండ్లు అవి. అలాంటి నిర్మాణాలను కూలిస్తే వాళ్లు పడే బాధ వర్ణనాతీతం. కబ్జాలకు ప్రధాన కారణం అసలు వీళ్లేనా, కాదా అని ఒక్కసారి తనిఖీ చేయాలి. ఒకవేళ వాళ్లే అయితే, అక్రమ నిర్మాణాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపవలసిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉన్నది. అయితే, ఈ కబ్జా పర్వంలో భాగస్వాములైన నీటిపారుదల, మున్సిపల్, రెవెన్యూ శాఖ అధికారులను తప్పుపట్టాల్సిన అవసరం లేదా అని ఒక్కసారి ప్రభుత్వం అవలోకనం చేసుకోవాలి. అధికార యంత్రాంగం పటిష్ఠంగా ఉంటే అసలు అక్రమ నిర్మాణాలు జరిగేవే కావనేది వేరే విషయం.

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక కాలనీలో నిర్మించిన ఆక్రమణలు కూల్చివేసినప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా రేవంత్‌రెడ్డి.. 'నిర్మితమై ఉన్నవాటిని కూల్చడం పద్ధతి కాదు, ఎంతో కొంత జరిమానా విధించి ఆ నిర్మాణాలను రెగ్యులరైజ్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద లేదా?' అని ప్రశ్నించారు. నేడు ఆ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.

నాడు పేదల పక్షాన నిలిచిన రేవంత్ రెడ్డి, నేడు పేదల ఇండ్లను కూల్చడం సరైన నిర్ణయమేనా? అని ఆయన ఒక్కసారి ప్రశ్నించుకోవాలి. 'హైడ్రా' విధానం మంచిదే కావచ్చు కానీ, తెలిసో, తెలియకో ఎవరో అమ్మిన భూములను, భవనాలను కొనుక్కున్న మధ్య తరగతి ప్రజలు ఎందుకు బలి కావాలి? ఇలాంటివారికి ప్రభుత్వం భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదా? ఇలాంటివాళ్లకు ప్రభుత్వం వేరేచోట ఇంటి స్థలాలను కేటాయించాలి. అప్పుడే 'హైడ్రా' చేస్తున్న పనికి అర్థం ఉంటుంది. అంతేకానీ, హడావుడిగా ఇవి అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేస్తే పేద ప్రజలు రోడ్డున పడతారనే విషయాన్ని ముఖ్యమంత్రి మరిచిపోకూడదు.

సుసంపన్న తెలంగాణ

- కేసీఆర్‌పాలనలో రాష్ట్రంలో ఆర్థిక పురోగతి
- తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానం
- జాతీయ సగటుతో పోలిస్తే 94 శాతం ఎక్కువ
- ప్రధాని ఆర్థిక సలహా మండలి నివేదికలో వెల్లడి
- అంకెలు అబద్ధాలు చెప్పవంటూ కేటీఆర్ ట్వీట్
- కేసీఆర్ విజయాలను ఎప్పటికీ చెరిపేయలేరని వెల్లడి



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అతి పిన్న రాష్ట్రంగా పిలుస్తున్న తెలంగాణ ఆర్థిక వృద్ధిలో రారాజుగా వెలుగొందుతున్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో తొమ్మిదిన్నరేండ్ల పాలనలో పటిష్ఠ పునాదులపై పునర్నిర్మాణమైన తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు దేశానికే తలమానికంగా నిలిచింది. తలసరి ఆదాయం, జీఎస్డీపీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి సుసంపన్నమైన రాష్ట్రంగా కొత్త రికార్డు సృష్టించింది. ఈ మేరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) తాజా నివేదికలో వెల్లడించింది.

తలసరి, జీఎస్డీపీలో టాప్

పౌరుల తలసరి ఆదాయాన్ని, ఉత్పాదకతను దేశ లేదా రాష్ట్రాభివృద్ధికి కొలమానంగా తీసుకొంటారు. కేసీఆర్ ప్రభుత్వహయాంలో గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ ఈ రెండు అంశాల్లో రాకెట్ వేగంతో దూసుకుపోయింది. ఈఏసీ-పీఎం తాజా నివేదిక ప్రకారం తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే తెలంగాణ 94 శాతం ఎక్కువ తలసరిని నమోదు చేసింది. తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా కర్ణాటక, తమిళనాడు, కేరళ ఉన్నాయి. ఇక, జీడీపీలో తెలంగాణ వాటా కూడా అంతకంతకూ పెరుగుతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. 2010-11లో దేశ జీడీపీలో తెలంగాణ వాటా 3.8 శాతంగా ఉండగా.. 2023-24 నాటికి ఇది 4.9 శాతానికి ఎగబాకింది. 13 ఏండ్ల వ్యవధిలో ఈ స్థాయిలో పెరుగుదల నమోదు చేసిన అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నట్టు నివేదిక వివరించింది. 2014-15లో అప్పటి ధరలను బట్టి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ. 5.05 లక్షల కోట్లుగా నమోదైంది. 2023-24నాటికి తెలంగాణ జీఎస్డీపీ రూ. 14.64 లక్షల కోట్లకు చేరింది. పదేండ్ల వ్యవధిలో తెలంగాణ జీఎస్డీపీ రూ. 9.59 లక్షల కోట్ల మేర పెరిగింది.

దక్షిణాదిదే హవా

1991 కంటే ముందు దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా పెద్దగా లేనప్పటికీ, అనంతర కాలంలో జీడీపీలో వీటి ప్రాతినిధ్యం అనూహ్యంగా పెరిగినట్టు ఈఏసీ-పీఎం నివేదిక వెల్లడించింది. 2023-24 నాటికి దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, ఏపీ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు దేశ జీడీపీలో దాదాపు 30 శాతం వాటాను కలిగి ఉన్నట్టు నివేదిక స్పష్టం చేసింది. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే, దక్షిణాది రాష్ట్రాల్లో ఉత్పాదకత, తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నట్టు వివరించింది. ముఖ్యంగా 2000వ సంవత్సరం నుంచి దక్షిణాది రాష్ట్రాల్లో నమోదైన తలసరి ఆదాయం జాతీయ సగటుతో పోలిస్తే ఎంతో ఎక్కువగా ఉన్నట్టు తెలిపింది.

దేశంలో సంపన్న రాష్ట్రాలు/యూటీ (సాపేక్ష తలసరి ఆదాయం లెక్కల్లో)

రాష్ట్రం	1960-61	2023-24(జాతీయ సగటు 100% తీసుకొంటే)
ఢిల్లీ	218.3%	250.8%
తెలంగాణ	-	193.6%
కర్ణాటక	96.7%	180.7%
హర్యానా	106.9%	176.8%
తమిళనాడు	109.2%	171.1%

పేద రాష్ట్రాలు/యూటీ (సాపేక్ష తలసరి ఆదాయం లెక్కల్లో)

రాష్ట్రం	1960-61	2023-24 (జాతీయ సగటు)
బీహార్	70.3%	32.8%
ఝార్ఖండ్	-	57.2%
ఉత్తరప్రదేశ్	82.4%	50.8%
మణిపూర్	50.3%	66%
అస్సాం	102.9%	73.7%

తెలంగాణ, జాతీయ తలసరి వివరాలు (రూ.ల్లో)

ఆర్థిక సంవత్సరం	తలసరి ఆదాయం		వృద్ధి శాతం	
	తెలంగాణ	దేశం	తెలంగాణ	దేశం
2014-15	1,24,104	86,647	10.6	9.5
2015-16	1,40,840	94,797	13.5	9.4
2016-17	1,59,395	1,04,880	13.2	10.6
2017-18	1,79,358	1,15,224	12.5	9.9
2018-19	2,09,848	1,25,946	17.0	9.3
2019-20	2,31,326	1,32,341	10.2	5.1
2020-21	2,25,663	1,27,065	-2.4	-4.0
2021-22	2,70,839	1,48,524	20.0	16.9
2022-23	3,12,398	1,72,276	15.3	16.0
2023-24	3,47,299	1,83,236	11.1	6.3

జీఎస్డీపీ/జీడీపీ పెరుగుదల ఇలా..

ఆర్థిక సంవత్సరం	జీఎస్డీపీ/జీడీపీ (రూ. కోట్లలో)		వృద్ధి శాతం	
	తెలంగాణ	దేశం	తెలంగాణ	దేశం
2014-15	5,05,849	1,24,67,959	12.0	11.0
2015-16	5,77,902	1,37,71,874	14.2	10.5
2016-17	6,58,325	1,53,91,669	13.9	11.8
2017-18	7,50,050	1,70,90,042	13.9	11.0
2018-19	8,57,427	1,88,99,668	14.3	10.6
2019-20	9,50,090	2,01,03,593	10.8	6.4
2020-21	9,42,814	1,98,29,927	-0.8	-1.4
2021-22	11,28,907	2,34,71,012	19.7	18.4
2022-23	13,13,391	2,72,40,712	16.3	16.1
2023-24	14,63,960	2,95,36,500	11.4	8.4

జాతీయ సగటుతో పోలిస్తే, తెలంగాణ తలసరి ఆదాయంలో వృద్ధి ఇలా..

అంకెలు ఎప్పుడూ అబద్ధాలు చెప్పవు.. కేసీఆర్ విజయాలు చెదిరిపోవు: కేటీఆర్



బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అత్యంత అద్భుతంగా అభివృద్ధి చెందిందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి తేల్చిచెప్పింది. తెలంగాణ అభివృద్ధి చెందింది అనడానికి ఇంతకంటే వేరే సాక్ష్యం ఏం కావాలి? కేవలం తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో జాతీయ సగటు కంటే 94 శాతం అధిక తలసరి ఆదాయాన్ని తెలంగాణ నమోదు చేసింది. తెలంగాణను కేసీఆర్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. అంకెలు ఎప్పుడూ అబద్ధాలు చెప్పవు. కేసీఆర్ సాధించిన విజయాలు ఎప్పటికీ చెరిపేయలేరు. జై తెలంగాణ..

-ఎక్స్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



వసుంధర యాదవ్

తెలంగాణకు నలుగురే ఐపీఎస్‌లు

- 76వ బ్యాచ్‌లో 188 మంది
- 58 మంది మహిళా ఐపీఎస్‌లు
- ఎన్‌పీఏలో 20న దీక్షాంత్ పరేడ్
- సీఎం విజ్ఞప్తిపై కేంద్రం స్పందనేది?

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి నలుగురు ఐపీఎస్‌లను కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. 2024 బ్యాచ్‌కు చెందిన 76 రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ (ఆర్ఆర్)లో తెలంగాణకు కేవలం నలుగురు ఐపీఎస్‌లను మాత్రమే కేటాయించింది. ఈ ఏడాది మొత్తం 207 మంది ట్రైనీ ఐపీఎస్ శిక్షణ పూర్తిచేసుకోగా, అందులో 188మంది ఐపీఎస్‌లు, మరో 19మంది నేపాల్, భూటాన్, మాల్దీవ్ ఫారెన్ ఆఫీసర్స్ ఉన్నారు. బ్యాచ్‌లో మొత్తం 58మంది మహిళా ఐపీఎస్‌లు ఉన్నారు. ఈ నెల 20న జాతీయ పోలీస్ అకాడమీలో 76వ ఐపీఎస్ దీక్షాంత్ పరేడ్ నిర్వహించనున్నట్టు ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గార్గ్ వెల్లడించారు. తెలంగాణ క్యాడర్‌కు వరంగల్ జిల్లాకు చెందిన రుత్విక్ సాయి కొట్టె, పత్తిపాక సాయికిరణ్, జమ్మూకశ్మీర్‌కు చెందిన మనన్ భట్, యూపీకి చెందిన వసుంధర యాదవ్‌ను కేటాయించారు.

సీఎం రిక్వెస్ట్ పక్కకేనా?

ఈఏడాది జూలైలో ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో పలుమార్లు భేటీ అయ్యారు. తెలంగాణకు 61మంది ఐపీఎస్‌లను కేటాయించాలని రిక్వెస్ట్ చేశారు. అయితే, ఈ ఏడాది దీక్షాంత్ పరేడ్ నుంచి బయటికి రానున్న వారిలో కనీసం 10మందినైనా కేటాయిస్తారని భావించారు. కేవలం నలుగురిని మాత్రమే కేటాయించడంతో సీఎం విన్నపాలు బూడిదలో పోసినట్టేనా? అని కొందరు రిటైర్డ్ ఐపీఎస్‌లు పెదవి విరుస్తున్నారు.

జానీమాస్టర్‌పై చర్యలు తప్పవు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఓ అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్‌పై ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ లైంగిక వేధింపుల కేసుపై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్ అయింది. బాధిత మహిళకు పోలీసులు భద్రత కల్పించాలని ఆదేశిస్తామని చెప్పింది. బాధితురాలు బుధవారం మహిళా సంఘాల నాయకులతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిశారు. జానీమాస్టర్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, మతం మార్చుకొని పెళ్లి చేసుకోవాలని బలవంతం చేశాడని ఫిర్యాదు చేసింది. ఇప్పటికే జానీ కోసం పోలీసులు గాలిస్తుండగా, తాజాగా బాధితురాలు మహిళా కమిషన్‌ను ఆశ్రయించింది. బాధిత మహిళకు కమిషన్ అండగా ఉంటుందని చైర్‌పర్సన్ శారద వారికి భరోసా ఇచ్చారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వారెవరైనా వదిలేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. బాధితురాలికి రక్షణ లేదని, ఆమెకు సెక్యూరిటీ ఇవ్వాలని పోలీసులను ఆదేశిస్తానని ఆమె తెలిపారు.

జానీ మాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎన్ఎఫ్ఐడబ్ల్యూ

మహిళా కొరియోగ్రాఫర్‌ను లైంగికంగా వేధించిన జానీమాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో లైంగిక వేధింపుల ఫిర్యాదుల ప్యానల్ ఉన్నప్పటికీ మహిళలపై వేధింపులు పెరుగుతూనే ఉన్నాయని, ఈ ప్యానల్ మహిళలకు ధైర్యం కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ప్యానల్ చిత్తశుద్ధితో వ్యవహరించి జానీమాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకొని, భాదితురాలికి అండగా ఉండాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సదాలక్ష్మి డిమాండ్ చేశారు.



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ కారును అడ్డుకొని మాట్లాడుతున్న కూరగాయల వ్యాపారులు

ఎమ్మెల్యే వినోద్‌కు నిరసన సెగ

- అడ్డుకున్న కూరగాయల వ్యాపారులు
- దుకాణాలకు అడ్వాన్స్ కట్టలేమని స్పష్టీకరణ

బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు నిరసన సెగ తగిలింది. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల జాతీయ రహదారి పక్కన ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించి వస్తున్న ఎమ్మెల్యేను ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం దుకాణాల్లోని కూరగాయల వ్యాపారులు అడ్డుకున్నారు. మార్కెట్ భవనంలోని దుకాణాలను ఉచితంగా కేటాయిస్తామని చెప్పి భవన సముదాయం పూర్తికాగానే అధికారులు అడ్వాన్సులు, నెలవారి అద్దెలు అడుగుతున్నారని వారు ఎమ్మెల్యేను నిలదీశారు. తమ దుకాణాలకు తాము అడ్వాన్సులు ఇవ్వడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము నిరుపేదలమని, అడ్వాన్స్‌లు ఎక్కడి నుంచి తెచ్చేదని, కేవలం నెలవారి అద్దె మాత్రం చెల్లిస్తామని చెప్పారు. సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో కూరగాయల వ్యాపారులు శాంతించారు.

కంగన రనౌత్‌వి భోగం వేషాలు

బీజేపీ ఎంపీపై దానం అభ్యంతరకర వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఎంపీ, సినీనటి కంగనా రనౌత్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'సినిమాల్లో భోగం వేషాలు వేసే కంగనా రనౌత్‌కు రాహుల్‌గాంధీ గురించి మాట్లాడే నైతిక హక్కు ఉన్నదా' అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సినీవృత్తిలో భాగంగా చేసే కార్యక్రమాలను కించపరచడం ఎమ్మెల్యే హోదాలో ఉన్న దానంకు తగునా? అని ప్రశ్నిస్తున్నారు. ఇది మహిళలను కించపరచడం కాదా? అని నిలదీస్తున్నారు. మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేసిన దానంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాహుల్‌గాంధీపై బీజేపీ నేతల విద్వేషపూరిత వ్యాఖ్యలను నిరసిస్తూ నిర్వహించిన ధర్నాలో కంగనపై దానం నోరుపారేసుకున్నారు.

డీజే సౌండ్‌తో గుండెపోటు.. యువకుడి మృతి

మాక్లూర్, సెప్టెంబర్ 18 : గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో డీజే సౌండ్‌కు గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ముత్యంపల్లికి చెందిన ఊరడి మధు (27) మంగళవారం మానిక్‌బండార్‌లో హిందూ సేన యువజన గణేశ్ మండలి వినాయక విగ్రహ నిమజ్జనానికి ట్రాక్టర్ తీసుకొచ్చాడు. నిమజ్జన శోభాయాత్ర రామాలయానికి చేరుకోగా.. బుధవారం తెల్లవారుజాము 3గంటల ప్రాంతంలో మధు ఆలయ ఆవరణలో నిద్రించాడు. ఉదయం 8 గంటల సమయంలో గణేశ్ మండలి సభ్యులు అతడిని నిద్రలేపడానికి ప్రయత్నించగా..అప్పటికే మృతిచెంది ఉన్నట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. డీజే సౌండ్‌తో గుండెపోటు వచ్చి మృతిచెందాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

- 28 నుంచి వచ్చేనెల 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తుల సవరణకు అక్టోబర్ 16 నుంచి 17 వరకు అవకాశం
- నవంబర్ 17న కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో 13 కేంద్రాల్లో పరీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ శాఖల్లో 2,050 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) పోస్టుల భర్తీకి వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. అర్హులైన అభ్యర్థులు ఈ పోస్టులకు బోర్డు వెబ్‌సైట్ (https://mhsrb.telangana.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను అక్టోబర్ 16వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి 17వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు సవరించుకోవచ్చు. నవంబర్ 17న కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో 13 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం తెలిపింది.

నోటిఫికేషన్‌లో అచ్చు తప్పులు.. సవరణ

వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు తొలుత విడుదల చేసిన నోటిఫికేషన్ తప్పుల తడకగా ఉన్నది. 2024 సెప్టెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి 2023 అక్టోబర్‌లో దరఖాస్తులను ముగిస్తారట. ఆన్‌లైన్ అప్లికేషన్లకు చివరి తేదీ 14-10-2023 అని నోటిఫికేషన్‌లో ఉన్నది. తమ దరఖాస్తులను 16-10-2023న ఉదయం 10.30 గంటల నుంచి 17-10-2023 సాయంత్రం 5 గంటలకు సవరించుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఆ తర్వాత ఈ తప్పులను సవరించి మరోమారు నోటిఫికేషన్ ఇచ్చారు.

నోటిఫికేషన్‌పై టీఎన్ఏ హర్షం

రాష్ట్ర ప్రభుత్వం 2,050 నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల తెలంగాణ (ప్రభుత్వ) నర్సస్ అసోసియేషన్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎంకు, ఆరోగ్య శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపింది.

పోస్టుల వివరాలు, ఖాళీలు ఇలా..

పోస్టు పేరు	శాఖ పేరు	ఖాళీల సంఖ్య
నర్సింగ్ ఆఫీసర్	డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ / డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్	1576
నర్సింగ్ ఆఫీసర్	తెలంగాణ వైద్య విధాన పరిషత్	332
నర్సింగ్ ఆఫీసర్	ఆయుష్	61
నర్సింగ్ ఆఫీసర్	ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్	1
నర్సింగ్ ఆఫీసర్	ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ & రీజినల్ క్యాన్సర్ సెంటర్ (ఎంఎన్‌జేఐవో & ఆర్‌సీసీ)	80
	మొత్తం ఖాళీలు: 2,050	

'సింగరేణి' ఫలితాల్లో రామ్‌చరణ్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంకు



రామ్‌చరణ్

శాయంపేట, సెప్టెంబర్ 18: హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన పల్నాటి రామ్‌చరణ్ సింగరేణి సంస్థ ప్రకటించిన ఉద్యోగ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ సివిల్ ఇంజినీర్ పోస్టుల పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేసింది. బీసీ-బీ క్యాటగిరీలో 150 మార్కులకు 113 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు.

ఆనవాళ్లు దెబ్బతినకుండా ఆలయాల అభివృద్ధి

- రాయగిరిలో వేద పాఠశాల..
- కీసరలో రాముడి విగ్రహం
- భద్రాచలంలో డిజిటల్ మ్యూజియం: మంత్రి సురేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): చారిత్రక ఆనవాళ్లు దెబ్బతినకుండా ఆలయాలను అభివృద్ధి చేయాలని అధికారులను దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. కీసర, యాదగిరిగుట్ట,భద్రాచలం ఆలయాల్లో సౌకర్యాల కల్పనపై సచివాలయంలో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. మానిటరింగ్ కమిటీ నివేదిక వచ్చాక యాదగిరిగుట్ట గర్భగుడి విమాన గోపురం స్వర్ణతాపడం, వేదపాఠశాల పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో గోవింద హరి చైర్మన్‌గా రాయగిరిలో 20 ఎకరాల్లో రూ.43 కోట్లతో వేదపాఠశాల నిర్మించనున్నట్టు ప్రకటించారు. యాదగిరిగుట్టలో 64 మీటర్ల నెట్‌వర్క్ ఆర్చ్ బ్రిడ్జి ని మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రామప్ప ఆలయ స్ఫూర్తితో కీసరగుట్టను తీర్చిదిద్దాలని, రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని సూచించారు. భద్రాచలంలో డిజిటల్ మ్యూజియం ఏర్పాటుకు మంత్రి ఆమోదం తెలిపారు.సమీక్షలో దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్ రావు, కంచి కామకోటి వేదపాఠశాల చైర్మన్ గోవింద హరి, కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన జిల్లా ఉద్యానవన అధికారి

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (నమస్తేతెలంగాణ): పండ్ల తోటలకు డ్రిప్ పరికరాల సరఫరాదారు నుంచి రూ.1.14 లక్షలు లంచం తీసుకుంటూ జిల్లా ఉద్యానవన అధికారి ఏసీబీ అధికారులకు చిక్కారు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా లకు డ్రిప్ పరికరాలను సరఫరా చేసిన వ్యక్తికి ఉద్యానవన శాఖ కార్యాలయం నుంచి బిల్లులు రావాల్సి ఉంది. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ.. పర్సంటేజీ డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో సూర్యనారాయణకు బుధవారం రూ.1.14 లక్షల లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ రమేశ్ తన బృందంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీలో మరణ మృదంగం

- ఒకే నెలలో 50 మంది చిన్నారులు, 14 మంది తల్లులు మృతి
- రాష్ట్రంలో పెరిగిన మాతా శిశుమరణాలు
- తొమ్మిది నెలలుగా నిలిచిపోయిన ఆరోగ్య పథకాలు



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో మరణ మృదంగం మోగుతున్నది. పాలకుల పర్యవేక్షణా లోపం, అధికారుల నిర్లక్ష్యం, వైద్యుల కొరత కలగలిసి నిండు ప్రాణాలను తోడేస్తున్నాయి. ఒకే నెలలో 50 మంది శిశువులు, 14 మంది తల్లులు మృత్యువాత పడినట్టు సమాచారం. అయితే ఈ మరణాల విషయమై వివరణ కోరేందుకు నమస్తే తెలంగాణ ప్రయత్నించగా సంబంధిత అధికారులెవరూ స్పందించలేదు. ఒక్క గాంధీ దవాఖానలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్, పేట్లబుర్జ్, నిలోఫర్ టీచింగ్ దవాఖానతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రభుత్వ దవాఖానల్లో ఎలాంటి పరిస్థితి ఉన్నదో అని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు రోగుల బంధువులు. ఏడాది క్రితం వరకు తగ్గుముఖం పట్టిన మాతా శిశు మరణాలు గత ఎనిమిది నెలలుగా పెరుగుతుండటంతో ప్రజలు సర్కార్ దవాఖానలంటేనే జంకుతున్నారు. దీనికితోడు ఇటీవల జరిగిన బదిలీల్లో సీనియర్ వైద్యులందరినీ బదిలీ చేయడంతో ప్రస్తుతం గాంధీ దవాఖానలో అనుభవజ్ఞులైన వైద్యులు పెద్దగా లేరనే ప్రచారానికి నమోదవుతున్న మరణాల సంఖ్య బలాన్ని చేకూరుస్తున్నది. గత తొమ్మిది నెలల్లో కాంగ్రెస్ సర్కార్ పలు రకాల ఆరోగ్య పథకాలను నిలిపివేసింది. దీనికితోడు గర్భిణీ మహిళలు, బాలింతలకు సరైన పోషకాహారం లభించక, మెరుగైన వైద్యం అందించేందుకు అనుభవజ్ఞులైన వైద్యులు కరువై పురిట్లోనే శిశువులు కన్నుమూస్తున్నారు. తల్లులు సైతం మృత్యువాత పడుతున్నారు.

ఇద్దరు వైద్యులపై వేటు?

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖాన ఘటనలో ఇద్దరు అమాయక వైద్యులపై సస్పెన్షన్ వేటు వేసినట్టు తెలిసింది. శిశు మరణాలకు సంబంధించి సమాచారం బయటకు పొక్కడంపై అధికారులు, పాలకులు కలిసి అమాయక వైద్యులను బలిపశువులను చేసినట్టు సమాచారం. జరిగిన ఘటనకు కప్పిపుచ్చుకునేందుకు అధికారులు యత్నిస్తున్నట్టు వైద్య సిబ్బంది ఆరోపిస్తున్నారు. అయితే వైద్యుల సస్పెన్షన్ విషయంపై రాత్రి వరకు అధికారులు అధికారికంగా ధృవీకరించలేదు.

కాన్పు కోసం కడుపుపై తొక్కి..

- సర్కారు దవాఖానలో అందుబాటులో లేని వైద్యులు
- తిడుతూ కొడుతూ నర్సుల వైద్యం
- నొప్పుల కోసం పొట్టపై తొక్కి ప్రసవం
- గంటల్లోపే శిశువు దుర్మరణం
- హుజూర్‌నగర్ దవాఖానలో దారుణం
- డీఎంహెచ్‌వో, పోలీసులకు బాధితుల ఫిర్యాదు



మృతిచెందిన శిశువు (ఫైల్)

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 18 : పుట్టబోయే బిడ్డపై ఎన్నో ఆశలు.. సర్కారు దవాఖానపై ఎంతో నమ్మకం పెట్టుకొని వచ్చిన ఆ నిండు గర్భిణి నరకం చూసింది. పురిటి నొప్పులు రావాలని, సాధారణ ప్రసవం కావాలని సిబ్బంది చేసిన నిర్వాకంతో మానసికంగా, శారీరకంగా వేదన అనుభవించింది. బూతులు తిట్టినా.. ఇష్టంవచ్చినట్టు కొట్టినా పుట్టబోయే బిడ్డ కోసం భరించింది. పండంటి బిడ్డ చేతిలోకి వస్తుందని వారు ఎంత ఇబ్బంది పెట్టినా తట్టుకొని ఎదురు చూసిన ఆ తల్లికి చివరికి ఏడుపే మిగిలింది. డ్యూటీ డాక్టర్లు అందుబాటులో లేక.. సర్కారు దవాఖానలో నర్సులు చేసిన అమానవీయ వైద్యం ఓ పసికందు ప్రాణం తీసింది. నొప్పుల కోసం గర్భిణిని తిడుతూ కొడుతూ చివరికి సాధారణ ప్రసవం కోసం పొట్టపై తొక్కడంతో పుట్టిన శిశువు కొద్దిసేపట్లోనే మృతిచెందింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఏరియా దవాఖానలో మంగళవారం ఈ దారుణం జరిగింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం గుర్రంబోడు తండాకు చెందిన పాసిపాక నాగరాజు భార్య రేణుకకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో హుజూర్‌నగర్ ఏరియా దవాఖానకు తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులు అడ్మిట్ చేసుకున్నారు. రాత్రి వరకూ వైద్యం అందించకపోవడంతో నాగరాజు సిబ్బందిని ప్రశ్నించగా రేణుకను తిడుతూ నొప్పులు రావాలని చెప్పి ఆమె పొట్టపై కాలుతో తొక్కారు. సోమవారం తెల్లవారుజామున సాధారణ ప్రసవం చేసి బాబును బయటకు తీసినా, శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా వైద్యశాలకు రెఫర్ చేశారు. నాగరాజు కుటుంబ సభ్యులు శిశువును తీసుకుని అక్కడికి వెళ్లగా, పరిస్థితి విషమించి పసికందు మృతిచెందాడు. ఈ ఘటనపై నాగరాజు సూర్యాపేట డీఎంహెచ్‌వో కోటాచలానికి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో డీఎంహెచ్‌వో హుజూర్‌నగర్ ఏరియా వైద్యశాలకు వచ్చి విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. శిశువు పోస్టుమార్టమ్ రిపోర్ట్ వివరాలు తీసుకుంటామని తెలిపారు. కాగా, డెలివరీ కోసం ప్రభుత్వ దవాఖానకు వస్తే డ్యూటీ డాక్టర్ విధుల్లో లేరని, నర్సులు అమానవీయంగా ప్రవర్తించారని డీఎంహెచ్‌వో ఎదుట రేణుక కన్నీటిపర్యంతమైంది. నిండు గర్భంతో ఉన్న తనను నర్సులు బూతులు తిడుతూ కొట్టారని, కడుపుపై తొక్కారని బోరున విలపించింది. డ్యూటీ డాక్టర్‌తో పాటు నర్సులపై చర్యలు తీసుకోవాలని రోదిస్తూ చెప్పింది.

పసిబిడ్డను బలితీసుకున్నరు

హుజూర్‌నగర్ ఏరియా దవాఖాన వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మా బిడ్డ చనిపోయాడు. సకాలంలో వైద్యం చేయకుండా జాప్యం చేశారు. డాక్టర్ లేకుండా నర్సులు ఇష్టం వచ్చినట్టు వైద్యం చేసి పసిబిడ్డను బలితీసుకున్నరు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

-పాసిపాక నాగరాజు

సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు

అక్రమాలపై సమాచారమిస్తే 10వేల ప్రోత్సాహం: సీఎండీ

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు తీసుకుంటామని సంస్థ సీఎండీ ఎన్ బలరాం వెల్లడించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి విజిలెన్స్ విభాగం పనితీరుపై బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సింగరేణి సంస్థలో అక్రమాలపై కచ్చితమైన సమాచారాన్నిచ్చిన వారికి రూ. 10వేల ప్రోత్సాహక బహుమతినిస్తామని ప్రకటించారు. అక్రమాలపై 94911 44104 నంబర్, vig@sccImines.com మెయిల్‌కు ఆధారాలతో పంపించాలని ఆయన సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్మికులను మోసం చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవలే మెడికల్‌బోర్డుపై ఏసీబీ, నేరదర్యాప్తు సంస్థలతో విచారణ చేయించినట్టు తెలిపారు. సీఐడీ విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక 272 ఎక్స్‌టర్నల్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును విడుదల చేశామని, త్వరలోనే మిగిలిన 327 పోస్టుల ఫలితాలను విడుదల చేస్తామని తెలిపారు.

హెలికాప్టర్ టూరు.. కాంగ్రెస్‌లో పోరు

మంత్రుల మధ్య గాలిమోటర్ పోటీ

- సీఎం రేవంత్‌కు దీటుగా మంత్రులు భట్టి, ఉత్తమ్
- 2 గంటల రోడ్డుమార్గం.. అయినా హెలికాప్టర్
- దుబారాపై సోషల్ మీడియాలో విమర్శలు
- సీఎం సీరియస్.. కోమటిరెడ్డి హెలికాప్టర్ టూర్ రద్దు

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): పొద్దున లేస్తే గత బీఆర్ఎస్ సర్కార్‌పై ఒంటి కాలుతో లేచే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు తమ మధ్య ఆధిపత్య పోరులో సర్కారు సొమ్మును దుబారా చేస్తున్నారా? అంటే అందుకు వాళ్లు చేస్తున్న టూర్లే నిదర్శనంగా నిలుస్తున్నాయి. అవసరం ఉన్న సమయంలోనో.. అత్యవసర సమయంలో హెలికాప్టర్ ప్రయాణాలు అంటే ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. కానీ చీటికిమాటికి హెలికాప్టర్‌లో రావటం కాంగ్రెస్ సర్కార్ పెద్దలు ఫ్యాషన్‌గా ఫీల్ అవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మరో సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెలికాప్టర్ జర్నీ కోసం ఢీ అంటే ఢీ అంటున్నారు. ఇదే అదనుగా మిగతా మంత్రులు 'గాలి ప్రయాణాల'కు సై అంటుండటం చర్చనీయాంశంగా మారింది. ఈ చర్చ బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెలికాప్టర్ ప్రయాణం రద్దుకు కారణమైనట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహంతో కోమటిరెడ్డికి అధికారులు హెలికాప్టర్ ఇవ్వకపోవటం చర్చనీయాంశంగా మారింది.

పోటీ పడి హెలికాప్టర్ ప్రయాణం కోసం క్యూ

సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ ప్రయాణం సాధారణమే. కానీ సీఎం కంటే తామే సీనియర్లం.. హోదా పక్కనపెడితే పాలన వ్యవహారాల్లో సైతం తామే అనుభవజ్ఞులం అనే ధోరణితో ఇతర మంత్రులు కనిపిస్తున్నారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వంటివాళ్లు రేవంత్‌రెడ్డి తమకంటే ఎక్కువేంటన్న వైఖరిని ప్రదర్శిస్తున్నారు. అందుకే రేవంత్ ఒక్కసారి హెలికాప్టర్ ఎక్కితే తాము రెండు సార్లు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. కొన్నిసార్లు గంటలో రోడ్డుమార్గంలో వెళ్లే కార్యక్రమానికీ హెలికాప్టర్ జర్నీకే మొగ్గు చూపుతుండటం చర్చకు దారితీసింది. ఈ మధ్య నల్లగొండ జిల్లాలో మంత్రుల పర్యటనలను పరిశీలిస్తే హెలికాప్టర్‌ను ఎలా వాడేస్తున్నారో అర్థం అవుతుంది. బుధవారం సొంత జిల్లా నల్లగొండ పరిధిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఒక్కరే నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియాతోపాటు మిర్యాలగూడలో పర్యటించాల్సి ఉన్నది. ఈ పర్యటనకు హెలికాప్టర్‌లో వస్తున్నట్టు ముందుగా అధికార పర్యటన షెడ్యూల్ విడుదలైంది. వాస్తవంగా హైదరాబాద్ నుంచి బయల్దేరితే సరిగ్గా రోడ్డుమార్గంలో గంటన్నరలో ఇక్కడ ఉండవచ్చు. హాలియాలో గురుపూజోత్సవం, మిర్యాలగూడలో ఫ్లైఓవర్ల శంకుస్థాపనతో పాటు గురుపూజోత్సవ కార్యక్రమాలకు కోమటిరెడ్డి హాజరు కావాల్సి ఉన్నది. హెలికాప్టర్ వినియోగంపై విమర్శలు రావటంతో ప్రభుత్వ వర్గాల ద్వారా సీఎం దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. దాంతో హెలికాప్టర్ ఇవ్వొద్దని సంబంధిత వర్గాలకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. దీంతో కోమటిరెడ్డికి ఊహించని షాక్ తగిలింది. అప్పటికప్పుడు రోడ్డుమార్గంలో బయల్దేరిన కోమటిరెడ్డి.. హాలియా పర్యటనను రద్దు చేసుకుని నేరుగా మిర్యాలగూడకు చేరుకున్నారు.

ఇటీవల హెలికాప్టర్ పర్యటనలివే..

- ఆగస్టు 2వన నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల చేసేందుకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెలికాప్టర్‌లోనే వచ్చి వెళ్లారు.
- ఆగస్టు 9న సుంకిశాల పర్యటనకు మంత్రులు ఉత్తమ్, తుమ్మల, మండలి చైర్మన్ గుత్తా హెలికాప్టర్‌లో వచ్చారు. హైదరాబాద్ నుంచి ఉత్తమ్, గుత్తా హెలికాప్టర్‌లో వచ్చి ఖమ్మం నుంచి కోదాడ వచ్చిన మంత్రి తుమ్మలను ఎక్కించుకుని తిరిగి సుంకిశాలకు చేరుకున్నారు. తుమ్మల నాగేశ్వర్‌రావుమే కోదాడ ల్యాండ్ అయ్యి అక్కడి నుంచి సుంకిశాలకు వచ్చారు.
- ఆగస్టు 15న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ జెండావిష్కరణ కోసం సూర్యాపేటకు హెలికాప్టర్‌లో వెళ్లారు. అక్కడ ఆయనను దించాక నల్లగొండకు ఖాళీగా హెలికాప్టర్ వచ్చింది. ఇక్కడ స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎక్కించుకుని తిరిగి సూర్యాపేటలో హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది. అక్కడి నుంచి ఉత్తమ్, కోమటిరెడ్డి కలిసి కొత్తగూడెంలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు హెలికాప్టర్‌లో వెళ్లారు.
- ఆగస్టు 30న భువనగిరి లోక్‌సభ స్థాయి ఇరిగేషన్ మీటింగ్‌కు మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెలికాప్టర్‌లో రాగా, హెలిప్యాడ్ వద్ద సీఎం పర్యటన తరహాలో మెటల్ డిటెక్టర్ తనిఖీలు చేపట్టారు. తాము సీఎంకు తక్కువేం కాదన్న ధోరణితోనే మెటల్ డిటెక్టర్ తనిఖీలకు మంత్రులు ఆదేశాలిచ్చినట్టు సమాచారం. ఈ తరహా తనిఖీ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పోలీసులకు మధ్య గొడవకు దారితీసింది.
- ఈ నెల 11న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారు.



హెలికాప్టర్‌లో పర్యటనకు వచ్చిన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి(ఫైల్)

రుణమాఫీ అంకెల గారడీ

- చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత
- కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు డబ్బులే డైవర్ట్ చేసిన్రు
- రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం

జగిత్యాల, సెప్టెంబర్ 18: 'కాంగ్రెస్ ప్రభుత్వం జబ్బలు చరుచుకుంటూ గొప్పలు చెప్పుకుంటున్న రుణమాఫీ పూర్తిగా అంకెల గారడీ. చేసింది గోరంత అయితే, చెప్పుకునేది కొండంత' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. జిల్లాలో రుణమాఫీ కాని రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆధ్వర్యంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, రైతులతో కలిసి బుధవారం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కుర్చీలో కూర్చునే దాకా ఓ మాట, కూర్చున్నాక మరో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. డిసెంబర్ 9న రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసా కింద పంట పెట్టుబడి, రైతు కూలీలకు డబ్బులు ఇస్తామని మాయమాటలు చెప్పారని, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు పైసలే రుణమాఫీకి డైవర్ట్ చేశారని, అనేక ఆంక్షలు పెట్టి వేలాది మందికి మాఫీ ఎగ్గొట్టారని, పైకి మాత్రం రైతులందరికీ రూ.2లక్షలు మాఫీ చేసి బడాయి కొడుతున్నారని ధ్వజమెత్తారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని, లేదంటే రైతు ఉద్యమం మొదలవుతుందని, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.



జగిత్యాల కలెక్టర్ ఆవరణలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత



వరంగల్ జిల్లా పర్వతగిరిలో బ్యాంకు బయట విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్ ధోకా సర్కార్

- రైతులను నిండా ముంచింది
- రుణమాఫీపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతులకు న్యాయం చేయాలని వినతి

పర్వతగిరి, సెప్టెంబర్ 18: రైతులను నిండాముంచిన కాంగ్రెస్ ధోకా సర్కార్ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. బుధవారం ఆయన వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు వెళ్లి రుణమాఫీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు పరిధిలో 600 మంది రైతులు రూ.6 కోట్ల రుణం తీసుకుంటే కేవలం 200 మంది రైతులకు రూ. కోటీ 30 లక్షలు రుణమాఫీ అమలైందని సిబ్బంది తెలిపారు. వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతులకు పూర్తిగా అన్యాయం జరిగిందని, రుణమాఫీ చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలను మోసగించడం తప్ప ఆచరణలో మాత్రం అమలు చేయడంలేదని వాపోయారు. రైతుబంధుకు రాంరాం చెప్పి.. రుణమాఫీ పేరుతో అనేక ఆంక్షలు విధించి రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని రైతన్నలకు సూచించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీలు మాడుగుల రాజు, కర్నిళ్ల మోహన్‌రావు, మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, అమడగాని రాజు, బానోతు వెంకన్న పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి తహసీల్ కార్యాలయం వద్ద రైతు ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి

రుణమాఫీ చేయకుంటే సచివాలయం ముట్టడిస్తాం

- మిరుదొడ్డి మండల రైతులు, బీఆర్ఎస్ నాయకులు
- తహసీల్ కార్యాలయం ఎదుట వెయ్యి మంది రైతుల ధర్నా

మిరుదొడ్డి, సెప్టెంబర్ 18: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ వందశాతం పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, రైతులు ఆందోళనకు దిగారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం వందలాది మంది రైతులు బైఠాయించారు. 10 గ్రామాలకు చెందిన వెయ్యి మందికి పైగా రైతులు ధర్నా నిర్వహించారు. రుణమాఫీ కాని 780 మంది రైతుల జాబితాను డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌కు అందజేశారు. ఏవేవో కొర్రీలు పెట్టి తమకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ సర్కారు అన్యాయం చేస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాకులు మాని వెంటనే రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రైతులకు సంఘీభావం తెలిపారు. వందశాతం రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి కలెక్టరేట్, సచివాలయం ముట్టడిస్తామని ఫోన్‌లో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆందోళనలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ సర్పంచులు బాల్‌రాజు, బాల్‌నర్సయ్య, రైతు విభాగం మండలాధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దళితబంధు లబ్ధిదారుల ఆందోళన




కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో దళితబంధు లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. రెండో విడత కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున నిధులు విడుదల చేయకుండా సర్కార్ ఇబ్బంది పెడుతుందంటూ బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. 'మమ్ముల గోస పెట్టినోళ్లు మా ఉసురు తాకిపోతరు' అంటూ వారు ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు. – హుజూరాబాద్ టౌన్

గవర్నర్ గారూ.. రుణమాఫీ అయ్యేలా చూడండి

- కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాటిచ్చింది
- ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాఫీ చేయలేదు
- గవర్నర్‌కు ఉత్తరాలు రాసిన నెన్నెల మండల రైతులు

నెన్నెల, సెప్టెంబర్ 18: 'అయ్యా గవర్నర్ గారూ.. మాకు రుణమాఫీ కాలేదు.. మమ్మల్ని పట్టించుకుని రుణమాఫీ అయ్యేలా చూడండి' అంటూ 300 మందికిపైగా రైతులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఉత్తరాలు రాశారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని మైలారం, గొల్లపల్లి, ఘన్‌పూర్, నందులపల్లి, నెన్నెల, జంగాల్‌పేటకు చెందిన రుణమాఫీ కాని రైతులందరూ బుధవారం మండలంలోని పోస్టాఫీస్‌కు చేరుకున్నారు. రాజ్‌భవన్‌కు రిజిస్టర్ పోస్టు చేశారు. ఈ ఉత్తరాల్లో రైతు వివరాలతోపాటు తీసుకున్న రుణం, బ్యాంకు ఖాతా నంబర్ రాశారు. 'కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు పంట రుణం రూ.2 లక్షలు మాఫీ చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టింది. ప్రభుత్వం ఏర్పాటయ్యాక బడ్జెట్ ప్రసంగంలో కూడా రుణమాఫీ చేస్తున్నట్టు తమ ద్వారా(గవర్నర్) మాట్లాడించారు. ఇటీవల మూడు విడతలుగా రుణమాఫీ చేశారు. కానీ.. మాకు అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాలేదు. రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రెండు చేతులతో ప్రార్థిస్తున్నాం..' మీ రైతు సోదరుడు అంటూ గవర్నర్‌కు ఉత్తరాలు రాసి నెన్నెల పోస్టాఫీసులో రిజిస్టర్ పోస్టు చేశారు.



గవర్నర్‌కు రాసిన ఉత్తరాలతో పోస్టాఫీస్ వద్ద మంచిర్యాల జిల్లా నెన్నెల మండల రైతులు

మాఫీ అంటివి.. నాకెందుకు కాలేదు?



ఓట్లప్పుడేమో పంట లోను ఉన్నోళ్లకు రెండు లచ్చలు మాఫీ జేస్తానని ఓట్లకచ్చిండ్లు. ఓట్లయినంక కొందరికే చేసిండ్రు. నేను నెన్నెల బేంకులో రూ. లచ్చఅరవై వేల పంట లోను తీసుకున్న. మాఫీ జేస్తరని నమ్మి ఓటు వేసిన. కానీ.. ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలే. ఎవుసం పని ఇడిసి పెట్టి లోను మాఫీ కాలేదని బేంకుల సుట్టూ తిరిగినా ఎవరు సప్పుడు చేయట్లే. నా భార్యకు కూడా పంట లోను ఉంది. ఆమేకు కూడా రాలేదు. ఇక్కడకు వచ్చి పెద్దాయనకు ఉత్తరం రాసిన. న్యాయం జేస్తడని అనుకుంటున్న. – సోంసెట్టి మల్లయ్య, రైతు, నందులపల్లి

నేడు చలో ప్రజాభవన్

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరుగుతున్న నేపథ్యంలో రుణమాఫీపై నిర్ణయం తీసుకొనేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రైతులంతా తరలిరావాలని కోరారు. తమ పోరాటానికి అన్ని కుల సంఘాలు మద్దతు తెలపాలని కోరారు. రుణమాఫీ కాలేదనే బాధతో రైతులు చనిపోతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ఏకమవుతున్న రైతులు చలో ప్రజాభవన్ ఆందోళనకు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఎక్కడికక్కడ గ్రామాల వారీగా రుణమాఫీ కాని రైతులు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నట్టు తెలిసింది. ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. అయితే కఠిన నిబంధనలు, షరతులతో అర్హులైన రైతుల సంఖ్యలో కోత పెట్టారు. దాదాపు 70 లక్షల మంది రుణ గ్రహీతలు ఉండగా 42 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు 23 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసింది. ప్రభుత్వం పేర్కొన్న అన్ని అర్హతలు ఉన్న రైతుల్లో చాలామందికి ఇంకా మాఫీ కాలేదు. దీంతో ఆయా రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.



అసోంలోని నగాన్ జిల్లా పామ్‌గోన్ గ్రామంలో మొక్కలు నాటుతున్న స్థానికులు

అసోంలో 'గ్రీన్ ఇండియా చాలెంజ్'కు విశేష స్పందన

ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటిన స్థానికులు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): హరిత భారత్ సాధనే లక్ష్యంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ అసోంలో మొదలుపెట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. 2030 నాటికి అసోంలో ఒక కోటి మొక్కలు నాటాలనే లక్ష్యంతో గ్రీన్ ఇండియా చాలెంజ్ పనిచేస్తున్నది. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నగాన్ జిల్లా పామ్‌గోన్ గ్రామంలో ఒకేచోట 74 మొక్కలను నాటారు. పద్మశ్రీ, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన జాదవ్ పయంగ్ స్ఫూర్తితో మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన కోటి మొక్కల కార్యక్రమానికి తమ మద్దతు ఉంటుందని అస్సామీలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పర్యావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు క్రమంగా రుతువుల మార్పులకు కూడా కారణమవుతున్నాయని సంతోష్‌కుమార్ చెప్పారు. పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి, సంరక్షిస్తే పర్యావరణ మార్పులను అడ్డుకోవచ్చని, ఇందుకోసం స్థానికుల మద్దతు తీసుకుంటామని తెలిపారు. అసోంలో ఏప్రిల్‌లో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టామని, ఇప్పటిదాకా రెండున్నర లక్షల మొక్కలు నాటామని ఇగ్నైటింగ్ సంస్థ వ్యవస్థాపకుడు కరుణాకర్ తెలిపారు. ఈ మొక్కలను జియోట్యాగ్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రీతురాజ్, రోసీదేవి, వలంటీర్లు పాల్గొన్నారు.

బిల్లులు రాక రోడ్డెక్కిన పాలరైతులు

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- జాతీయ రహదారిపై పాలు పారబోసి నిరసన

ఆమనగల్లు, సెప్టెంబర్ 18: మూడు నెలలుగా విజయ డెయిరీ పాలశీతలీకరణ కేంద్రాల్లో పాడి రైతులకు బిల్లులు చెల్లించడం లేదు. దీంతో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పాడి రైతులు బీఆర్ఎస్ నేతలతో కలిసి ధర్నా నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారికి ర్యాలీగా చేరుకుని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో రోడ్డుపై పాలు పారబోసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నేనావత్ అనురాధ, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్‌గుప్తా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 15 రోజులకోసారి బిల్లులు చెల్లించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలుగా పాల బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో ట్రాక్టర్లతో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.



ఆమనగల్లులో హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై పాలు పారబోస్తూ నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు, పాడి రైతులు

జలవిహార్‌పై హైడ్రాకు సీపీఐ ఫిర్యాదు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న జలవిహార్‌పై హైడ్రా చర్యలు తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది. జలవిహార్ అక్రమ కట్టడాలను తొలగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు పద్మ, బాల మల్లేష్‌లు బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. హుస్సేన్ సాగర్‌ను ఆక్రమించుకుని పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు చేపట్టిన జలవిహార సంస్థ కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తుందని పేర్కొన్నారు. జలవిహార్ నుంచి కలుషిత నీటిని సాగర్‌లోకి వదులుతున్నారని ఆరోపించారు. కాగా, అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని రంగనాథ్ స్పష్టం చేశారు.

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి: జూలకంటి

భువనగిరి, సెప్టెంబర్ 18: చౌటుప్పల్ మండలం మీదుగా వెళ్తున్న రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చి బాధితులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి మళ్లీ వర్ష సూచన

- 20, 21 తేదీల్లో భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం రాష్ట్రంపై పెద్దగా లేకపోయినా.. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో మార్పులు, నైరుతి దిశగా వీస్తున్న గాలులతో తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉదయం ఎండ తీవ్రత ఉన్నా.. సాయంత్రానికి వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తాయని చెప్పింది. సెప్టెంబర్ 20, 21 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేసింది. 21న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిలాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొన్నది.

డిజిటల్ సాగు రైతాంగానికి ముప్పు

- బీజేపీ వ్యవసాయ విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలి
- ఎంపీ, ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు అమ్రారామ్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌తో దేశ రైతాంగానికి తీరని ముప్పు పొంచి ఉన్నదని సికార్ ఎంపీ, ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు అమ్రారామ్ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డిజిటలైజేషన్ పేరుతో కార్పొరేట్ల చేతుల్లో వ్యవసాయ రంగాన్ని పెట్టజూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (డీఏఎం)కు అధిక ప్రాధాన్యం ఇస్తూ 7 కొత్త పథకాలను కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందని గుర్తుచేశారు. అంతర్జాతీయ ఆర్థిక పెట్టుబడిదారుల డిమాండ్లకు అనుగుణంగా దేశ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడానికే ఈ ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, వ్యవసాయ ఉపకరణాలన్నింటిపై జీఎస్టీని ఉపసంహరించడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని, రైతుల రుణభారాన్ని రద్దు చేయాలని కోరారు.

కేకే-5 గనిలో ప్రమాదం.. కార్మికుడి మృతి


మందమర్రి, సెప్టెంబర్ 18: మందమర్రి ఏరియాలోని సింగరేణి కేకే -5 గనిలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో కోల్‌కట్టర్ కార్మికుడు మోకెనపల్లి లక్ష్మణ్(44) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం..మందమర్రి పట్టణంలోని రెండోజోన్ కాలనీకి చెందిన లక్ష్మణ్ రెండో షిఫ్టు విధులకు వెళ్లి గనిలో నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. స్థానిక కేకే డిస్పెన్సరీకి తరలించగా, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రామకృష్ణాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు లక్ష్మణ్ మృతి చెందినట్టు నిర్ధారించారు. ఏరియా జీఎం జీ.దేవేందర్ ఘటనా స్థలాన్ని సందర్శించి గని అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. లక్ష్మణ్ మృతి సాధారణ మరణంగా అధికారులు పేర్కొంటున్నారనే విషయం తెలుసుకొని గని వద్ద కార్మికులు, టీబీజీకేఎస్ తదితర కార్మిక సంఘాల నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. చివరకు లక్ష్మణ్ విధి నిర్వహణలోనే మరణించినట్టు యాజమాన్యం ప్రకటించింది.

కేసీఆర్ హయాంలోనే పారిశ్రామిక పరుగులు

పదేండ్లలో ఎంఎస్ఎంఈల వృద్ధి 15 శాతం

ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో వెల్లడి

కరోనా తర్వాత మూతపడిన యూనిట్లు తెలంగాణలోనే అతి తక్కువ అని స్పష్టీకరణ





హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా ఎంతో ప్రగతి సాధించినట్టు ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఎంఎస్ఎంఈ పాలసీలో వివరించింది. టీఎస్ ఐపాస్ ద్వారా ఎంఎస్ఎంఈల నమోదు ప్రక్రియ అత్యధికంగా జరిగినట్టు వెల్లడించింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వృద్ధిరేటు ఎంతో మెరుగ్గా ఉన్నదని తెలిపింది. ఎంఎస్ఎంఈల సగటు పెట్టుబడి రూ.2.15కోట్లకు పెరిగినట్టు పేర్కొంది. తరచూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిందించే రాష్ట్ర సర్కారు, పరిశ్రమల అభివృద్ధిలో కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలను ఒప్పుకోక తప్పలేదు. ఎంఎస్ఎంఈ పాలసీలో గత ప్రభుత్వం సాధించిన ప్రగతిని అంకెలతో సహా వివరించింది. టీజీ-ఐపాస్ పోర్టల్‌లో నమోదైన కొత్త ఎంఎస్ఎంఈ యూనిట్లను పరిశీలిస్తే, గడిచిన పదేండ్లలో వరుసగా వృద్ధి నమోదైంది. పదేండ్లలో 11.15 శాతం నుంచి 15 శాతం వరకు వృద్ధి నమోదైనట్టు ప్రభుత్వం వివరించింది. నేడు తెలంగాణలో ఎంఎస్ఎంఈల సంఖ్య 26 లక్షలుగా ఉన్నదని వెల్లడించింది. సగటు పెట్టుబడులు కూడా 115 శాతం పెరిగినట్టు తెలిపింది. ఎంఎస్ఎంఈలో ఉపాధి అవకాశాలు 20 శాతం పెరిగినట్టు, ఎస్సీ, ఎస్టీలు 30శాతం ఎంఎస్ఎంఈల్లో ఉపాధి పొందినట్టు స్పష్టం చేసింది. కొవిడ్ కారణంగా దేశవ్యాప్తంగా పరిశ్రమలు పెద్ద ఎత్తున మూతపడినా తెలంగాణలో మాత్రం ఆ సంఖ్య నామమాత్రంగా ఉండడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన పారిశ్రామిక అనుకూల విధానాలతో పరిశ్రమలు కొవిడ్ తర్వాత త్వరగా కోలుకున్నాయి.

చేయూతనందించి యూనిట్ల పునరుద్ధరణ

బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకొల్పిన తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ (టీఐహెచ్‌సీఎల్) నష్టాల్లో కూరుకుపోయిన 1340 యూనిట్లకు సహకారం అందించడమే కాకుండా మూతపడిన 115 యూనిట్లను పునరుద్ధరించింది. తెలంగాణ పదేండ్లలో పారిశ్రామిక రంగంలో ఇతర రాష్ట్రాల కన్నా శరవేగంగా వృద్ధి సాధించినట్టు ప్రభుత్వం పేర్కొంది. పరిశ్రమల కోసం జరిపే భూముల కొనుగోలులో స్టాంప్ డ్యూటీ మినహాయింపును యథావిధిగా కొనసాగించడంతో పాటు టీ-ప్రైడ్, టీ-ఐడియా పథకాల రాయితీలను స్వల్పంగా పెంచారు. కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన టీఎస్ ఐపాస్ వంటి సింగిల్ విండో విధానం, స్నేహపూర్వక విధానాలు, నిరంతర విద్యుత్తు సరఫరా తదితర అనేక కారణాలతో తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో ప్రముఖంగా ఎదిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పకనే చెప్పింది.

గడచిన పదేండ్లలో 11.15 శాతం పెరిగిన ఎంఎస్ఎంఈలు (టీఎస్ ఐపాస్ పోర్టల్‌లో నమోదు)

ఆర్థిక సంవత్సరం	పరిశ్రమలు
2014-15	151
2015-16	1343
2016-17	1606
2017-18	2587
2018-19	2606
2019-20	2869
2020-21	3309
2021-22	3974
2022-23	3061
2023-24	2622

కరోనాతో 2020-23మధ్య రాష్ట్రాలవారీగా మూతపడిన ఎంఎస్ఎంఈ యూనిట్లు

రాష్ట్రం	మూతపడిన యూనిట్లు
తెలంగాణ	231
గుజరాత్	1626
హర్యానా	558
కర్ణాటక	804
మహారాష్ట్ర	5082
తమిళనాడు	2456

తెలంగాణలో పనిచేస్తున్న, నమోదు చేసుకున్న ఎంఎస్ఎంఈల సంఖ్య..

సర్వే	ఎంటర్‌ప్రైజ్ స్వభావం	సూక్ష్మ	చిన్న	మధ్యతరహా	మొత్తం
జాతీయ నమూనా సర్వే	తయారీ, సేవలు, రిటైల్, హోల్‌సేల్	25,94,000	10,000	1,000	26,05,000
ఉద్యమ్ నమోదు	తయారీ, సేవలు, రిటైల్, హోల్‌సేల్	8,64,202	26,560	3,028	8,93,790
జీవోటీజీ, 2023	తయారీ, సేవలు	34,953	18,394	1,411	54,758
టీజీ ఐపాస్ నమోదు	తయారీ, సేవలు	15,434	6,106	666	22,206



బీఆర్ఎస్ విజయాలు కాంగ్రెస్ ఖాతాలోనా?

- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పాలనలో ఎంఎస్ఎంఈలు ఎంతో అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలిచాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలు మూతపడ్డా.. రాష్ట్రంలో అనుసరించిన టీఎస్ఐపాస్ లాంటి విధానాలు ఎంఎస్ఎంఈలను దృఢంగా నిలిపాయని బుధవారం ఎక్స్ వేదికగా తెలిపారు. పెట్టుబడుల్లో 115 శాతం పెరుగుదలతో దేశంలో అగ్రగామిగా నిలవడమే కాక.. ఉద్యోగాల కల్పనలో 20శాతం వృద్ధిరేటు సాధించిందని చెప్పారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు 30శాతం ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బీఆర్ఎస్ పాలనలో సాధించిన ఘనతను వారి ఖాతాలో వేసుకుంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎంఎస్ఎంఈ అభివృద్ధికి తాము చేసిన కృషి ఏమిటో, భవిష్యత్తు కార్యాచరణ ఏమిటో చెప్పకుండా గత ప్రభుత్వ విజయాలతో కాలం గడపడం శోచనీయమని మండిపడ్డారు.

దాచేస్తే దాగని ప్రగతి



- కేసీఆర్ చరిత్రను చెరిపేయాలనుకోవడం భ్రమే
- టీఎస్-ఐపాస్‌తో రాష్ట్ర పారిశ్రామికం పరుగులు
- కాంగ్రెస్ సర్కార్ లెక్కలే నిదర్శనం
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): పదేండ్ల కేసీఆర్ పరిపాలనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి పరుగులు పెట్టిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అది తాను చెబుతున్నది కాదని స్వయంగా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా లెక్కలతో సహా వివరించిందని ఆయన ఉదహరించారు. కేసీఆర్‌పై బురద చల్లాలని ఆరోపణలు చేసినప్పటికీ సాధ్యపడలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తక్కువ చేసి చూపాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ప్రయత్నించినప్పటికీ కుదరలేదన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎంఎస్ఎంఈ పాలసీలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తావించిన పలు అంశాలను ఆయన గుర్తుచేశారు.

గత పదేండ్లలో వృద్ధిరేటుకు సాక్ష్యాలివీ..

గత పదేండ్లలో ఎంఎస్ఎంఈల వృద్ధిరేటు 11 శాతం నుంచి 15 శాతం ఉందని కాంగ్రెస్ ప్రభుత్వమే ఒప్పుకున్నట్టు కేటీఆర్ తెలిపారు. 2018-2023 మధ్యలో టీఎస్-ఐపాస్ ద్వారా పెరిగిన సగటు పెట్టుబడులు 115 శాతం అవగా, జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటా 10 శాతం వృద్ధి చెందిందని వివరించారు. దీన్నిబట్టి ఏటా ఎంఎస్ఎంఈల సంఖ్య 15 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈల కారణంగా ఉపాధి 20 శాతం పెరిగిందని, ఎస్సీ, ఎస్టీ మహిళలు 30 శాతం ఉద్యోగాలు పొందారని వివరించారు. ఇవి బీఆర్ఎస్ లెక్కలు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన లెక్కనేనని కేటీఆర్ వెల్లడించారు. టీఎస్-ఐపాస్ వంటి ప్రగతిశీల విధానాలు, చిన్న పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహకాలతోనే ప్రగతి సాధ్యమైందన్నారు. కేసీఆర్‌ను తక్కువ చేయాలనుకొని కురచ బుద్ధితో విమర్శలు చేసినంత మాత్రాన నిజాలు దాగవని చురకలంటించారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అన్నదెంత నిజమో.. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నది కూడా అంతే నిజమన్నారు.



ఎంఎస్ఎంఈ పాలసీని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు

వడ్డించిన విస్తరి

- పరిశ్రమల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం
- ప్రోత్సాహకాలపై గత ప్రభుత్వ విధానాలు కొనసాగిస్తాం
- ఎంఎస్ఎంఈ పాలసీ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ వడ్డించిన విస్తరిలా ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చైనాకు ప్రత్యామ్నాయం భారత్ అయితే, భారత్‌కు ప్రత్యామ్నాయం తెలంగాణ అని చెప్పారు. ప్రోత్సాహకాల విషయంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాలసీ-2024ను సీఎం బుధవారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి ఔటర్ రింగురోడ్డు ఎంతగానో తోడ్పడుతున్నదని, ఓఆర్ఆర్‌కు సమాంతరంగా రీజనల్ రింగురోడ్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఔటర్‌ను ట్రిపుల్‌ఆర్‌ను అనుసంధానం చేసేలా రేడియల్ రోడ్లను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. లక్షల ఎకరాల భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా, ఉత్పత్తులు పెంచేలా మౌలిక సదుపాయాలను పెంచుతున్నామని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్తు, నీరు, అందిస్తామని, భూములు సమకూర్చుతామని, భూములు కోల్పోతున్న రైతులను అందులో భాగస్వాములను చేస్తామని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దళితులు పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు అవసరమైన సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఫ్యూచర్ సిటీలో లైఫ్‌సైన్సెస్, ఫార్మా పరిశ్రమలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంఎస్ఎంఈ పాలసీలోని ప్రధానాంశాలు:

- ప్రభుత్వం ఏర్పాటుచేసే పారిశ్రామిక పార్కుల్లో 20 శాతం ప్లాట్లు ఎంఎస్ఎంఈలకు రిజర్వ్.
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య 10 పారిశ్రామికవాడల ఏర్పాటు. ఇందులో 5 ఎంఎస్ఎంఈ పార్కులు. వీటిలో ఒకటి మహిళలకు ప్రత్యేకం.
- ఎంఎస్ఎంఈ పార్కులో 5 శాతం ప్లాట్లు మహిళలకు, 15 శాతం ఎస్సీ, ఎస్టీలకు.
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య పారిశ్రామిక, వాణిజ్య, మిశ్రమ భూవినియోగ జోన్లు. పెరి-అర్బన్ ప్రాంతాల్లో మరిన్ని గ్రీన్, ఆరెంజ్ ఎంఎస్ఎంఈలకు అనుమతి.
- భూమి కొనుగోలుపై ఎస్సీ, ఎస్టీలకు రాయితీ 33 శాతం నుంచి 50 శాతానికి పెంపు. గరిష్ఠ రాయితీ పరిమితి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంపు.
- ప్రైవేట్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల అభివృద్ధికి ప్రోత్సాహం. అందులో 20 శాతం ఎంఎస్ఎంఈలకు.
- పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌లో ప్రైవేట్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం. మహిళల యాజమాన్యంలోని ఎంఎస్ఎంఈలకు 10 శాతం అదనపు రాయితీని 20 శాతానికి పెంపు. గరిష్ఠ పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంపు.
- పరిశ్రమలు ఎక్కువగా ఉన్న 10 జిల్లాల్లో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు.

10 లక్షల కోట్లకు పన్ను వసూళ్లు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.9.95 లక్షల కోట్ల అడ్వాన్స్ ట్యాక్స్ వసూలయ్యాయి. అలాగే రూ.2.05 లక్షల కోట్లు రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది. క్రితం ఏడాది ఇదే సమయంలో చెల్లించిన దాంతో పోలిస్తే 56.49 శాతం అధికం. ప్రస్తుతేడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 17 వరకు పన్ను వసూళ్లలో నికర వ్యక్తిగత ఆదాయ పన్ను 19 శాతం ఎగబాకి రూ.5.15 లక్షల కోట్లకు చేరుకోగా, కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు 10.55 శాతం ఎగబాకి రూ.4.52 లక్షల కోట్లకు, సెక్యూరిటీస్ ట్రాన్సక్షన్ ట్యాక్స్ నుంచి రూ.26,154 కోట్ల ఆదాయం సమకూరింది.

భెల్ 55 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: ప్రభుత్వరంగ విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(భెల్) గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో రూ.55 కోట్లు చెల్లించింది. ఇందుకు సంబంధించి చెక్‌ను కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి భెల్ సీఎండీ కే సదాశివ్ మూర్తి బుధవారం అందచేశారు. 2023-4 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.87 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది.

జైత్రయాత్రకు బ్రేక్

సెన్సెక్స్ 113, నిఫ్టీ 41 పాయింట్ల పతనం

ముంబై, సెప్టెంబర్ 18: స్టాక్ మార్కెట్ల జైత్రయాత్రకు బ్రేక్‌పడింది. గత కొన్ని రోజులుగా రికార్డుల మీద రికార్డులు సృష్టించిన సూచీలు జారుకున్నాయి. ప్రారంభంలో చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న సూచీలు చివర్లో ఐటీ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో నష్టాల్లోకి పడిపోయింది. వడ్డీరేట్ల తగ్గింపుపై అమెరికా ఫెడరల్ రిజర్వు తీసుకునే నిర్ణయంపై మదుపరులు వేచిచూసే దోరణి అవలభించారు. దీంతో ప్రారంభంలో 246 పాయింట్లు పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 83 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 131.43 పాయింట్లు కోల్పోయి 82,948.23 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 41 పాయింట్లు నష్టపోయి 25,377.55 వద్ద స్థిరపడింది.

ఐటీ కంపెనీల షేర్లు కుదేలు

ఐటీ సంస్థల షేర్లు కుదేలయ్యాయి. ఐటీ దిగ్గజమైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 3.49 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు హెచ్‌సీఎల్ టెక్ 3.15 శాతం, ఇన్ఫోసిస్ 3.09 శాతం, టెక్ మహీంద్రా 2.79 శాతం నష్టపోయాయి. వీటితోపాటు సన్‌ఫార్మా, టాటా స్టీల్, టాటా మోటర్స్, టైటాన్, ఏషియన్ పెయింట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్, రిలయన్స్, ఎన్టీపీసీ, ఎయిర్‌టెల్, మారుతి, కొటక్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, నెస్లె, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్‌లు లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ 3 శాతం, టెక్నాలజీ 2.43 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 1.12 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్, మెటల్, కమోడిటీస్ షేర్లు నష్టపోగా..ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రంగ సూచీ లాభాల్లో ముగిసింది.

ఐపీవోకి ప్యూర్ ఈవీ

హైదరాబాద్, సెప్టెంబర్ 18: ప్రముఖ ద్విచక్ర ఈవీల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఐపీవోకి రావడానికి ప్రణాళికను వేగవంతం చేసినట్లు ప్యూర్ ఈవీ సీఈవో రోహిత్ వదేరా తెలిపారు. దేశీయంగా ద్విచక్ర వాహనాలను వాడేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నారని, వీరిని దృష్టిలో పెట్టుకొని సాంకేతిక పరంగా మార్పులు చేసి నయా ఈవీలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఐదేండ్లలో దేశీయ ద్విచక్ర వాహనాల విక్రయాల్లో 65 శాతం మార్కెట్ వాటా లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఇందుకోసం రిటైల్ అవుట్‌లెట్ల సంఖ్యను పెంచుకోవడంతోపాటు ప్లాంట్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకుంటున్నట్లు చెప్పారు. దీంతో కంపెనీ టర్నోవర్ రూ.2 వేల కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈవీ రంగంలోకి అడుపెట్టి మూడేండ్లలోనే నిర్వహణ లాభాలు ఆర్జించిన సంస్థ తమదేనన్నారు. వచ్చే ఐదేండ్లలో 100 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. ఐఐటీ హైదరాబాద్‌తో ఇప్పటికే భాగస్వామ్యం కలిగివున్న సంస్థ..బ్రిటన్‌కు చెందిన కోవెంట్రీ ఇంజినీరింగ్ సంస్థతో జట్టుకట్టబోతున్నది.

ఎన్‌పీఎస్ వాత్సల్య షురూ

- ప్రారంభించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- ఇక పిల్లల కోసం పెన్షన్ ఖాతాను తెరవనున్న తల్లిదండ్రులు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో భాగంగా వాత్సల్య పథకాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రారంభించారు. దీంతో పెన్షన్ అకౌంట్‌లో మదుపు చేయడం ద్వారా తమ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులకు పొదుపు చేసే అవకాశం దక్కుతున్నది. ఎన్‌పీఎస్ చాలా ఆకర్షణీయమైన రాబడులను అందిస్తుందని, పిల్లల కోసం పొదుపు చేసే చక్కని అవకాశం దీనిద్వారా తల్లిదండ్రులకు దొరికిందని మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు. అలాగే ఈక్విటీల్లో పెట్టుబడుల ద్వారా 14 శాతం, కార్పొరేట్ రుణాల నుంచి 9.1 శాతం, జీ-సెక్యూరిటీలతో 8.8 శాతం రాబడులను ఎన్‌పీఎస్ ఖాతాదారులు పొందారని చెప్పారు. కాగా, పిల్లల కోసం ఇప్పటికే ఉన్న ఎన్‌పీఎస్‌కు ఈ ఎన్‌పీఎస్ వాత్సల్య ఓ పొడిగింపు. ఈ ఎన్‌పీఎస్ అకౌంట్ల నుంచి ఉపసంహరణ కోసం మార్గదర్శకాలు సిద్ధం కావాల్సి ఉన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను జూలైలో పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ స్కీంను పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఈ స్కీం వివరాల్లోకి వెళితే..

- పోస్టాఫీస్ లేదా బ్యాంక్ శాఖల్ని సంప్రదించడం ద్వారా భౌతికంగా ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతాను పిల్లల తల్లిదండ్రులు తెరుచుకోవచ్చు.
- ఆన్‌లైన్ ద్వారా కూడా ఎన్‌పీఎస్ వాత్సల్య అకౌంట్‌ను పొందవచ్చు.
- 18 ఏండ్ల దిగువన ఉన్న పిల్లల కోసం తల్లిదండ్రులు ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. పిల్లలకు 18 ఏండ్లు దాటిన తర్వాత దానంతటదే ఈ ఖాతా రెగ్యులర్ ఎన్‌పీఎస్ అకౌంట్‌గా మారిపోతుంది.
- 60 ఏండ్లు నిండిన తర్వాతే ఖాతాదారునికి పెన్షన్ రావడం మొదలవుతుంది.
- ఏటా కనీస విరాళం రూ.1,000తో ఈ ఖాతాలను తెరుచుకోవచ్చు.
- గత పదేండ్లలో ఎన్‌పీఎస్‌కు 1.86 కోట్ల సబ్‌స్క్రైబర్లు తయారయ్యారు. దీని నిర్వహణ కిందనున్న ఆస్తులు రూ.13 లక్షల కోట్లు.
- ఎన్‌పీఎస్ వాత్సల్య ప్రారంభం కోసం పీఎఫ్‌ఆర్డీఏతో జట్టు కట్టిన బ్యాంకులు.

బీవోఐ 'రుణవిముక్తి'

హైదరాబాద్, సెప్టెంబర్ 18: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ)... ఎన్‌పీఏ ఖాతాదారులకు శుభవార్తను అందించింది. తమ బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకునేందుకు ప్రత్యేకంగా 'సంఝౌతా కార్నివాల్(రుణ విముక్తి) ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తున్నది. రుణ గ్రహీతలు సరైన కారణాలతో వారి రుణాన్ని తిరిగి చెల్లింపుల్లో విఫలమైనవారికి ఈ నెల 21 వరకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. ఈ సువర్ణావకాశాన్ని తమ శాఖను సంప్రదించి ఒకేసారి ఎన్‌పీఏ ఖాతాకు సంబంధించిన రుణాలను వెంటనే చెల్లించి మూసివేసుకోవచ్చునని సూచించింది.

అరబిందో చేతికి జీఎల్ఎస్


హైదరాబాద్, సెప్టెంబర్ 18: అరబిందో ఫార్మా మరో ఔషధ సంస్థను కొనుగోలు చేసింది. ఇప్పటికే జీఎల్ఎస్ ఫార్మా లిమిటెడ్‌లో 51 శాతం వాటాను కొనుగోలు చేసిన సంస్థ..తాజాగా మరో 49 శాతం వాటాను చేజిక్కించుకున్నది. ఇందుకోసం రూ.22.5 కోట్ల నిధులు వెచ్చించింది. ఇందుకు సంబంధించి బుధవారం ఇరు సంస్థల మధ్య అధికారిక ఒప్పందం కుదిరింది. రూ.10 విలువ కలిగిన ప్రమోటర్లకు చెందిన 5,90,361 షేర్లను కొనుగోలు చేసింది. ఈ ఒప్పందం డిసెంబర్ 31 నాటికి పూర్తికాగలదు.

అర శాతం తగ్గిన ఫెడ్ వడ్డీరేటు

నాలుగేండ్లలో ఇదే తొలిసారి ● డిసెంబర్‌లో మరో అర శాతం కోత?

న్యూయార్క్, సెప్టెంబర్ 18: అందరూ అనుకున్నట్లే అగ్రరాజ్యం అమెరికా సెంట్రల్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకున్నది. పడిపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి, నిరుద్యోగాన్ని కట్టడి చేయడానికి ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను అర శాతం తగ్గించింది. 2020 తర్వాత వడ్డీరేట్లను తగ్గించడం ఇదే తొలిసారి కావడం విశేషం. దీంతో పాలసీ రేటు 5.25 శాతం నుంచి 5.50 శాతం స్థాయిలో ఉన్నది. కాగా, డిసెంబర్‌లోనూ మరో అర శాతం కోతకు అవకాశాలుంటాయన్న సంకేతాలిచ్చింది. దీర్ఘకాలికంగా ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడానికి, గడిచిన రెండేండ్లుగా అమెరికాలో జీవన వ్యయాలు అధికం కావడంతో సెంట్రల్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నది. ఫెడ్ నిర్ణయంతో అమెరికా స్టాక్ మార్కెట్లు ఆచితూచి స్పందించాయి. అరశాతం తగ్గించాలని 11 మంది ఫెడ్ గవర్నర్లు ఓటు వేయగా, కేవలం మైకేల్ బౌమెన్ పావు శాతం తగ్గించడానికి ఓటు వేశారు. ఈ నిర్ణయంతో ఇతర దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు కూడా వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు బంగారం ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 22 డాలర్లు ఎగబాకి 2,600 డాలర్ల పైకి చేరుకున్నది.

ఈ ఏడాదికైతే ఇంతే



ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గించేది వచ్చే ఏడాదే: సీఎస్ శెట్టి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: ఆహార ద్రవ్యోల్బణం దెబ్బకు రుణాలపై వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గకపోవచ్చని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అంచనా వేశారు. ఆర్బీఐ రాబోయే అక్టోబర్, డిసెంబర్ నెలల్లో చేపట్టే విధాన సమీక్షల్లోనూ కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచే వీలుందని తాజాగా అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే ఈ ఏడాదికైతే ఇంతేనన్న ఆయన.. వచ్చే ఏడాదిలోనే వడ్డీరేట్ల కోతకు అవకాశాలున్నాయని చెప్పారు. వడ్డీరేట్లకు ఫెడ్ రిజర్వ్ తాజాగా అరశాతం కోతపెట్టిన నేపథ్యంలో ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులూ కోతలకు దిగే వీలున్నది. అయినప్పటికీ శెట్టి పైవిధంగా స్పందించడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ప్రతీ సెంట్రల్ బ్యాంక్‌ను ప్రభావితం చేస్తుంది. కానీ ఆర్బీఐ మాత్రం ఆహార ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొనే వడ్డీరేట్ల తగ్గింపుపై ఓ నిర్ణయానికి వస్తుంది' అని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అయితే వచ్చే ఫిబ్రవరిలో నిర్వహించే ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ రెపో రేటును తగ్గించే వీలుందని ఎస్బీఐ చీఫ్ అంచనా వేశారు. ఆహార ద్రవ్యోల్బణం అప్పటికి శాంతించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అక్టోబర్ 7-9 తేదీల్లో ఆర్బీఐ ద్రవ్యసమీక్ష ఉన్నది. ప్రస్తుతం రెపో రేటు 6.5 శాతం వద్ద ఉన్నది.

సంక్షోభంలో వజ్ర పరిశ్రమ

భారీగా పడిపోయిన ఎగుమతి-దిగుమతులు

క్రమేణా మూతపడుతున్న కర్మాగారాలు

దూరమవుతున్న ఉద్యోగాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: దేశీయ వజ్రాల తయారీ రంగం కుదేలైంది. గడిచిన మూడేండ్లుగా ఎగుమతులు-దిగుమతులు భారీగా పడిపోవడంతో తీవ్ర సంక్షోభాన్నే ఎదుర్కొంటున్నది. దీంతో కర్మాగారాలు మూతపడుతున్నాయి. ఈ పరిస్థితులు డైమండ్ ఇండస్ట్రీలో రుణ ఎగవేతలకు దారితీస్తున్నాయి. పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ దూరమైపోతున్నాయని బుధవారం గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) హెచ్చరించింది.

ఇదీ సంగతి..


ల్యాబ్ ఆధారిత వజ్రాల తయారీ పరిశ్రమ నుంచి గట్టి పోటీ ఎదురవుతుండటంతో సహజసిద్ధమైన సానబెట్టని ముడి వజ్రాల నిల్వలు సంప్రదాయ పరిశ్రమల్లో భారీగా పేరుకుపోతున్నాయని, ఆర్డర్లు కూడా వీటికి తగ్గిపోయాయని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ అంటున్నారు. ఫలితంగా ఫ్యాక్టరీలు మూతబడి, ఉద్యోగులు రోడ్డునపడే దుస్థితి నెలకొందని చెప్పారు. భారతీయ డైమండ్ హబ్‌గా పేరొందిన ఒక్క గుజరాత్‌లోనే ఆర్థిక సమస్యలు తట్టుకోలేక ఇండస్ట్రీకి చెందిన 60 మందికిపైగా బలవన్మరణం పొందినట్టు గుర్తుచేశారు. ఇదిప్పుడు దేశీయ వజ్రాల పరిశ్రమ సంక్షోభానికి నిదర్శనంగా నిలుస్తున్నదన్నారు. తక్షణమే ఈ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారించాలని, అప్పుడే ఈ రంగానికి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు.

అరకొర వ్యాపారం

2021-22లో దేశంలోకి ముడి వజ్రాల దిగుమతులు 18.5 బిలియన్ డాలర్ల మేర జరిగాయి. కానీ 2023-24లో ఇవి 14 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అలాగే వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి వజ్రాలను ఆయా దేశాలు భారత్‌కు ప్రాసెసింగ్ కోసం తిరిగి ఎగుమతి చేస్తుంటాయి. ఉదాహరణకు బోట్స్‌వానా, అంగోలా, దక్షిణాఫ్రికా, రష్యాల నుంచి దుబాయ్ ముడి వజ్రాలను దిగుమతి చేసుకుంటున్నది. వాటిని మళ్లీ భారత్‌కు రీ-ఎక్స్‌పోర్ట్ చేస్తున్నది. ఇలా వస్తున్న వాటి విలువ కూడా 17.5 బిలియన్ డాలర్ల నుంచి 13.1 బిలియన్ డాలర్లకు క్షీణించింది. మార్కెట్‌లో పడిపోయిన వ్యాపార లావాదేవీలకు, డైమండ్ ప్రాసెసింగ్‌కు ఇది నిదర్శనంగా నిలుస్తున్నది. ఇక సానబెట్టిన, పాలీష్డ్ వజ్రాల ఎగుమతి 2021-22లో 24.4 బిలియన్ డాలర్లుగా ఉంటే.. 2023-24లో 13.1 బిలియన్ డాలర్లే. కేవలం రెండేండ్లలో 34.6 శాతం పతనం కనిపించింది. అంతేగాక ఈ వ్యవధిలో విదేశాల్లో అమ్ముడుపోక భారత్‌కు తిరిగొచ్చే వజ్రాల వాటా కూడా 35 శాతం నుంచి 45.6 శాతానికి ఎగిసింది.

కీలక మార్కెట్లలో..

అమెరికా, చైనా, ఐరోపా దేశాల్లో నెలకొన్న ఆర్థిక మందగమన పరిస్థితులు, ద్రవ్యోల్బణం, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు కూడా భారతీయ వజ్రాల పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీశాయని ఈ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పాలీష్డ్ డైమండ్స్‌కు ఇక్కడ గిరాకీ బాగా తగ్గిందని చెప్తున్నారు. వజ్రాలు సహా ఇతర లగ్జరీ ఉత్పత్తుల కొనుగోళ్లకూ ఎవరూ పెద్దగా ఆసక్తి కనబర్చట్లేదని అంటున్నారు. ముఖ్యంగా ల్యాబ్ (ప్రయోగశాల)ల్లో తయారవుతున్న కృత్రిమ వజ్రాలు తక్కువ ధరకే లభిస్తుండటం కూడా సహజమైన వజ్రాలకు డిమాండ్‌ను తగ్గిస్తున్నది.



- సానబెట్టిన, పాలీష్డ్ వజ్రాల ఎగుమతిదారులకు ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ వ్యవధిని ఆర్బీఐ 6 నెలల నుంచి 12 నెలలకు పెంచాలని వజ్రాల పరిశ్రమ డిమాండ్ చేస్తున్నది.
- దేశీయ వజ్రాల పరిశ్రమలో 7 వేలకుపైగా కంపెనీలున్నాయి. వీటిలో వజ్రాల కటింగ్, పాలీషింగ్, ఎగుమతి కార్యకలాపాలు జరుగుతున్నాయి.
- సూరత్, ముంబైల్లోనే ఎక్కువగా ఈ పరిశ్రమలున్నాయి. వీటిలో చిన్న, మధ్యతరహావే ఎక్కువ. అలాగే కుటుంబ వ్యాపారాలే ఇండస్ట్రీలో అధికం.
- భారతీయ డైమండ్ ఇండస్ట్రీపై 13 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్క సూరత్‌లోనే దాదాపు 8 లక్షలకుపైగా ఉన్నారు.
- లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్, రిటైల్, డైమండ్ టూల్ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాలకూ వజ్రాల పరిశ్రమ కీలకంగా ఉన్నది.

ఆన్‌లైన్‌లో శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : తిరుమల శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్ల కోటాను టీటీడీ బుధవారం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. ఈ–సేవా టికెట్ల ఎలక్ట్రానిక్స్ లక్కీ డిప్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్ టికెట్లు పొందిన భక్తులు 22న మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బులు చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. తిరుపతి గోవిందరాజ స్వామివారి ఆలయంలో బుధవారం సాయంత్రం పౌర్ణమి గరుడ సేవను కనులపండువగా నిర్వహించారు.

పంచాయతీల విలీనంపై హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): శంషాబాద్ మండలంలో 51 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పూర్తి వివరాలతో నాలుగు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని పురపాలకశాఖ, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శులు, న్యాయశాఖ కార్యదర్శి, పురపాలక శాఖ డైరెక్టర్, రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్లకు నోటీసులను జారీచేసింది.

వీధికుక్కల దాడుల నియంత్రణకు చర్యలు

వీధికుక్కల నియంత్రణ, వాటి సంరక్షణకు జంతు జనన నియంత్రణ నిబంధనలు 2023 ప్రకారం అన్ని చర్యలు చేపట్టినట్టు పేర్కొంటూ హైకోర్టుకు బుధవారం జీహెచ్‌ఎంసీ నివేదికను సమర్పించింది. దాడుల నియంత్రణ చర్యలు చేపట్టినట్టు చెప్పింది. వీధి కుక్కలకు పెర్గిలైజేషన్ చేస్తున్నట్టు చెప్పింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) 23 నిబంధనల అమలులో భాగంగా తీసుకుంటున్న చర్యల గురించి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి హైకోర్టుకు నివేదిక సమర్పించారు. వీధికుక్కల నియంత్రణకు సరైన చర్యలు చేపట్టడంలేదని, తగిన ఆహారం లేక మనుషులపై దాడి చేస్తున్నాయంటూ వనస్థలిపురానికి చెందిన ఎం విక్రమాదిత్య ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. నిరుడు ఫిబ్రవరి 19న హైదరాబాద్ బాగ్ అంబర్‌పేట్ పాఠశాల విద్యార్థిపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందిన సంఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాన్ని ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణనలోకి తీసుకున్నది.

5.27 కోట్ల మోసం.. బెంగాల్‌లో నిందితుడి అరెస్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిని రూ.5.27 కోట్ల మేరకు మోసం చేసిన కేసులో సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిబ్బంది నిందితుడిని అరెస్టు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ మెడినిపూర్ జిల్లా కొంటై నగరానికి చెందిన సైదుల్ ఇస్లాంఖాన్ జూలైలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిని ఫేక్‌బుక్‌లో స్టాక్ రికమెండేషన్ల ద్వారా అధిక లాభాలు పొందవచ్చని చెప్పి రూ.5.27కోట్ల మేర మోసం చేశాడని పోలీసులు తెలిపారు.

పత్తి క్వింటా @ రూ.7,810

కాశీబుగ్గ, సెప్టెంబర్ 18: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాకు రూ.7810 పలికింది. ఈ సీజన్‌లో అత్యధికంగా మంగళవారం రూ.7860 పలికింది. అంతర్జాతీయ మార్కెట్‌లో తెలంగాణ పత్తికి డిమాండ్ ఉండటంతో మద్దతు ధరను మించి ధరలు పలుకుతున్నట్టు వ్యాపార వర్గాలు తెలిపాయి. కాగా.. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం కొత్తపత్తి వచ్చింది. దీంతో వ్యాపారులు ప్రత్యేక పూజలు చేసి తూకం వేశారు. ఈ సందర్భంగా మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల కొబ్బరికాయ కొట్టి కాంటాను ప్రారంభించారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): వరద బాధితులకు సహాయం అందించేందుకు దాతలు ముందుకొస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిసిన పలువురు సీఎంఆర్‌ఎఫ్‌కు చెక్కులను అందజేశారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు శరణి, ఈడీ పునీత్ రూ.2.5కోట్లు, శ్రీరామ్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వైఎస్ చక్రవర్తి రూ.కోటి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్ వై శోభ రూ.50 లక్షలు, మోల్డ్‌టెక్ ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్ రూ.25 లక్షలు, టెక్నో పెయింట్స్ సంస్థ డైరెక్టర్లు ఆకునూరి శ్రీనివాస్‌రెడ్డి, సీవీఎల్‌ఎన్ మూర్తి, అనిల్ కొండోత్ రూ.20 లక్షలు, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు కన్నెగంటి రమాదేవి, ఉపాధ్యక్షురాలు అడుసుమిల్లి దుర్గా భవానీ, సంయుక్త కార్యదర్శి పల్లవి జోషి రూ.5 లక్షలు, కుమారీ ఆంటీ రూ.50వేలు చెక్కు ఇచ్చారు.

పండుగల సీజన్‌కు 48 ప్రత్యేక రైళ్లు

అక్టోబర్ 21 నుంచి నడుపనున్నట్టు ప్రకటించిన ఎస్‌సీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): దసరా, దీపావళి, ఛత్ పండుగల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో 48ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు అధికారులు బుధవారం తెలిపారు. అక్టోబర్ 21 నుంచి నవంబర్ 13వరకు ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. నాందేడ్–పన్వేల్ మధ్య 24, కొచువెల్లి–నిజాముద్దీన్ మధ్య 16, పుణె–కరీంనగర్ మధ్య 8 సర్వీసులను ఏర్పాటు చేశారు. అలాగే గోరఖ్‌పూర్–మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్య రెండు ప్రత్యేక సర్వీసులు పొడిగించినట్టు అధికారులు ప్రకటించారు. ఈ నెల 21, 22 తేదీల్లో సర్వీసులు నడుస్తాయని పేర్కొన్నారు.

కొలనుపాకలో పూర్వయుగంనాటి ఆనవాళ్లు

6 వేల యేండ్ల నాటి పురామానవుల ఆవాసాలు

గుర్తించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం

